
రష్యా విప్లవం
భారత స్వాతంత్ర్య సంగ్రామం
రూ॥160/- పేజీలు:195




నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

'సత్తా చోరీ'లో బిజెపి సర్కార్ నిమగ్నం
కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

ఇసి బిజెపి కోసమే పనిచేస్తుంది

శత్రువు దాడిచేస్తే
మన గగనతలం అభేద్యం

05

సంపుటి 08, సంచిక: 265 | సోమవారం | 25-08-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



# అరుణ తారకు అంతిమ వీడ్కోలు


## సురవరం సుధాకరరెడ్డికి 'రెడ్ ఆర్మీ' నాలుగు కిలోమీటర్ల కవాతుతో తుది యాత్ర


- అధికార లాంఛనాలతో ప్రభుత్వ గౌరవ వందనం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏపి సిఎం చంద్రబాబు సహా పలువురు ప్రముఖ జాతీయ, రాష్ట్ర రాజకీయ దిగ్గజ నేతలు నివాళి
- మగ్ధూంభవన్ నుంచి గాంధీ ఆసుపత్రి వరకు అంతిమయాత్ర
- దారిపొడవునా ఎర్రజెండాలతో రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు
- ప్రజానాట్యమండలి కళాకారుల విప్లవ గేయాలాపనలు
- సుధాకర్‌రెడ్డి అమర్ హై అంటూ మార్మోగిన నినాదాలు
- భారీగా తరలివచ్చిన సిపిఐ శ్రేణులు, అభిమానులు
- గాంధీమెడికల్ కాలేజీకి భౌతికకాయం అప్పగింత


భౌతికకాయంపై అరుణపతాకం








సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి


సిపిఐ ఎపి నేతలు


బిఆర్ఎస్ నేతలు


టిపిసిసి చీఫ్


గాంధీ ఆసుపత్రికి భౌతికకాయం అప్పగింత

ప్రజాపక్షం/హైదరాబాద్

సిపిఐ అగ్రనేత, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డికి 'రెడ్ ఆర్మీ'తో సిపిఐ ఘనంగా అంతిమ వీడ్కోలు పలికింది. హైదరాబాద్ హియత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సురవరం సుధాకర్‌రెడ్డికి ప్రభుత్వ అధికార లాంఛనాలతో గౌరవ వందనం అనంతరం మధ్యాహ్నం 3.20 గంటలకు ఆయన అంతిమయాత్ర మగ్దూంభవన్ నుంచి ప్రారంభమై హియాయత్‌నగర్ వై జంక్షన్, నారాయణగూడ చౌరస్తా, చిక్కడల్లి, ఆర్‌టిసి చౌరస్తా, గోల్కొండ చౌరస్తా, ముషీరాబాద్ ప్రాంతాల మీదుగా సికింద్రాబాద్ ప్రభుత్వ గాంధీ మెడికల్ కాలేజీకి చేరింది. అంతిమయాత్రలో ముందు భాగంలో పోలీసు కవాత్ ఉండగా, అనంతరం రెడ్ షర్టు వాలంటీర్లు ఎర్ర జెండాలతో కవాతు, ప్రజా నాట్య మండలి కళాకారుల విప్లవ గేయాలాపనలు, డప్పుల మధ్య సురవరం సుధాకర్‌రెడ్డి అమర్ రహే నినాదాలు మారుమోగాయి. భారీ సంఖ్యలో తరలి వచ్చిన సిపిఐ కార్యకర్తలు, నాయకులు, సుధాకర్‌రెడ్డి అభిమానులు, ప్రజలతో దారి పొడవునా అశ్రునయనాల మధ్య అంతిమ యాత్ర కొనసాగింది. హిమాయత్‌నగర్‌లో సిపిఐ నగర నాయకత్వం పుష్పాంజలి ఘటించింది. ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం వద్ద సుధాకర్ రెడ్డి అంతిమ యాత్రకు పుష్పాంజలి ఘటించారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ నేతృత్వంలోని

తరువాయి 2లో

## సురవరం సుధాకరరెడ్డికి శాశ్వత గుర్తింపునిస్తాం

అధికారం, ప్రజాప్రతినిధిగా లేకున్నా నమ్మిన సిద్ధాంతాన్ని వీడని మహోన్నత నేత - కొనియాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

02

# లైఫ్ సైన్సెస్ రంగానికి కేంద్రంగా తెలంగాణ

ఫార్మా, బయో, మెడ్‌టెక్ రంగాలకు కీలకంగా మారిన హైదరాబాద్

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ సాధిస్తాం

బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్‌లో సిఎం రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

లైఫ్ సైన్సెస్, వైద్య రంగాలకు ప్రకృతి ఒక ఉత్తమ గురువుగా పనిచేస్తుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) బయోడిజైన్‌కు మంచి ఉదాహరణ అని, మన మెదడును ఆధారంగా చేసుకునే కృత్రిమ మేధస్సును సృష్టించగలిగామన్నారు. గచ్చిబౌలిలోని ఏఐజి హాస్పిటల్ నిర్వహించిన బయోడిజైన్ ఇన్నోవేషన్ సమ్మిట్ 2025 (ఆసియాపసిఫిక్) సదస్సుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 'ఇన్నోవేటింగ్ ఫర్ భారత్ ది బయోడిజైన్ బ్లూప్రింట్'ను సిఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా, భారత దేశం స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలు జరుపుకునే 2047 నాటికి 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047' కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ లక్ష్యాలను సాధించడంలో వైద్య పరికరాలు, మెడ్‌టెక్ కీలక పాత్ర పోషిస్తాయని ఆయన

తరువాయి 2లో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లపై

# మంత్రుల కమిటీ కసరత్తు

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై రాష్ట్ర మంత్రుల కమిటీ ప్రత్యేకంగా సమావేశమై కసరత్తు చేసింది. హైదరాబాద్ ప్రజా భవన్‌లో ఆదివారం ఈ సమావేశం జరిగింది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఓబిసిల కులగణనను చేపట్టిందని కమిటీ పేర్కొంది. ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణనను ప్రభుత్వం చేపట్టిందని తెలిపింది. ఈ సర్వేలో సేకరించిన డాటాను శాసనసభలో ప్రవేశపెట్టి, స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఆమోదింపజేసి, గవర్నర్‌కు పంపినట్లు వివరించింది. ఈ బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి వద్ద ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉంది. మరోవైపు, సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో, రిజర్వేషన్‌ల కల్పనలో ఎలాంటి న్యాయపరమైన వివాదాలు తలెత్తకుండా అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి అభిప్రాయాన్ని మంత్రుల కమిటీ కోరింది. ఇదే అంశంపై సోమవారం జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ఢిల్లీలోని ప్రముఖ న్యాయ నిపుణుల సలహాలు కూడా తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. కమిటీ సభ్యుడు మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్ ద్వారా అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డికి తన అభిప్రాయాన్ని తెలియజేశారు.

గణేశ్, దుర్గామాత మంటపాలకు

# ఉచిత విద్యుత్

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో పండుగ వాతావరణం నెలకొంటున్న వేళ, రాష్ట్ర ప్రభుత్వం శుభవార్తను ప్రకటించింది. ఈ ఏడాది గణేశ్ మంటపాలతో పాటు, దసరా ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే దుర్గా మాత మంటపాలకు ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ సౌకర్యం రాష్ట్రవ్యాప్తంగా వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సదుపాయం పొందడానికి మంటపాల నిర్వాహకులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొంది ఉండాలి. ఈ నెల 27వ తేదీ నుంచి గణేశ్ చతుర్థి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో ప్రభుత్వ నిర్ణయంపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాజధాని హైదరాబాద్‌తో సహా పలు జిల్లాల్లో మంటపాల ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను ప్రకటించడంతో మంటపాలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని, ఈ ఏడాది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని భక్తులు,

తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

### భారత్‌లో అమెరికా దౌత్యవేత్తగా
## ట్రంప్ సన్నిహితుడు సెర్గియో గోర్

**న్యూయార్క్/వాషింగ్టన్:** భారత్‌లో అమెరికా దౌత్యవేత్తగా సెర్గియో గోర్ ఎంపికయ్యారు.సెర్గియో గోర్ ప్రస్తుతం వైట్‌హౌస్‌లో పిపిఓ (అధ్యక్షుడి వ్యక్తిగత కార్యాలయం) సంచాలకుడుగా పనిచేస్తున్నారు. తదుపరి దౌత్యవేత్తగా నియామకపు తేదీని ధృవీకరించేవరకూ గోర్ పిపిఓ డైరెక్టర్ పదవిలోనే కొనసాగుతారు. ఆయన పదోన్నతి గురించి సోషల్ మీడియాలో ట్రంప్ పోస్టింగ్ పెట్టారు. 38 ఏళ్ళ వయసుగల గోర్ ట్రంప్‌కు తనకు అత్యంత సన్నిహితుడు. "అనేక సంవత్సరాలుగా తనకున్న గ్రేట్ ఫ్రెండ్ గోర్" అని ట్రంప్ పేర్కొన్నారు. ఆయన మంచి పనిమంతుడని ప్రశంసించారు. దక్షిణ మధ్య ఆసియా వ్యవహారాల ప్రత్యేక దూతగా కూడా ఆయన బాధ్యతలు నిర్వహించారు. భారత్–అమెరికా మధ్య టారిఫ్‌ల ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ట్రంప్ నుండి ఈ ప్రకటన వెలువడింది. అతి తక్కువ రికార్డు సమయంలో గోర్, ఆయన బృందం నాలుగువేలమంది అధికారులను ఫెడరల్ డిపార్ట్‌మెంట్‌లలో నియామకాలు చేసిందని ట్రంప్ ఈ సందర్భంగా ప్రశంసించారు. 95 శాతం నియామకాలు కూడా పూర్తయ్యాయని పేర్కొన్నారు.

### ఆస్ట్రేలియాలో లక్షలాదిమంది
# ఇజ్రాయెల్ వ్యతిరేక ర్యాలీలు

**సిడ్నీ:** గాజాలో పాలస్తినా ప్రజలను ఊచకోత కోస్తున్న ఇజ్రాయెలీ పాలకులకు వ్యతిరేకంగా ఆదివారంనాడు ఆస్ట్రేలియాలోని సిడ్నీ, బ్రిస్‌బేన్, మెల్‌బోర్న్ నగరాలు సహా 40 ప్రాంతాలలో లక్షల మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఒక్కబ్రిస్‌బ్రేన్‌లోనే 50,000 మంది నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాలస్తీనియన్ల ఊచకోత నిలిపివేయాలని, ఆకలి చావులు అరికట్టాలని, గాజా సంపూర్ణ ఆక్రమణ ప్రణాళిక అమలు చేయకూడదని సిడ్నీలో ర్యాలీ నిర్వాహకుడు జోస్ లీస్




డిమాండ్ చేశారు. బ్రిస్‌బేన్‌లో జరిగిన ప్రదర్శనలో క్వీన్‌ల్యాండ్ సెనేటర్ లారిస్సా వాటర్స్ పాల్గొని ప్రసంగించారు. ఇజ్రాయెల్‌కు ఆయుధాలు సరఫరా చేయడంపై ఆంక్షలు విధించాలని ప్రపంచదేశాలు కోరుతున్నప్పటికీ నెతన్యాహూ పట్టించుకోవడంలేదని విమర్శించారు. రెండు వారాల క్రితం కూడా సిడ్నీలో ఇదేవిధంగా ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా మహా ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ తర్వాత ఆస్ట్రేలియా ప్రభుత్వ వైఖరిలో కూడా చాలా మార్పు వచ్చిందని సెనేటర్ లారిస్సా వాటర్స్ అన్నారు. ఇజ్రాయెల్‌ను అడ్డుకునేందుకు ప్రపంచదేశాలు నెతన్యాహూపై తీవ్ర ఒత్తిడి తీసుకురావాలని ప్రదర్శకులు నినాదాలు చేశారు. పాలస్తినా స్వతంత్ర్య దేశానికి గుర్తింపు ఇవ్వాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం నిర్ణయించి ఒక ప్రకటన చేయడంతో ఇటీవలికాలంలో ఇజ్రాయెల్–ఆస్ట్రేలియా మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇజ్రాయెల్‌కు చెందిన పచ్చిమితవాద పార్లమెంటేరియన్ ఎంకె సిమ్హా రోత్‌మన్‌ను ఆస్ట్రేలియాలో పర్యటించకుండా అడ్డుకుంటూ ఆ దేశ హోంమంత్రి టోరీ బుర్క్ ఆగస్టు 18న ప్రకటన చేశారు. ఇజ్రాయెల్ కూడా ప్రతిస్పందించి వీసా ఆంక్షలు విధించింది. దీంతో రెండు దేశాలమధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. అప్పటినుండీ ఆస్ట్రేలియాలో ఇజ్రాయెల్ వ్యతిరేక ప్రదర్శనలు కూడా బాగా పెరిగాయి. గాజాలో యుద్ధం విరమించాలని ప్రజలు వీధుల్లోకి వచ్చిన ప్రదర్శనలు చేస్తున్నారు.

### ఒకవైపు రష్యాపై డ్రోన్ దాడులు
## మరోవైపు ఉక్రేన్‌లో స్వాతంత్ర్య వేడుకలు

**కీవ్:** ఉక్రేన్–రష్యా మధ్య యుద్ధం ఆగిపోయి శాంతి నెలకొనాలని కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ ఆకాంక్షించారు. ఉక్రేన్ 34వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. యుద్ధం ముగించేందుకు ప్రధానంగా అమెరికా సహా యూరప్ దేశాలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో కార్నీ పైవిధంగా ఉద్ఘాటించారు. కీవ్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కార్నీ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఉక్రేన్ సార్వభౌమాధికార, ప్రాదేశిక సంరక్షణకు అన్నివిధాలుగా కెనడా దోహదకారిగా ఉంటుందన్నారు. అదేవిధంగా ఈ వేడుకలలో ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మాట్లాడుతూ, ఉక్రేన్ దేశాన్ని పునర్నిర్మించుకుంటామని, తగిన బలాన్ని, శక్తిసామర్థ్యాలను కూడదీసుకుని మంచి భద్రతా ఏర్పాట్లతో శాంతియుతంగా జీవనం సాగిస్తామని అన్నారు. ఇదిలా ఉండగా, మరోవైపు ఆదివారం తెల్లవారక ముందుగానే ఉక్రేన్ డ్రోన్లు రష్యాపై దాడులు చేశాయి. పశ్చిమ కుర్స్క్ ప్రాంతంలోని అణు విద్యుత్ కేంద్రంవద్ద డ్రోన్ దాడులు జరిగాయని రష్యా విమర్శించింది. రష్యాపై ఉక్రేన్ చేసిన డ్రోన్ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టామని రష్యా సైనికవర్గాలు తెలిపాయి. 95 ఉక్రేన్ డ్రోన్లు కూల్చివేశామని ప్రకటించాయి. ఆదివారం తెల్లారక ముందుగానే రష్యాలో అనేక ఇంధన కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఉక్రేన్ దాడులకు దిగిందని రష్యా అధికారులు విమర్శించారు. కుర్స్క్‌లో విద్యుత్ కేంద్రంవద్ద మంటలను సకాలంలో స్పందించి సిబ్బంది ఆర్పివేశారు. ఈ విద్యుత్ కేంద్రంవద్ద ట్రాన్స్‌ఫామ్స్‌లు డ్రోన్ దాడులవల్ల అగ్నిబారినపడ్డాయని చెప్పారు. ఈ విమర్శలపై ఉక్రేన్ వర్గాలు స్పందించలేదు. అదేవిధంగా ఉక్రేన్ ఒక ప్రకటన చేస్తూ, 72 డ్రోన్లను, క్రూయిజ్ క్షిపణులను రష్యా తమపై ప్రయోగించిందని, 48 డ్రోన్లను కూల్చివేశామని తెలిపింది. కాగా డ్నిప్రోపెట్రోవస్క్‌లోని ఫిలియా ప్రాంతాన్ని విముక్తిచేసి ఆక్రమించుకున్నట్లు రష్యా సైనిక వర్గాలు ప్రకటించాయి.

## అంతిమ వీడ్కోలు
(మొదటి పేజీ తరువాయి)

నేతల బృందం అరుణపతాకాలు చేబూని సుధాకర్‌రెడ్డికి భౌతికకాయానికి పూలమాలలు వేసి అరుణాంజలి సమర్పించారు.

**మెడికల్ కళాశాలకు భౌతిక ఖాయం అప్పగింత**

సిపిఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయాన్ని వైద్యవిద్యార్థుల పరిశోధనల నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కళాశాలకు అప్పగించారు. సురవరం కోరిక మేరకు భార్య డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, కుమారులు కపిల్, నిఖిల్‌లతో కలిసి సిపిఐ నేతలు సురవరం సుధాకర్‌రెడ్డి భౌతిక కాయాన్ని గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఇందిర, ఫిజియాలజీ హెచ్‌ఓడి ప్రొఫెసర్ రమాదేవి, అనాటమీ ప్రొఫెసర్ సుధాకర్‌బాబులకు అప్పగించారు. సురవరం భౌతికకాయానికి ఎంబామింగ్ (రసాయనాల పూత) చేసి భద్రపరుస్తామని, వైద్యవిద్యార్థుల పరిశోధనలు, శరీర నిర్మాణం, సైంటిఫిక్ నాలెడ్జ్ పెంచుకునేందుకు దోహదపడుతుందని ఈ సందర్భంగా ప్రొఫెసర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, కె.శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, ఈ.టి.నరసింహ, కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఎన్ఎఫ్ఐడబ్లు నాయకురాలు అనీ రాజా తదితరులు సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి చివరిసారిగా నివాళులు అర్పించారు. విద్యార్థి దశ నుంచి అనేక పోరాటాలు చేస్తూ ప్రజాసేవలో జీవితం గడిపిన సుధాకర్ రెడ్డి చివరికి తన భౌతిక కాయాన్ని కూడా వైద్య విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడేలా గాంధీ ఆసుపత్రికి అందజేశారని నేతలు కొనియాడారు.

## సురవరం సుధాకర్‌రెడ్డికి ప్రభుత్వ గౌరవ వందనం

సిపిఐ అగ్రనేత, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో గౌరవ వందనం సమర్పించింది. హైదరాబాద హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో భౌతికకాయానికి ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు తెలంగాణ పోలీసులు అంతిమ గౌరవ వందనం (శోక్ శస్త్ర) సమర్పించారు. హైదరాబాద్ నగర ఆర్మ్‌డ్ రిజర్వ్ (సిఎఆర్)కు చెందిన ఆర్ఎస్ఐ జి.ఉపేంద్ర నేతృత్వంలో సాయుధ పోలీసులు వెంకటేష్, జగదీష్, రాజు, అంజి, శ్రీకాంత్, షఫీ, అనాస్, ఆనంద్, దీపక్, హన్మంత్‌లు తుపాకాలు తలక్రిందులు చేసి సురవరం సుధాకర్ రెడ్డికి సంతాప సూచకంగా గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా సిఎఆర్‌కు చెందిన పోలీసు బ్యాండ్ బృందం సురవరం సుధాకర్‌రెడ్డికి సం తాప సూచకంగా గౌరవ వందనం పలికింది.



## ఉచిత విద్యుత్
(మొదటి పేజీ తరువాయి)

ఉత్సవ కమిటీ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**ముఖ్యమైన భద్రతా మార్గదర్శకాలను జారీ చేసిన పోలీసులు**

ఉచిత విద్యుత్‌తో పాటు పోలీసులు కొన్ని ముఖ్యమైన భద్రతా మార్గదర్శకాలను జారీ చేశారు. మండపాలను తాత్కాలికంగానే ఏర్పాటు చేయాలని, అగ్ని ప్రమాదాలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. అదనంగా, మండపాల వద్ద ఇసుక సంచులు, నీటి డ్రమ్ములను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పిఓపి) విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను వినియోగించి, పర్యావరణాన్ని కాపాడాలని నిర్వాహకులను కోరారు. నిమజ్జనం రోజున రద్దీని తగ్గించడానికి, విగ్రహాలను 3, 5 లేదా 7 రోజుల్లో నిమజ్జనం చేసే విధంగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం కోసం ఫిట్‌నెస్ ఉన్న వాహనాలను మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలంటే ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవడం తప్పనిసరి. డిజెలకు మాత్రం అనుమతి లేదని పోలీసులు తేల్చి చెప్పారు. మతపరమైన ప్రాంతాల వద్ద పోస్టర్లు, జెండాలు, బ్యానర్లు పెట్టకూడదని, రద్దీ ప్రదేశాలలో డ్రోన్‌ల వాడకం నిషేధమని పోలీసులు స్పష్టం చేశారు. విరాళాలను స్వచ్ఛందంగా మాత్రమే తీసుకోవాలని, అలాగే మండపాల వద్ద మద్యం సేవించడం, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ ఏడాది వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్‌నబి ఒకే రోజు రావడంతో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

## సిఎం సహా పలువురికి ధన్యవాదాలు
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ అగ్ర నాయకులు సురవరం సుధాకర్ రెడ్డి అంతిమ వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొని, నివాళ్లు అర్పించిన, ప్రభుత్వం తరపున అధికార లాంఛనాలు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ధన్యవాదాలు తెలిపారు. ఎపి సిఎం చంద్రబాబునాయుడు, తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రముఖులు వెంకయ్యానాయుడు, బండారు దత్తాత్రేయ, బిఆర్ఎస్ నాయకులు కెటిఆర్, రాష్ట్ర మంత్రులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు ప్రముఖులు, మేధావులు రాజకీయాలకు అతీతంగా సుధాకర్‌రెడ్డి అంతిమ వీడ్కోలులో పాల్గొని, నివాళులు అర్పించడం సురవరం దేశానికి, రాష్ట్రానికి సమాజంలోని వివిధ వర్గాల ప్రజలకు అందించిన సేవలకు నిదర్శనమని అన్నారు. భారతదేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో విద్యార్థి, యువజన సంఘాలకు, వామపక్ష ఉద్యమాలకు నాయకత్వం వహించిన కమ్యూనిస్టు, ప్రగతిశీల భావాలు పునికిపుచ్చుకున్న గొప్ప రాజకీయ నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి అని కూనంనేని సాంబశివరావు కీర్తించారు. అంతటి మహానాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి మర ణం నుంచి కూడా స్ఫూర్తిని పొంది ఆయన రాజకీయ, మానవత విలువల వారసత్వాన్ని, పోరాట పటిమను, ఆశయాలను ఆదర్శాలను సురవరం రాజకీయ వారసులుగా ముందుకు తీసుకెళ్తామని కూనంనేని ఉద్ఘాటించారు.

# నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు
### నిజాయితీ, నిస్వార్థ, నిరాడంబరజీవి గొప్ప కమ్యూనిస్టు నేత సుధాకర్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి తుది శ్వాస వరకు నిలబడిన నిజాయితీ, నిస్వార్థ, నిరాడంబర జీవితాన్ని గడిపిన కమ్యూనిస్టు మహా నేత సురవరం సుధాకర్‌రెడ్డి అని సమాజంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలు కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీలో, చట్ట సభలలో ఎన్నో ఉన్నతమైన బాధ్యతలు నిర్వర్తించినప్పటికీ ఏనాడూ ఆవేశం, కోపం ఆయనలో చూడలేదర్కొన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి మరణం వామపక్ష ఉద్యమానికి, యావత్ దేశానికి, బడుగు బలహీన వర్గాలకు తీరని లోటు అని కన్నీటి పర్యంతమయ్యారు.

**ప్రజాస్వామ్య పరిరక్షణకు సురవరం పోరాడారు : ఎపి సిఎం చంద్రబాబు**

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సిపిఐ నేత సురవరం సుధాకర్ రెడ్డి పోరాడారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం, దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి చంద్రబాబు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డితో ఉన్న రాజకీయ సంబంధాల గురించి సిపిఐ నేతలతో పంచుకున్నారు. 'సురవరంతో నాకు సుదీర్ఘ రాజకీయ అనుబంధం ఉంది. సుధాకర్ రెడ్డి, నేను కలిసి ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాం. నిత్యం ప్రజాహితం కోసం ఆయనతో కలిసి పోరాడం. ఎంపిగా, కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా ప్రజలకు సేవలందించారు. సుధాకర్ రెడ్డి నన్ను ప్రత్యేకంగా అభిమానించేవారు. నేను చేసే పనులను, కార్యక్రమాలను అభినందించి ప్రోత్సహించేవారు. ఆయన సేవలను, పోరాటాలను నా జీవితంలో ఎప్పుడూ మర్చిపోలేను. సుధాకర్ రెడ్డి చనిపోయినా పోరాట వారసత్వాన్ని మనకు ఇచ్చిపోయారు. సుధాకర్ రెడ్డి మరణం సిపిఐతో పాటు, తెలుగు వారికి తీరని లోటన్నారు.

**నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడిన వ్యక్తి సురవరం : వెంకయ్య నాయుడు**

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడిన వ్యక్తి సురవరం అని కొనియాడారు. పార్టీలో ఏ పదవిలో ఉన్నప్పటికీ ఆ పదవికి వన్నె తెచ్చిన వ్యక్తి సురవరం అని, ఆయనలేని లోటు పూడ్చలేనిదన్నారు.

**పేదల కోసం పరితపించారు : మహేష్ కుమార్ గౌడ్**

టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ పేదల కోసమే పరితపించిన గొప్ప నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి అని, అలాంటి వ్యక్తిని కోల్పోవడం రాష్ట్రానికి తీరని లోటు అని అన్నారు. ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ జీవితాంతం పోరాటాలతో గడిపిన మహనీయుడు సురవరం సుధాకర్ రెడ్డి అని అన్నారు.

**సురవరం రాజకీయ జీవితం నేటి యువతకు ఆదర్శం: భట్టి విక్రమార్క**

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సురవరం సుధాకర్ రెడ్డి లాంటి ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందన్నారు. దేశంలో సిపిఐ బలోపేతానికి ఆయన కృషి చేశారని, చిన్న నాటి నుంచి ప్రజల పక్షాన నిలబడి, ప్రజల కోసం పోరాడారని గుర్తు చేశారు. ఆయన రాజకీయ జీవితం నేటి యువతకు ఆదర్శమన్నారు. సురవరం పేరు చిరస్థాయిగా నిలిచేలా కేబినెట్ లో ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు.

**తెలంగాణ ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించారు : కెటిఆర్**

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో అనేక హోదాల్లో పనిచేసిన సుధాకర్‌రెడ్డి ఎన్నో విప్లవ ఉద్యమాలు, ఎన్నో ప్రజా ఉద్యమాల్లో ఎన్నో కార్మికుల ఉద్యమాల్లో, తెలంగాణ ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించారన్నారు. విద్యార్థి నాయకుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించి జాతీయస్థాయిలో సిపిఐకి ఏడేళ్ల పాటు ప్రధాన కార్యదర్శిగా పనిచేయడం సాధారణమైన విషయం కాదన్నారు. ప్రజల పట్ల, ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహనతో అన్ని ప్రజా సమస్యలపై క్రియాశీలకంగా వ్యవహరించారన్నారు. ఆయన మరణం ప్రజా ఉద్యమంలో పనిచేసిన ప్రతి ఒక్కరికి బాధాకరరమన్నారు. తెలంగాణ ఉద్యమానికి సంబంధించి సిపిఐ మద్దతు తెలిపిందని, జాతీయ స్థాయిలో తాము కలిసి పనిచేసే అవకాశం వచ్చిందన్నారు. కెసిఆర్ కూడా సుధాకర్ రెడ్డితో ఉన్న అనుభవాలను గుర్తు చేసుకున్నారన్నారు. ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి నాయకత్వం విద్యార్థి దశలో తమకు స్ఫూర్తినిచ్చిందన్నారు. తుది శ్వాస విడిచే వరకు ఆయన ప్రజల కోసమే ఆలోచించారన్నారు.

**కార్మికుల సంక్షేమం, ప్రయోజనాల కోసం సూచనలు చేసేవారు: బండారు దత్తాత్రేయ**

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ నమ్మిన భావజాలానికి కట్టుబడిన మహనీయుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని కొనియాడారు. తాను కేంద్ర కార్మిక శాఖ మంత్రి ఉన్నసమయంలో సురవరం కార్మికుల సంక్షేమం, ప్రయోజనాలకు సంబంధించి సూచనలు చేసేవారని గుర్తుచేశారు. సిద్ధాంతపరంగా తాము వేరైనప్పటికీ ఏనాడూ కూడా విమర్శించుకోలేదని, సద్విమర్శ మాత్రం చేసేవారని గుర్తు చేశారు.

**ప్రజా ప్రభుత్వాల ఏర్పాటులో సురవరం కృషి మరువలేనిది: మధుయాష్కిగౌడ్**

మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వాల ఏర్పాటులో సురవరం కృషి మరువలేనిదన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఆయన కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు మాట్లాడుతూ సురవరం తాను సమకాలీకులమని, తామిద్దరం కలిసి చదువుకున్నామని గుర్తు చేశారు. ఆయన మృతి సోషలిస్టు సమాజానికి తీరని నష్టంగా భావిస్తున్నానని అన్నారు. సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి మరణంతో శిఖరం మునిగిపోయిందా, సముద్రం కుంగిపోయిందా అన్నట్టుగా ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

**శాంతి దూత మిషన్‌కు సుధాకర్‌రెడ్డి మద్దతిచ్చారు : కె.ఎ.పాల్**

ప్రజా శాంతి పార్టీ అధ్యక్షులు కె.ఎ పాల్ మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి ఎంపిగా ఉన్న సమయంలో శాంతి దూత మిషన్‌కు మద్దతునిచ్చారని గుర్తు చేశారు. కమ్యూనిస్టులకు ధ్యేయం, నీతి, నిజాయితీ ఉన్నదన్నారు. కమ్యూనిస్టులు కలవాలని ప్రజా గాయకుడు గద్దర్ కూడా ప్రజాశాంతి పార్టీలో ఉన్నప్పుడు అభిలషించారని అన్నారు. బహుజనులకు న్యాయం జరగాలని కోరుకుంటున్నామన్నారు.

**దేశానికి, బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటు : బోయినపల్లి వినోద్ కుమార్**

బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి మరణం భారతదేశానికి, బడుగు, బలహీన, అణగారిన వర్గాలకు తీరని లోటు అని అన్నారు. గత పదేళ్ల కెసిఆర్ నాయకత్వంలోని ప్రభుత్వంలో సురవరం అనేకసార్లు ఫోన్ చేసి, కొన్ని సమస్యలపైన స్పందించాల్సిన విధానంపైన పలు సలహాలు ఇచ్చేవారని గుర్తు చేశారు. ఆయన ఒక నిజమైన దేశభక్తుడు అని, ప్రజల పట్ల అపారమైన ప్రేమ కలిగిన నాయకుడని కొనియాడారు. సురవరంతో తనకు 1975 సంవత్సరంలో తెనాలిలో జరిగిన అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ శిక్షణ శిబిరంలో పరిచయడం ఏర్పడిందని గుర్తు చేసుకున్నారు. సుధాకర్ రెడ్డి వ్యక్తిత్వం, ఆలోచనా శక్తి తనపై గొప్ప ప్రభావాన్ని చూపిందని, ఆయన ఉపన్యాసాలు ఎల్లప్పుడూ స్పష్టత, విశ్లేషణతో ఉండేదన్నారు. ప్రపంచ రాజకీయ పరిణామాలపై విస్తృతమైన అవగాహనతో తమకు దిశా నిర్దేశం చేసే వారని అన్నారు. 2004లో తాను హన్మకొండ ఎంపిగా, సురవరం నల్లగొండ ఎంపీగా ఉన్నప్పుడు కూడా తెలంగాణ రాష్ట్రం అవసరమనే అభిప్రాయాన్ని సురవరం కేంద్రానికి లిఖితపూర్వకంగా తెలియజేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రణబ్ ముఖర్జీ కమిటీకి కూడా ఆయన సమర్థవంతమైన సూచనలిచ్చారన్నారు. సుధాకర్ రెడ్డి మరణం తనతో పాటు, అన్ని వామపక్ష ప్రజాతంత్ర శక్తులకు చాలా బాధ కలిగించిందని, దేశ రాజకీయ పరిస్థితులు మతోన్మాదం వైపు దారితీస్తున్నందుకు ఆయన ఆందోళన వ్యక్తం చేసేవారని వినోద్ కుమార్ అన్నారు. వామపక్ష, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యత కోసం తపనపడిన మహనీయుడు సురవరం అని వినోద్ కుమార్ అన్నారు.

**కమ్యూనిస్టు సిద్ధాంతాల కోసం పోరాడిన గొప్ప నాయకుడు: మంత్రి సీతక్క**

హిమాయత్‌నగర్‌లోని మఖ్దూంభవన్‌లో సిపిఐ జాతీయ కార్యాదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర రెడ్డికి మంత్రి దనసరి అనసూయ సీతక్క ఘనంగా నివాళులర్పించారు. కమ్యూనిస్టు సిద్ధాంతాల కోసం జీవితాంతం నిబద్ధతతో పోరాడిన యోదుడని ఆమె స్మరిచంఆరు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆయన కన్నుమూయడం వామపక్షాలకు, ప్రజాస్వామ్య వాదులకు తీరని లోటని పేర్కొన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**సురవరంకు నివాళులర్పించిన మంత్రి కృష్ణారావు**

హిమాయత్‌నగర్ మగ్దూం భవన్‌లో సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నివాళులు అర్పించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన సురవరం సుధాకర్‌రెడ్డికి తనతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా జూపల్లి నెమరేసుకున్నారు.

## విలువలపై రాజీపడని నిరాడంబర నేత
### సురవరం సుధాకర్‌రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ అగ్ర నాయకులు సురవరం సుధాకర్ రెడ్డి అధికారంలో ఉన్నా లేకపోయినా, ప్రజాప్రతినిధిగా ఉన్నా లేకపోయినా సుధాకర్‌రెడ్డి నమ్మిన సిద్ధాంతాన్ని ఎప్పుడూ వదలలేదని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కొనియాడారు. మరణం నిరుపేదలకు, బహుజనులకు, సిద్ధాంతపరమైన రాజకీయాలను శ్వాసగా జీవిస్తున్న ప్రతి ఒక్కరికీ తీరని లోటు అని అన్నారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సురవరం సుధాకర్ రెడ్డి భౌతిక కాయానికి ముఖ్యమంత్రి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సురవరం సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. సిపిఐ నేతలు డి.రాజా, కె.నారాయణ, చాడ వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, అజీజ్ పాషాతో పాటు అనేక మంది నాయకులను ముఖ్యమంత్రి కలిసి సురవరం సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ విద్యార్థి రాజకీయాల నుంచి జాతీయ రాజకీయాల వరకు తన చివరి శ్వాస వరకు సిద్ధాంతాలు, విలువల విషయంలో రాజీపడకుండా నిరాడంబరంగా జీవించారని కొనియాడారు. ఎఐఎస్ఎఫ్ నుంచి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్లమెంట్ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించినా, ఏనాడూ అహంకారం, అహంభావం తన దరిదాపుల్లోకి రానీయలేదన్నారు. పాలమూరు బిడ్డగా బూర్గుల రామకృష్ణ రావుగారు, ఎస్.జైపాల్ రెడ్డి కోవలో కంచుపాడు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి పాలమూరు జిల్లాకు ఎంతో వన్నె తెచ్చారని సిఎం పేర్కొన్నారు. హైదరాబాద్ రాష్ట్ర విముక్తి పోరాటంలో, పత్రికా సంపాదకుడిగా ఎనలేని సేవలు అందించిన సురవరం ప్రతాప రెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టాలని సుధాకర్ రెడ్డి శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుతో లేఖ పంపించినప్పుడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆయన సూచన మేరకు తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టామని సిఎం చెప్పారు. ఇదే సందర్భంగా సుధాకర్ రెడ్డిని వ్యక్తిగతంగా కలిసి మాట్లాడుతానని ఆరోజు చెప్పానని, అయితే కొంత ఆలస్యమైందని, ఈ రకంగా కలుసుకోవలసిన పరిస్థితి వస్తుందని ఊహించలేదన్నారు. కాంగ్రెస్ పిఎసి సమావేశంలోనూ వారి సేవలను స్మరించుకుని ఘనంగా నివాళులర్పించామని, కాంగ్రెస్ అధ్యక్షులు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే సంతాప సందేశాన్ని పంపించామని, ప్రభుత్వ పక్షాన సురవరం కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు.

## సురవరం సుధాకర్‌రెడ్డిని శాశ్వతంగా గుర్తుంచుకునే విధంగా ప్రభుత్వం నిర్ణయం

"జీవితాంతం సిద్ధాంతపరమైన విలువలతో కూడిన రాజకీయంతో పనిచేసిన కమ్యూనిస్టు మహానేత సురవరం సుధాకర్ రెడ్డిని శాశ్వతంగా గుర్తుంచుకునే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ఈ విషయంపై రాష్ట్ర మంత్రివర్గంలో చర్చించి సముచితమైన నిర్ణయం తీసుకుంటాం" అని తెలంగాణ సిఎం ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. 'విలువలతో కూడిన సిద్ధాంత నిబద్ధత కలిగిన నాయకుల విషయంలో ప్రభుత్వానికి సంపూర్ణ సానుకూల ధృక్పధం, సానుభూతి ఉంది. అందుకే కొండా లక్ష్మణ్ బాపూజీ గౌరవార్థం ఇనిస్టిట్యూట్ ఆఫ్ హాండ్లూమ్ టెక్నాలజీకి వారి పేరును పెట్టుకున్నాం. మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరును పెట్టాం. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జైపాల్‌రెడ్డి పేరు, ప్రజాయుద్ధ నౌక గద్దర్ పేరును చిరస్థాయిగా గుర్తుంచుకునేలా అనేక విధాలుగా గౌరవించుకున్నాం. అదే స్థాయిలో సుధాకర్‌రెడ్డిని కూడా ప్రభుత్వం గుర్తిస్తుంది.' అని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు.

## కేంద్రంగా తెలంగాణ
(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగానికి కేంద్రంగా ఉందని, ఫార్మా, బయోటెక్, లైఫ్ సైన్సెస్, మెడ్‌టెక్ వంటి రంగాలకు హైదరాబాద్ కీలకంగా మారిందని ఆయన వివరించారు.

సుల్తాన్ పూర్‌లో మెడికల్ డివైజ్ పార్క్ ఏర్పాటు చేశాం సుల్తాన్ పూర్‌లో దేశంలోనే పెద్ద మెడికల్ డివైజ్ పార్క్ ఏర్పాటు చేశామని, ఇప్పటికే 60పైగా కంపెనీలు అక్కడ ఉన్నాయని తెలిపారు. మెడికల్ డేటాను పరిశోధన కోసం కంపెనీలకు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఇన్నోవేటర్స్, స్టార్టప్‌ల ఏర్పాటుకు ఇదే సరైన సమయమని అన్నారు. మానవాళిని ఆరోగ్యంగా మార్చడానికి ప్రయత్నం చేద్దామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఏ వస్తువునైనా రూపొందించినప్పుడు దాని ప్రయోజనం, పనితీరు, రూపం అనేవి ప్రాథమిక అంశాలుగా ఉంటాయన్నారు. డయాగ్నస్టిక్ పరికరాలు, ఇమేజింగ్ టెక్నాలజీలు, ఇంప్లాంట్లు, శస్త్రచికిత్స పరికరాలు, డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులు వస్తున్నాయని, స్థానిక స్టార్టప్‌లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ)లు గ్లోబల్ కంపెనీలతో కలిసి పనిచేస్తున్నాయని ఆయన చెప్పారు.

**ప్రజల కోసం మేధస్సు**

సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం పరిశోధనలు చేస్తున్నందుకు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, ఏఐజి హాస్పిటల్‌ను ముఖ్యమంత్రి అభినందించారు. ఇంతకాలం మన మేధస్సును ఇతర దేశాల ప్రజల కోసం ఉపయోగించామని, ఇప్పుడు మన ప్రజల మంచి కోసం పనిచేయాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి తమ ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. డేటా గోప్యతను పాటిస్తూ, ఇక్కడి ప్రజల వైద్య సహాయం కోసం అవసరమైన డేటాను అందిస్తామని తెలిపారు. స్కిల్ యూనివర్సిటీలు, కార్పొరేషన్‌లు, విద్యా సంస్థలు, పరిశోధనా కేంద్రాలతో అనుసంధానం చేస్తామన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో అనిశ్చిత పరిస్థితులు, పన్నులు, యుద్ధాలు, వాణిజ్యపరమైన అడ్డంకులు వంటివి ఎదురవుతున్నాయని, ఈ సమయంలో ఆవిష్కరణలకు తెలంగాణ సరైన వేదిక అని అన్నారు. మానవాళిని మరింత ఆరోగ్యంగా మార్చడానికి అందరం కలిసి ప్రయత్నం చేద్దామని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.




















# కమ్యూనిస్టు దిగ్గజానికి విప్లవాంజలి















# సురవరం సుధాకర్ రెడ్డికి ఘన నివాళి

ప్రజాపక్షం/హైదరాబాద్


సిపిఐ అగ్రనేత, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డికి 'రెడ్ ఆర్మీ'తో సిపిఐ ఘనంగా అంతిమ వీడ్కోలు పలికింది. సమాజంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, మేధావులు, కళాకారులు, రచయితలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలు, రాజకీయాలలో ప్రముఖ ప్రాత పోషించిన రాజకీయ ఉద్దండులు, న్యాయనిపుణులు, వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో నేతలు, చిన్న కంపెనీలో పనిచేసే సాధారణ కార్మికుడు, పొలం పనిచేసే రైతుకూలీ వరకు కార్మికులు, శ్రామికులు హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌కు తరలివచ్చి సుధాకర్‌రెడ్డికి కడసారిగా కన్నీటి వీడ్కోలు పలికారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు అన్ని వర్గాలూ రాజకీయాలకతీతంగా సురవరం సుధాకర్ రెడ్డికి 'భాష్పాంజలి' శ్రద్ధాంజలి ఘటించారు. ఒక 'అరుణతార'ను కోల్పోయామని, సామాజిక, కమ్యూనిస్టు పోరాట యోధుడి గొంతు మూగబోయిందని కన్నీంటి పర్యంతమయ్యారు. సురవరంతో తమకు ఉన్న అనుబంధాన్ని, ఆనాటి పోరాట ఘట్టాలను, సాధించిన విజయాలను, హక్కులను ఇలా ఒక్కోక్కటిగా పలువురు గుర్తు చేసుకున్నారు. సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యుడు సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయం సందర్శనార్థం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌కు ఆదివారం ఉదయం 9:35 గంటలకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సురవరం భౌతిక కాయంపై సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాతో పాటు జాతీయ కార్యదర్శివర్గం 'అరుణ పతాకాన్ని' కప్పి రెడ్ సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా డి.రాజా పుష్పాలతో శ్రద్ధాంజలి ఘటించి, తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గం పులమాలలు వేసి నివాళి అర్పించారు. సురవరం కుటుంబ సభ్యులు పుష్పాలతో శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కళాకారులు, కవులు, రచయితలు, ప్రజాప్రతినిధులు, మేధావులు, కార్మిక, రైతు, మహిళా సంఘాల ప్రతినిధులు, సురవరం అభిమానులు భౌతిక కాయానికి పూలమాలలతో శ్రద్ధాంజలి ఘటించారు. జన హృదయాల్లో చెరగని ముద్ర వేసిన సుధాకర్‌రెడ్డికి కడసారి వీడ్కోలు పలికేందుకు వచ్చిన వారు 'రెడ్ సెల్యూట్ కామ్రేడ్' సురవరం' అనే నినాదాలతో హైదరాబాద్‌లోని ప్రాంతాలు మార్మోగాయి. "లాల్ సలాం...లాల్ సలాం.. కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి... లాల్ సలాం.. నిరుపేదల పెన్నిధి లాల్ సలాం... లాల్ సలాం" అంటూ ప్రజా నాట్య మండలి కళాకారులు గేయాలను ఆలపించారు.

## ప్రముఖుల నివాళి

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తాసుఖేందర్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ కె.కేశవరావు, సుప్రీంకోర్ట్ మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, ఎంపిలు అయోధ్య రాంరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర తదితరులు పూలమాలతో సుధాకర్ రెడ్డికి నివాళ్లు అర్పించారు.

## శ్రద్ధాంజలి ఘటించిన వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు

సుధాకర్‌రెడ్డి భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలుంచి టిపిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి బి.మహేష్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మాజీ మంత్రి కె.జానారెడ్డి, ఎంఎల్‌ఎలు మల్‌రెడ్డి రంగారెడ్డి, బాలునాయక్, రాంచందర్ నాయక్, పాయల వెంకటేశ్వర్లు, మెగారెడ్డి, మందుల సామ్యూల్, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, రాష్ట్ర రైతు, వ్యవసాయ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు బెల్లయ్య నాయక్, వెన్నెల తదితరులు నివాళ్లు అర్పించారు. మాజీ ఎంపిలు వి.హనుమంత రావు, మధుయాష్కీ గౌడ్, కెవిపి.రాంచందర్‌రావు, ఎం.అంజన్‌కుమార్ యాదవ్, అలాగే బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు, మాజీ ఎంపిలు బోయినపల్లి వినోద్ కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, వి.శ్రీనివాస్‌గౌడ్, పువ్వాడ అజయ్ కుమార్, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ ఎంఎల్‌ఎలు భాస్కర్‌రావు, మాజీ ఎంపి రావుల చంద్రశేఖర్ రెడ్డి, ఎంఎల్‌ఎలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, ముఠాగోపాల్, కాలేరు వెంకటేష్, ఎంఎల్‌సి తాతామధు, నాయకులు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, డాక్టర్ చెరుకు సుధాకర్ శ్రద్ధాంజలి అర్పించారు. టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, లోక్‌సత్తా మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌ఎలు జయప్రకాష్ నారాయణ,టిడిపి రాష్ట్ర నాయకులు బక్కని నర్సింహులు, టిడి. జనార్ధన్, నల్లెల కిశోర్, కట్టరాములు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్, మాజీ ఎంఎల్‌సి కపిలవాయి దిలీప్ కుమార్, వైసిపి మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి, భౌతికకాయానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.



## సిపిఐ నాయకుల నివాళ్లు

సిపిఐ జాతీయ కార్యదర్శులు బినయ్ విశ్వం, గిరీష్ శర్మ, డాక్టర్ కె.నారాయణ,సయ్యద్ అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, పశ్యపద్మ, పల్లా వెంకట్‌రెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, సిపిఐ రాజ్యసభ సభ్యులు సందోష్ కుమార్, సిపిఐ తెలంగాణ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, బిహార్ రాష్ట్ర కార్యదర్శి రాంనరేష్‌పాండే, సిపిఐ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి, పాండిచేరి రాష్ట్ర కార్యదర్శులు సుధాకర్‌రెడ్డికి పుష్పాంజలి ఘటించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్, సి.రామచంద్రయ్య, కేరళ మంత్రి రాజన్‌తో పాటు వివిధ రాష్ట్రాలు, తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి నాయకులు పెద్దసంఖ్యలో హాజరై సుధాకర్‌రెడ్డికి నివాళులు అర్పించారు.

## సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి ఘన నివాళి

సిపిఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డికి సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి ఘన నివాళి అర్పించింది. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, ఇటి.నర్సింహ,రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ, పల్లా వెంకటరెడ్డి, బాగం హేమంతరావు, కలవేన శంకర్, ఎం.బాలనర్సింహ, వి.ఎస్.బోస్, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, వి.సీతారామయ్య, పల్లా నర్సింహ రెడ్డి, నెల్లికంటి సత్యం, ఎస్.కె.సాబీర్ పాషా, దండి సురేశ్, సి.హెచ్.రాజారెడ్డి, ఎస్.బాల్‌రాజ్, పాలమాకుల జంగయ్య, ఎన్.జ్యోతి, బెజవాడ వెంకటేశ్వర్లు, ఛాయాదేవి, రామడుగులక్ష్మణ్, కలకొండ కాంతయ్య, ఇ.ఉమామహేశ్, పంజాల శ్రీనివాస్, ముత్యాల విశ్వనాథం, యానాల దామోదర్ రెడ్డి,షేక్ బాసుమియా, రమావత్ అంజయ్య నాయక్,(గిరిజన సమాఖ్య), ఎం.డి యూసుఫ్,ఎస్.బాలరాజ్, ఎం. నర్సింహ, (ఎఐటియుసి) వలీ ఉల్లా ఖాద్రీ, తిరుమలై, హరీశ్‌బాల,తిరుమలై (ఎఐఎస్‌ఎఫ్),అనీరాజా, జ్యోతి, (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు), పల్లె నర్సింహ, లక్ష్మి నారాయణ(ప్రజా నాట్య మండలి) తదితరులు సుధాకర్‌రెడ్డి భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలుంచి అరుణాంజలి ఘటించారు.

## వామపక్ష నాయకుల నివాళి

సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయంపై సిపిఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి, పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఎస్.వీరయ్య, డి.జి.నర్సింహారావు, టి.జ్యోతి, చెరుకుపల్లి సీతారాములు, బి.వెంకట్, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, పాలడుగుభాస్కర్, సాయిబాబు, వెంకటేష్ (సిఐటియు), మధు (ఎపిసిసిఐ(ఎం), మాజీ ఎంఎల్‌సి అలుగుబెల్లి నర్సిరెడ్డి పుష్పగుచ్ఛాలుంచి భాష్పాంజలి ఘటించారు. అలాగే వామపక్షాల నేతలు సాధినేని వెంకటేశ్వర్‌రావు, కె.గోవర్ధన్, వేములపల్లి వెంకట్రామయ్య (సిపిఐ(ఎం.ఎల్)న్యూడెమోక్రసీ), వి. సంధ్య, ఝాన్సీ, (పిఒడబ్ల్యు), పోటురంగారావు, రమ, అశోక్, ఎస్.ఎల్.పద్మ (సిపిఐఎం.ఎల్– మాస్ లైన్), అమర్(జనశక్తి), విమలక్క(అరుణోదయ సంస్కృతిక మండలి), కె.మురహరి, శ్రీధర్ (ఎస్‌యుసిఐ (యు), మద్దికాయల అశోక్, ఓంకార్, ఉపేందర్‌రెడ్డి, వనం సుధాకర్, (ఎంసిపిఐ(యు), సామాజిక కార్యకర్త లక్ష్మి నారాయణ, వీక్షణం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మేధావులు, ప్రజా సంఘాల నేతల నివాళి

మఖ్దూంభవన్‌లో సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయంపై ప్రజా సంఘాల నాయకులు మంద కృష్ణ మాదిగ(ఎంఆర్‌పిఎస్), కె.యాదవరెడ్డి, డాక్టర్ డి.సుధాకర్, కెవిఎల్(ఐయిపోస్), జస్టిస్ బి.చంద్రకుమార్, ప్రొఫెసర్ జి.హరగోపాల్, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ మొలుగరం కుమార్, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైఎస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.వి.సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టులు కె.రాంచంద్రమూర్తి, ఆంధ్రజ్యోతి అధినేత రాధాకృష్ణ, దేవులపల్లిఅమర్, కట్ట శేఖర్ రెడ్డి, కె.శ్రీనివాస్, కె.విరాహత్ అలీ(టియుడబ్ల్యుజె),బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఐఎఎస్ చిరంజీవి, జూలూరి గౌరిశంకర్ పుష్పగుచ్ఛాలుంచి నివాళ్లు అర్పించారు. ప్రజా సంఘాల నేతలు శంకర్, (ఎఐబిఇఎ), ఎల్లంకి అనిల్ కుమార్, (ఎఐబిఓఎ), వి.చెన్నకేశవరావు, కె.రజని (సిఆర్ ఫౌండేషన్), పద్మాకర్, ఎస్.బాబు, ఈదురు వెంకన్న(టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ), మక్కెన సుబ్బరావు (ప్రజాపక్షం సంపాదకులు), సినీ ప్రముఖులు ఆర్.నారాయణమూర్తి, వందేమాతరం శ్రీనివాస్, సుద్దాల అశోక్ తేజ, తమ్మా రెడ్డి భరద్వాజ్, శ్రవణ్, కవి గోరటి వెంకన్న, రాపోలు సుందర్శన్ (అరసం), ఏటుకూరి కృష్ణమూర్తి (తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుడు), మాజీ మంత్రి రాజేశంగౌడ్, బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ తదితరులు సురవరం భౌతికకాయంపై పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

## బుద్ధవనం సందర్శించిన అడిషనల్ కలెక్టర్



**ప్రజాపక్షం/నందికొండ** : నాగార్జునసాగర్ లోని బుద్ధవనాన్ని ఆదివారం నల్లగొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ నారాయణ అమిత్ కుటుంబ సమేతంగా సందర్శించారు. అతను తల్లిదండ్రులతో కలిసి బుద్ధ వనం సందర్శించగా బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్యాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రలు మహా స్తూపంలోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతిని వెలిగించి బుద్ధవన కండువాల తో సత్కరించారు. అనంతరం వీరు నాగార్జునసాగర్ డ్యామ్ ను,ఎత్తిపోతల జలపాతాన్ని సందర్శించారు. వీరితోపాటు స్థానిక రెవెన్యూ ప్రొటోకాల్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, టూరిజం గైడ్ సత్యనారాయణ ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం

**ప్రజాపక్షం/ నల్లగొండ** : ( కట్టంగూర్) ప్రభుత్వంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ఆదేశించారు. ఆదివారం కట్టంగూర్ మండలం ఐటిపాముల గ్రామంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో రూ. 120.00 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న భోజనశాల, వంటశాల భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వంటగదిలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరంలో ఈ పాఠశాల ప్రారంభం అయిందని,గౌడ్, ప్రహరి గోడ పెంచి నిర్మాణం పూర్తి చేస్తాం ని అదేవిధంగా ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచడం జరిగిందని కష్టంగా కాకుండా , ఇష్టంగా చదివితే విజయం సాధించవచ్చని సూచించారు.



## సూర్యాపేట జిల్లాకు 1000 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది

కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట**: జిల్లాలో నిన్నటి వరకు 1600 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉండేదని, ఆదివారం జిల్లాకు మరో 1000 మెట్రిక్ టన్నుల యూరియా క్రిబ్కో వాగన్ ద్వారా వచ్చిందని, దీంతో మొత్తం జిల్లాలో 2600 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చిన యూరియాను పిఎసిఎస్‌ల, ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేయడం జరుగుతుందని, దీనికితోడు జిల్లాలో 5600 లీటర్ల నానో యూరియాను అన్ని సొసైటీలు ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉంచడం జరిగిందని పేర్కొన్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడుకోవచ్చని, నానోయూరియా వాడటం వల్ల భూసారం తగ్గకుండా నత్రజనిని పైరకు అందిస్తుందని వెల్లడించారు. రానున్న రోజుల్లో ఇఫ్కో, ఆర్సీఎఫ్ వ్యాగన్ల ద్వారా యూరియా రానుందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు పడుతున్నందున వర్షపు నీరులో నైట్రోజన్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల రైతులు ఎకరానికి కొంత మోతాదులో యూరియా లభిస్తుందని, రానున్న పది రోజుల్లో యూరియా వినియోగం తగ్గించుకోవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు ఈ సీజన్‌లో జిల్లాలో రైతులకు 30వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయడం జరిగిందని, రానున్న రోజుల్లో యూరియా అందుబాటులో ఉంచడానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## సాయం సంధ్య వేళ.. కృష్ణమ్మ పరవళ్లు..

26 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల...

సాగర్‌లో పర్యాటకుల సందడి





**ప్రజాపక్షం/నందికొండ**: వారం రోజులుగా శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఇంకా 416324 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతూ ఉండటంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర పైకి లేపి 363714 క్యూసెక్కుల నీటిని స్పిల్ వే ద్వారా దిగువకు విడుదలచేస్తున్నారు. అయితే కుడి,ఎడమ కాలువలు, ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, స్పిల్ వే తో కలిపి మొత్తం అవుట్ ఫ్లో 416324 క్యూసెక్కులు. రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు గాను ఆదివారం సాయంత్రానికి 585 అడుగులుగా ఉండి పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలకు 297.4350 టీఎంసీలుగా ఉంది.

**పర్యాటకుల సందడి**: ప్రాజెక్ట్ 26 గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతూ ఉండటంతో అందులో ఆదివారం సెలవు దినం కావడంతో సాగర్ లో పర్యాటకులతో పూర్తిగా సందడి వాతావరణం నెలకొంది. సాయంత్రం సూర్యాస్తమ సమయంలో సాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల ద్వారా పాలపొంగులా జాలువారుతున్న కృష్ణమ్మ పరవళ్ళు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుంది.దీనితో ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు పర్యాటకులతో అత్యంత రద్దీగా మారటం గమనార్హం. వాహనాల రద్దీ భారీగా పెరగడంతో స్తూపకంగా ఉ న్న లాంచీ స్టేషన్, ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు, జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం, కొత్త , పాత వంతెనల వద్ద పర్యటకులతో క్రిక్కిరిసిపోవడంతో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. పర్యాటకుల రద్దీని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ టూరిజం శాఖ నాగార్జున కొండకు లాంచీలను మూడు ట్రిప్పులు నడిపారు. ఇంకా పర్యాటకుల రద్దీ తగ్గకపోవడంతో పర్యాటకుల అభ్యర్థన మేరకు రిజర్వాయర్ లో రెండు జాలి ట్రిప్పులను నడిపారు. లాంచీలో నాగార్జునకొండకు వెళ్లిన పర్యాటకులు అక్కడి మ్యూజియంలోని విశేషాలు, బుద్ధుని అవశేషాలు, మాన్యుమెంట్స్ తదితర ప్రాంతాలను సందర్శించారు. అక్కడినుంచి సాయంత్రం వేళలో ఎత్తిపోతల, బుద్ధవనం తదితర ప్రాంతాలను సందర్శించారు. నాగార్జునకొండకు లాంచి ప్రయాణం తమకు ఎంతో ఆనందాన్ని ఆహ్లాదాన్ని కలిగించిందని ప్రయాణికులు తమ అనుభూతిని వ్యక్తపరిచారు.



## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/ రామన్నపేట**: సీఎం సహాయ నిధి పేదలకు వరమని కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఆవుల నర్సింహాయాదవ్ అన్నారు. ఆదివారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారు నాగటి యాదయ్యకు మంజూరైన రూ.48వేల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆయన పంపిణి చేసి మాట్లాడారు. ప్రైవేట్, కార్పోరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు రిలీఫ్ పండ్ ఆసరాగా నిలుస్తుందనారు. బాధితులు అవసరమైన సమయంలో సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆవుల నర్సింహా, కందిమళ్ల గోపాల్‌రెడ్డి, ఆవుల సత్యానారాయణయాదవ్, నోముల ప్రవీణ్, ఆవుల క్రాంతికుమార్‌యాదవ్, నోముల యాదగిరి, ఆవుల పర్వతాలు, నోముల సామ్మి, నోముల విష్ణు, సుర్వి సతీష్, చిప్పలపల్లి రామచంద్రం, ఆవుల యాదయ్య, నోముల పర్వతాలు, సుర్వి రాకేష్ పాల్గొన్నారు.

## రామలింగం మృతి సిపిఐకి తీరనిలోటు




**ప్రజాపక్షం/చివ్వెంల**: ఖంభంపాటి రామలింగం మృతి చెందడం సిపిఐ పార్టీకి తీరనిలోటు అని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు , సిపిఐ మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము అన్నారు. ఆదివారం చివ్వెంల మండలం ఖాసీంపేట గ్రామంలో మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనం నుండి సిపిఐ పార్టీలో ఉంటూ, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ మండల నాయకులుగా, పార్టీ గ్రామ కార్యదర్శిగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారని అన్నారు. సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్ మాట్లాడుతూ రామలింగం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ ఈ ప్రాంతంలో ఉద్యమాలు చేసిన ఘనత వారి కుటుంబానికి ఉన్నదని అన్నారు. ఆయనకి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నిమ్మల ప్రభాకర్, రేగటి లింగయ్య, ఎండి పాషా, మహిళ నాయకురాలు దేశగాని హేమలత, ఐతరాజు లింగయ్య పాల్గొన్నారు.

## క్రీడల్లోనూ ప్రావీణ్యం సాధించాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : విద్యార్థులు చదువుకే పరిమితం అవ్వకుండా యోగ, సంగీతం, క్రీడంశాల్లో ప్రావీణ్యం సాధించాలని విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుబ్బారావు సూచించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో ముందు వరుసలో ఉండాలన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దేశ్ముఖి గ్రామంలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఆదివారం విజ్ఞాన్స్ యూనివర్సిటీ శ్రీ వశిష్ట జూనియర్ కళాశాలల సంయుక్త భాగస్వామ్యంతో నిర్వహించిన క్రీడా సమ్మేళనం 2025 ఘనంగా ముగిసింది. విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్ వంటి క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించగా విద్యార్థులు తమ అత్యుత్తమ ప్రదర్శనలతోఉర్రూతలూగించారు. ఒకరితో ఒకరు నువ్వా నేనా అన్నట్లు పోటీ పడి విజయాలు సాధించారు. ఈ కార్యక్రమం సందర్భంగా విజ్ఞాన్స్ వర్సిటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ ఆటల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం వలన జిజ్ఞాస, సమర్థ సమయ పాలన, బుద్ధి స్థిరత్వం, వేగంగా సంగ్రహించుకోగలగడం ఇలా ఎన్నో అంశాల్లో అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ డా ఎం.సుబ్బారావు, శ్రీ వశిష్ట జూనియర్ కళాశాలల జీఎం వంశీ చంద్ర, అసోసియేట్ డీన్ రాఘవేంద్ర, ప్రిన్సిపల్స్ సతీశ్, రంజిత్లతో పాటు ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## గుర్తింపు కార్డుల పంపిణీ



**ప్రజాపక్షం /హాలియా**: హాలియా మున్సిపాలిటీ లోని నూతన గీత కార్మిక సొసైటీ సభ్యులకు గుర్తింపు కార్డులను ఆ సంఘం అధ్యక్షుడు కొమ్మనబోయిన రఘుగౌడ్ పంపిణీ చేశారు. ఆదివారం హాలియాలో ఏర్పాటుచేసిన సమావేశంలో నూతనంగా ఏర్పడిన గీతా కార్మిక సొసైటీ సభ్యులకు ఈ కార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనుముల గ్రామంలో ఉన్న గీతా కార్మిక సొసైటీ భూముల్లో ఖర్జూర చెట్లు ఏర్పాటు చేసి దాని ద్వారా వచ్చే ఖర్జూర కల్లును విక్రయిస్తామని తెలిపారు. గీతా కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. వీటిని గీత కార్మికులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమ్మన బోయిన చంద్రశేఖర్ గౌడ్, పానుగుండ్ల సైదులు గౌడ్, బల్మూరు శ్రీశైలం గౌడ్, వెంకన్న గౌడ్ ,చింతపల్లి వెంకటయ్య గౌడ్, లింగాల రాంబాబు గౌడ్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## పుల్లెంలలో కంఠమహేశ్వర స్వామి బోనాలు



**ప్రజాపక్షం/చండూరు**: మండల పరిధిలోని పుల్లెంల గ్రామంలో ఆదివారం రోజున గౌడ కులస్తులు కంఠమహేశ్వర స్వామి బోనాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఆడపడుచులు బోనాలు ఎత్తుకొని డప్పుచప్పులతో ఆడుతూ పాడుతూ తరలివెళ్లి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు.

## ప్రతీ పేదవాడికీ ప్రభుత్వ పథకాలు

ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/గుండాల**: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిఎస్ఆర్ ఫండ్స్‌తో ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్యలు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడు తూ ఆసుపత్రికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎంపి నిధుల నుండి ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని వారు తెలిపారు. గుండాల మండల అభివృద్ధికి తనవంతుగా కృషి చేయడం జరుగుతుందని వారు తెలిపారు. రాష్ట్రంలో ప్రజా పాలనలో ప్రతి పేదకు ప్రభుత్వ పథకాలు అందజేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఇప్పటికే నూతన రేషన్ కార్డులు అందించడం, అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇండ్ల అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసారపు యాదగిరి గౌడ్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన గుండాల మండల కేంద్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని మండలంలో 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసి 24 గంటల వైద్య సదుపాయం కల్పించాలని ఎంపి, ఎంఎల్ఏను ఆయన కోరారు. మాజీ ఎంపిపి కృష్ణారెడ్డి మాట్లాడుతూ నవాబు పేట రిజర్వాయర్ ద్వారా మండలానికి సాగునీరు అందించాలని కోరగా ఎంపి, ఎంఎల్ఏలు మాట్లాడుతూ నవాబు పేట రిజర్వాయర్ ద్వారా మండలానికి నీరు అందించిన అసంపూర్తిగా ఉన్న కాల్వలను పూర్తి చేస్తామని, ధర్మాసాగర్ నుండి నవాబుపేట రిజర్వాయర్‌ను నింపి నీరు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాదగిరిగౌడ్, మాజీ ఎంపిపి కృష్ణారెడ్డి, డిఎంహెచ్‌వో మనోహర్, వైద్యాధికారి హైమావతి, మాజీ అధ్యక్షులు వెంకన్న, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు, ఏఎన్ఎంలు, ఆశాలు, సిబ్బంది, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### మోత్కూర్ మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని వినతి

మోత్కూర్ మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని బిసి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆదివారం గుండాల మండల పర్యటనకు వచ్చిన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్యలకు బిసి రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ వినతిపై ఎంపి, ఎంఎల్ఏలు సానుకూలంగా స్పందించి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో బిసి రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు నర్సయ్య, శ్రీనివాస్‌యాదవ్, ఉదమ్ తదితరులు ఉన్నారు.



## గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు అరెస్ట్

కిలో290 గ్రాముల గంజాయి : 7 సెల్ ఫోన్‌లు..ఒక స్కూటీ..ఒక మోటార్ సైకిల్, ఆటో స్వాధీనం

సిఐ వెంకటేష్ వివరాలు వెల్లడి

**ప్రజాపక్షం/ నల్లగొండ (నకిరేకల్ )**: అక్రమ గంజాయి రవాణా చేస్తూ, విక్రయిస్తూ, సేవిస్తున్న ఆరుగురు నిందితులను నకిరేకల్ పోలీసులు అరెస్టు చేసి వారి నుండి ఒక జేసీల్ ను పట్టుబడి జరిగిందని సిఐ వెంకటేష్ వెల్లడించారు. ఆదివారం నకిరేకల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిర్మూలనలో బాగంగా ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ లు నిర్వహిస్తూ ఈ నెల 23న మధ్యాహ్నం 12.50 గంటల సమయంలో నకిరేకల్ పట్టణ శివారు లోని తాటికల్ రోడ్ లో గల కుమ్మరి బావి దగ్గర్లోని చెట్ల పొదల వద్ద అక్రమంగా గంజాయి అమ్ముచున్నారని నమ్మదగిన సమాచారం రాగా ఎస్ఐ తన సిబ్బంది తో యుక్తంగా అక్కడికి వెళ్ళి అక్రమ గంజాయి విక్రయిస్తున్న, కొనుక్కొని సేవిస్తున్న ఆరుగురు నిందితులను ఒక జేసీల్ ను పట్టుకొని వారి వద్ద నుండి 01 కిలో290 గ్రాముల గంజాయి, 7 సెల్ ఫోన్ లు, ఒక స్కూటి, ఒక మోటార్ సైకిల్ ఒక ఆటోను నిందితుల నుండి స్వాధీనపరచుకోవడం జరిగిందని తెలిపారు. నిందితుల వివరాలు నల్లగొండ పట్టణానికి చెందిన సమీర్,బోరిగం సంపత్ కుమార్, నకిరేకల్ పట్టణంలోని తాటికల్ రోడ్ లో నివాసం ఉంటున్న యన్నమల్ల సాయిరాం.ముక్కాముల అఖిల్, పాలెం గ్రామానికి చెందిన.పల్లెబోయిన శివ, శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికిచెందిన బండారి వినయ్ ,చివ్వెంల మండలం కోమటికుంట గ్రామానికి చెందిన .కుంచం నవీన్ తో పాటు ఒక బాల నేరస్థుడు కూడా ఉన్నారని తెలిపారు. వీరు సులువుగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో గంజాయి అమ్ముతున్నారని తెలిపారు. ఇట్టి కేసును పట్టుబడి చేసిన ఎస్ఐ బి లచ్చిరెడ్డి,ఎస్ఐ. జి క్రిష్ణా చారి ని సిబ్బంది ని జిల్లా ఎస్‌పి అభినందించారు.

## 28లోగా అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్**: 2025/27 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట జిల్లా, హుజూర్‌నగర్‌లోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లో ఆయా కోర్సులలో ఖాళీ సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో పదవ తరగతి పాసై ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 28లోగా ఆయా కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రాలద్వారా యువతకు నైపుణ్యంతో కూడిన శిక్షణను అందించి వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 4.0 ఇండ్రస్టి మిషనరీపై రియల్ టైం ప్రాక్టికల్ ట్రైనింగ్‌ను అభ్యర్థులకు ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఇంతకు ముందు ఎప్పుడు లేని విధంగా అత్యాధునిక మిషనరీతో ఈ అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రాలను నిర్వహించడం జరుగుతున్నదని, ఈ ఎటిసిలో ప్రవేశం పొందిన అభ్యర్థులు అత్యాధునిక మిషన్లపై పని చేస్తూనే పని నేర్చుకోవచ్చని, అనంతరం ఉద్యోగాలు, సొంత వ్యాపారం చేసుకోవడానికి ఈ కోర్సులను రూపొందించడం జరిగిందని తెలిపారు. గతంలో నిర్వహించిన ఐటిఐ లు ఇప్పుడు టెక్నాలజీ హబ్‌లుగా మారాయని, మౌలిక వసతులతో ప్రపంచ స్థాయి ల్యాబ్‌లు, టాటా టెక్నాలజీ సహకారంతో, అలాగే ఇండస్ట్రీల భాగస్వామ్యంతో వీటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హుజూర్‌నగర్‌లో ఉన్న ఎటిసిలో మ్యానుప్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ కోర్సులో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఇండ్రస్టియల్ రోబోటిక్స్ డిజిటల్ మ్యాన్‌ప్యాక్చరింగ్‌లో 40 సీట్లు, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నిషియన్ కోర్సులో 20సీట్లు, వర్చువల్ అనాలసిస్, డిజైనర్స్ కోర్సులో 24 సీట్లు, మెకానికల్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులో 24 సీట్లు ఖాళీగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. పైన పేర్కొన్న పోస్టులలో ప్రవేశం పొందేందుకు పదవ తరగతి ఉత్తీర్ణులై అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ కోర్సులక దరఖాస్తు చేసే అభ్యర్థులు దరఖాస్తుతో పాటు ఎస్ఎస్‌సి మార్కుల జాబితా, ట్రాన్సపర్ సర్టిపికెట్ (టిసి), ఆధార్, కులం ధృవీకరణ పత్రం, బైనఫైడ్, మొబైల్ నెంబర్‌తో పాటు ఈ మెయిల్ అడ్రస్‌ను తప్పని సరిగా జతచేయాలని వెల్లడించారు.


## టిబి వ్యాధిపై అవగాహన ఉండాలి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : టీబీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని శ్రీ ఆర్కే హాస్పిటల్ చావా ఫౌండేషన్ అధినేత డాక్టర్ రాజకుమార్ అన్నారు. భువనగిరి పట్టణంలోని శ్రీ ఆర్ కె హాస్పిటల్ చావా ఫౌండేషన్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో టీబీ వ్యాధిగ్రస్తులకు టీబీ నిర్మూలన కార్యక్రమాన్ని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాయి శోభ ఆధ్వర్యంలో నిర్వహించచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ నిర్మూలన కోసం గవర్నమెంట్ అందజేస్తున్న మందులను క్రమం తప్పకుండా కోర్సు పూర్తి అయ్యేవరకు ఉపయోగించాలని కోరారు. మందులు ఆపకూడదని దాని వలన మళ్లీ వ్యాధి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అనంతరం డాక్టర్ చావా రాజ్ కుమార్, డాక్టర్ చావా అశ్లేష న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిబి నిర్మూలన కార్యక్రమం జిల్లా కార్యవర్గం డాక్టర్లు డాక్టర్ యామిని, డాక్టర్ నిరోషా, శ్రీ ఆర్‌కె హాస్పిటల్ ఇంచార్జీ కొండల్ రెడ్డి, హాస్పిటల్ సిబ్బంది, జిల్లా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపి,ఎమ్మెల్యేలకు సన్మానం


**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం)**: గుండాల మండల పర్యటన సందర్భంగా వెళ్తున్న ప్రభుత్వ విప్, శాసన సభ్యులు బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని ఆత్మకూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్థానిక కాంగ్రెస్ నాయకులతో పలు అభివృద్ధి పనులపై ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్ధులు, ప్రధాన కార్యదర్శి కందడి అనంత రెడ్డి, పిఎసిఎస్‌చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.



## అమృత్ 2.0 పైప్ లైన్ల పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/నందికొండ**: మున్సిపాలిటీలో మంచి నీటి సమస్య పరిష్కారం కోసం డిసెంబర్ 2024 ననాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అమృత్ 2.0 కార్యక్రమపనులకు శంకుస్థాపన చేశారు.44 కోట్ల రూపాయల వ్యయం తో ఈ ప్రాజెక్టును నందికొండ మున్సిపల్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న స్థలంలో నిర్మాణం పూర్తిచేసుకుంది.దీనితో అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న పనులు మున్సిపాలిటీలో నీటి సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే దిశగా అడుగులు వేస్తున్నాయి ఇంటింటికి నల్లాను ఇచ్చి తాగు నీటిని అందించాలని గత ప్రభుత్వం పథకాన్ని రూపుదిద్దింది. అధికారుల అలసత్వంతో సరైన విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయకపోవటం వల్ల అక్కడక్కడా సమస్యలు తలెత్తాయి ఆ తర్వాత ప్రభుత్వం మారీ కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోమునిసి పాలిటీ పరిధిలోఅమృత్2.0 పనులు మంచినీటి నిల్వ ట్యాంకుల నిర్మాణాలు వేగవంతంగా కొనసాగి పూర్తయ్యాయి. మున్సిపాలిటీలో హిల్ కాలనీ పైలాన్ కాలనీలు ఉండగా మొదట హిల్ కాలనీలో పైపులైన్ల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాదిలోనే మున్సిపాలిటీ ప్రజలకు అమృత్ ధారలు అందించేందుకు స్థానిక ఇరిగేషన్అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఆదివారం పైపులైన్ల ప్రారంభ ప్రక్రియను స్థానిక ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డి నివాస గృహం వీధిలో ప్రారంభమైంది. మున్సిపాలిటీలో ఉ న్న ప్రతి ఇంటికి నీటి సరఫరా లో ఎటువంటి అంతరాయం లేకుండా 24 గంటలు నీళ్లు వచ్చే విధంగా చూడటమే అమృత్ 2.0 యొక్క ముఖ్య ఉద్దేశం కావడంతోస్థానిక ప్రజలకు ఇక నీటి కష్టాలు తీరనున్నాయి.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## 15 మంది పాకిస్థానీ మత్స్యకారుల అరెస్టు

**భుజ్ :** గుజరాత్ కచ్ జిల్లాలోని ఇండో–పాక్ సరిహద్దు సమీపంలో సరిహద్దు భద్రతా దళం 15 మంది పాకిస్థానీ మత్స్యకారులను అరెస్టు చేసి, ఇంజిన్‌తో అమర్చిన కంట్రీ బోట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు బిఎస్‌ఎఫ్ తెలిపింది. రాష్ట్రంలోని కచ్ ప్రాంతం కోరి క్రీక్‌లోని సరిహద్దు అవుట్‌పోస్ట్ సాధారణ ప్రాంతంలో గుర్తించబడిన గుర్తు తెలియని పడవకు సంబంధించిన నిర్దిష్ట సమాచారం ఆధారంగా బిఎస్‌ఎఫ్ శనివారం గాలింపు ఆపరేషన్ నిర్వహించిందని పేర్కొంది. పోరుగున ఉన్న బెట్స్‌లో విస్తృతంగా గాలించామి, ఆ సమయంలో 15 మంది పాకిస్థానీ మత్స్యకారులను అరెస్టు చేసి ఒక ఇంజిన్‌తో అమర్చిన కంట్రీ బోట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు బిఎస్‌ఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. పొరుగు దేశం సింధ్ ప్రావిన్స్‌లోని సుజావల్ జిల్లాకు చెందిన పాకిస్థానీ జాతీయులైన మత్స్యకారులు బిఎస్‌ఎఫ్ 68వ బెటాలియన్ సరిహద్దు అవుట్‌పోస్ట్ సాధారణ ప్రాంతంలో గుర్తించినట్లు వెల్లడించింది. పడవలో దాదాపు 60 కిలోల చేపలు, తొమ్మిది ఫిషింగ్ వలలు, డీజిల్, ఐస్, ఆహార పదార్థాలు, చెక్క కర్రలు ఉన్నాయి. వారి వద్ద నుంచి ఒక మొబైల్ ఫోన్, రూ.200 పాకిస్థాన్ కరెన్సీని కూడా స్వాధీనం చేసుకున్నట్లు బిఎస్‌ఎఫ్ తెలిపింది.

## ‘సత్తా చోరీ’లో బిజెపి సర్కార్ నిమగ్నం



### కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ :** నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి సర్కార్ మరో చోరీకి పాల్పడబోతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ‘ఓటు చోరీ’ తర్వాత, బిజెపి ఇప్పుడు 30 రోజుల్లో ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చివేసే బిల్లులను తీసుకురావడం ద్వారా ‘సత్తా చోరీ’లో నిమగ్నమైందని విమర్శించారు. అరెస్టును ఆయుధంగా ఉపయోగించి ప్రజాస్వామ్యాన్ని అస్థిరపరిచే బిల్లులను తీసుకువస్తుందని మండిపడ్డారు. ఈ బిల్లులు పౌరులు ఎన్నికైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే లేదా తొలగించే హక్కును తొలగిస్తాయని, ఇడి, సిబిఐ వంటి సంస్థలకు ఆ అధికారాన్ని ఇస్తాయని ఖర్గే పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై బుల్డోజర్‌ను నడపడం లాంటిదేనని ఖర్గే అభివర్ణించారు. హర్యానా, మధ్యప్రదేశ్ జిల్లా కాంగ్రెస్ కమిటీలకు (డిసిసి) కొత్తగా నియమితులైన అధ్యక్షులతో ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. బూత్, మండల్ కమిటీలను ఏర్పాటు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఈ ప్యానెల్‌లలోని వ్యక్తులు పార్టీకి విధేయులుగా ఉండేలా చూసుకోవాలని, కాంగ్రెస్ సిద్ధాంతం నుండి వైదొలగకుండా చూసుకోవాలని ఖర్గే డిసిసి చీఫ్‌లను హెచ్చరించారు. ‘జిల్లా అధ్యక్షుడు తన ఆధ్వర్యంలో బ్లాక్ కమిటీని ఏర్పాటు చేస్తాడు. ఆయన మండల్, బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తాడు. మీరు ఈ కమిటీలను ఏర్పాటు చేసినప్పుడు, ఈ వ్యక్తులందరూ పార్టీకి విధేయులుగా, కష్టపడి పనిచేసేవారిగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ముఖ్యంగా, వారు కాంగ్రెస్ సిద్ధాంతం నుండి తొలగిపోకూడదు’ అని ఖర్గే అన్నారు. ఎవరైనా వారిని ప్రలోభపెట్టినా, వారి విధేయత కాంగ్రెస్ వైపు ఉండాలి, అలాంటి వ్యక్తులు అవసరమని ఆయన నొక్కి చెప్పారు. కాంగ్రెస్ సంస్థలో జిల్లా ఓరెసిడెంట్ బలమైన లింకని, రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఎన్నుకోవాల్సి వస్తే, శాసనసభలలో అభ్యర్థిని ఎన్నుకోవడంలో ఆయన ముఖ్యమైన పాత్ర పోషిస్తారన్నారు. దేశంలో ప్రభుత్వం ఏర్పాటు కావాలంటే, లోక్‌సభలో గెలవడానికి డిసిసిల మద్దతు అవసరం చెప్పారు.

‘ఈ మధ్య, ఈ సంప్రదాయంలో స్వల్ప మార్పు వచ్చింది. మంత్రులు తమకు ఇష్టమైన వారిని జిల్లా అధ్యక్షుడిని చేయడం ప్రారంభించారు. సామర్థ్యం, భావజాలాన్ని విస్మరించడం ప్రారంభించారు. రాహుల్ (గాంధీ) జీ, నేను కాంగ్రెస్‌ను బలోపేతం చేయకుండా, జిల్లా అధ్యక్షులకు ప్రాముఖ్యత ఇవ్వకుండా బలంగా అధికారంలోకి రాలేమని గ్రహించామని’ అని పేర్కొన్నారు. కర్ణాటకలోని మహదేవపుర స్థానంలో కుట్ర ద్వారా వ్యూహాత్మకంగా ఓట్లు ఎలా 'దొంగిలించబడ్డాయో' రాహుల్ గాంధీ ఇటీవల వివరణాత్మక ప్రజెంటేషన్ ఇచ్చారని ఖర్గే ఎత్తి చూపారు. ఇటీవల ముగిసిన వర్షాకాల సమావేశాల గురించి మాట్లాడుతూ, ప్రతిపక్షం పార్లమెంట్ పనిచేయాలని, ప్రజల ముఖ్యమైన అంశాలపై చర్చించబడాలని కోరుకుంటున్నట్లు ఖర్గే అన్నారు, అయితే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, ‘ఓటు చోరీ’ వంటి కీలక విషయాలను చర్చించాలని బిజెపి ప్రభుత్వం కోరుకోవడం లేదని అన్నారు. దేశంలోని ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కాంగ్రెస్ ఇచ్చిన బహుమతి అని ప్రజలకు చెప్పాలని ఆయన కాంగ్రెస్ నాయకులను కోరారు.

రాజీవ్ గాంధీ ఓటు వేసే వయస్సును 21 నుండి 18 సంవత్సరాలకు తగ్గించారు, తద్వారా ప్రజాస్వామ్యంలో యువత భాగస్వామ్యం పెరుగుతుంది ఆయన ఎత్తి చూపారు. ప్రతిపక్ష నాయకులపై ఉన్న 193 కేసుల్లో, ఇడి చర్య ఫలితంగా కేవలం రెండు కేసుల్లో మాత్రమే దోషులుగా తేలడాన్ని చూశామని, చాలా మంది ముఖ్యమంత్రులు, మంత్రులను అరెస్టు చేసి నెలల తరబడి జైలులో ఉంచారని, కానీ ఇప్పుడు వారి వద్ద ఎటువంటి ఆధారాలు లేవని సిబిఐ చెబుతోందన్నారు. మోదీ నేడు అవినీతి గురించి పెద్దగా మాట్లాడుతున్నారు, కానీ ఆయన అవినీతిపరులుగా పిలిచే వారందరినీ పార్టీలో చేర్చుకున్నారని, వారిని మంత్రులుగా కూడా చేశారని మండిపడ్డారు.

## ఇసి బిజెపి కోసమే పనిచేస్తుంది

### ఎన్నికల సంఘం పక్షపాత ప్రవర్తన మారాల్సిన అవసరం ఉంది

### ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శలు

### రాహుల్, తేజస్వీ మోటార్ సైకిల్ రైడ్



**అరారియా :** కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శలను మరింత ముమ్మరం చేశారు. తూర్పు రాష్ట్రం బిహార్‌లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) బిజెపికి సహాయం చేయడానికి ఎన్నికల కమిషన్ ఓట్లను దొంగిలించడానికి చేసిన సంస్థాగత ప్రయత్నమని ఆరోపించారు. బిహార్‌లో ఓట్లను దొంగిలించడానికి తాము ఎన్నికల సంఘాన్ని అనుమతించబోమన్నారు. ఆదివారం రాహుల్ గాంధీ ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్, ఇండియన్ ఇండియా కూటమికి చెందిన పలు నియోజకవర్గాల నాయకులతో కలిసి అరారియాలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోల్ ప్యానెల్ బిజెపి ప్రయోజనం కోసం పనిచేస్తోంద మండిపడ్డారు. ఇసి బిజెపి కోసం పనిచేస్తున్నట్లు పూర్తిగా బయటపడిందని రాహుల్ పేర్కొన్నారు. హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటకలో ఓటర్ల జాబితాలను తయారు చేయడంలో జరిగిన అవకతవకలను, జాబితాలో నకిలీ ఓటర్లను ఎలా చేర్చారో తాను బహిర్గతం చేశానని, ఈ విషయంపై ఎన్నికల కమిషన్ తన నుండి అఫిడవిట్ కోరిందని చెప్పారు. కానీ పాలక వర్గానికి చెందిన అనురాగ్ ఠాకూర్ విలేకరుల సమావేశంలో అదే విషయాన్ని చెప్పినప్పుడు, కమిషన్ అతని నుండి ఎటువంటి అఫిడవిట్ అడగలేదని ప్రశ్నించారు. ఈ చర్య ఇసి తటస్థంగా లేదని నిరూపిస్తుందన్నారు. ఎన్నికల సంఘం పక్షపాత ప్రవర్తన మారాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. బిహార్‌లోని అన్ని ఇండియన్ కూటమి నియోజకవర్గాల సభ్యులు రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఐక్యంగా పనిచేస్తున్నారని, ఫలితాలు ఫలవంతంగా ఉంటాయని కాంగ్రెస్ నాయకుడు నొక్కి చెప్పారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న ఎన్నికల కోసం ప్రతిపక్ష కూటమి త్వరలో ఒక సాధారణ మేనిఫెస్టోను విడుదల చేస్తుందని చెప్పారు. బిహార్‌లో చేపట్టిన ఓటరు అధికార్ యాత్ర గొప్ప విజయాన్ని సాధించిందన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని, తమకు కోట్లాది మంది రాష్ట్ర ప్రజల మద్దతు లభించిందని హర్షం వ్యక్తం చేశారు. బిహార్‌లో ఎన్నికల సంఘం ప్రజల ఓట్లను దొంగిలిస్తున్నారనే వాస్తవాన్ని ఇది నిరూపించిందని ప్రతిపక్షనేత పేర్కొన్నారు. చిన్న పిల్లలు కూడా ఇప్పుడు ‘ఓటు చోర్, గద్దీ చోడ్’ (ఓటు దొంగ, అధికార సీటును ఖాళీ చేయండి) అనే నినాదాన్ని లేవనెత్తుతున్నారని, దీన్ని భట్టి తమ యాత్ర ప్రభావాన్ని ఊహించవచ్చన్నారు. అయితే, రాబోయే ఎన్నికలకు మహాఘట్‌బంధన్ తేజస్వి యాదవ్‌ను ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎందుకు ప్రకటించడం లేదనే ప్రశ్నకు ఆయన సమాధానాన్ని దాటవేశారు. తాము ఒకరితో ఒకరం సహకరించుకుంటున్నామని, ‘ఓటు చోరీ’ (ఓటు దొంగతనం)ని తనిఖీ చేయాలని సూచించారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి కె శివకుమార్‌తో పాటు సిపిఐ (ఎంఎల్) లిబరేషన్‌కు చెందిన దీపాంకర్ భట్టాచార్య, విఐపి ముఖేష్ సాహ్నీ సహా ఇండియా కూటమికి చెందిన అనేక మంది నాయకులు కూడా సంయుక్త విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. అంతకు ముందు జరిగిన యాత్రలో మాట్లాడుతూ దేశంలోని పేదలు, యువతకు అన్ని ఉపాధి అవకాశాలను మూసివేసినందుకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించిన తర్వాత నరేంద్ర మోదీ ప్రభుత్వం... ఇప్పుడు ఎన్నికల కమిషన్ సహాయంతో ఎస్‌ఐఆర్ ద్వారా పేదల ఓట్లను దొంగిలించాలనుకుంటోంది అని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, దాని మిత్రపక్షాలకు బిహార్ ప్రజలు తగిన సమాధానం ఇస్తారని జోస్యం చెప్పారు.

#### రాహుల్, తేజస్వీ మోటార్ సైకిల్ రైడ్

కాగా, రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్ ఆదివారం బిహార్ పూర్నియా జిల్లాలోని అరారియా వీధుల గుండా మోటార్ సైకిళ్లపై ‘ఓటర్ అధికార్ యాత్ర’ చేశారు. ఈ ఇద్దరు నాయకులను చూడటానికి ప్రజలు వీధుల్లో బారులు తీరారు.

### బిహార్ ఎస్‌ఐఆర్ ఓటర్ల నుంచి ఇప్పటివరకూ..

## 98.2శాతం మంది ధృవీకరణ పత్రాలు అందాయ్

### తప్పుడు వివరాలు సరిచేసుకునేందుకు

### సెప్టెంబరు 1 ఆఖరిగడువు : ఎన్నికల సంఘం వెల్లడి



**న్యూఢిల్లీ :** బిహార్‌లో ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్) సందర్భంగా కొత్తగా నమోదు చేసుకున్న వారిలో 98.2శాతం మంది నుంచి ధృవీకరణ పత్రాలు ఇప్పటికే అందాయని ఆదివారం ఎన్నికల కమిషన్(ఇసి) వెల్లడించింది. తాజాగా ప్రచురించిన ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, క్లెయిమ్‌లు తెలియజేయడానికి మరో 8 రోజుల గడువు ఉంది. ఓటర్లు వారి గణన ఫారమ్‌లను సమర్పించేటప్పుడు వారి వద్ద ఉన్నటువంటి అవసరమైన పత్రాలను కూడా సమర్పించడానికి క్లెయిమ్‌లు, అభ్యంతరాల వ్యవధి అవకాశాన్ని కూడా ఇస్తున్నట్లు ఎన్నికల కమిషన్ నొక్కిచెప్పింది. ముసాయిదా జాబితాలో తప్పుగా నమోదైన వివరాలను సరిచేయించుకోవడానికి ఇదే చివరి అవకాశమని ఎన్నికల కమిషన్ తెలిపింది. బిహార్ సిఇఓ కార్యాలయం నుండి అందిన సమాచారం ప్రకారం.. ఓటర్ల నుంచి ఇప్పటివరకు 98.2శాతం డాక్యుమెంట్లు అందాయని ఇసి వెల్లడించింది. జూన్ 24నుంచి ఆగస్టు 24వరకు 98.2శాతం మంది వ్యక్తులు వారి డాక్యుమెంట్లు సమర్పించారు. దీని అర్థం ఒక రోజుకు సగటున1.64 శాతం. ఇంకా 8 రోజుల గడువులో సెప్టెంబర్ 1వరకు మిగతా 1.8శాతం ఓటర్లు వారి డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుందని తెలియజేసింది. ఓటర్ల జాబితాలో పేరు చేర్చాలని అభ్యర్థిస్తూ ఆధార్‌కార్డు లేదా ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 డాక్యుమెంట్లలో ఏదైనా ఒకటి సమర్పించినట్లయితే అంగీకరించాలని సుప్రీం కోర్టు ఇసిని ఆదేశించిన విషయం తెలిసిందే. ఎన్నికలు జరుగనున్న బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్‌ఐఇ)ఓటర్ల జాబితాను నిర్వహించడంపై విశ్వాసం ఉంచాలని ఎన్నికల సంఘం సుప్రీంకోర్టును కోరింది.

### సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం..

## సభా సమావేశాలను అడ్డుకోవడం సహేతుకం కాదు

### ప్రతిపక్షాలకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హితవు



**న్యూఢిల్లీ :** పార్లమెంట్, అసెంబ్లీలు బహిరంగ చర్చ, చర్చలకు స్థలాలని, కానీ సంకుచిత రాజకీయాల కోసం ప్రతిపక్షం పేరుతో సభను సెషన్ తర్వాత సెషన్ నడవకుండా చేయడం మంచిది కాదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హితవు పలికారు. ఆయన ఆదివారం ఇక్కడ ‘ఆల్ ఇండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్’ను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా అమిత్‌షా ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో పదేపదే అంతరాయం, వాయిదాల కారణంగా ప్రతిపక్షాల నిరసనల నేపథ్యంలో కొద్దిసేపైనా కార్యకలాపాలు నిర్వహించకుండానే సమావేశం ముగిసింది. ఎప్పుడైతే పార్లమెంట్‌లో పరిమిత బహిరంగ చర్చ లేదా చర్చ జరగుతుందో అప్పుడు జాతి నిర్మాణంలో సభ సహకారం ప్రభావితం అవుతుందని హోంమంత్రి అన్నారు. ప్రజాస్వామ్యంలో చర్చ జరగాలి. కానీ ఎవరైనా సంకుచిత రాజకీయాల కోసం ప్రతిపక్షం పేరుతో సభను నడపకుండా అడ్డుతగలడం సహేతుకం కాదు. ‘ప్రతిపక్షం ఎల్లప్పుడూ సంయమనంతో ఉండాలి. కానీ, ప్రతిపక్షం పేరుతో రోజురోజుకూ లేదా ఒక సమావేశాల తర్వాత సమావేశం నిర్వహించకుండా ఉంటే అది మంచిది కాదు. దేశం దాని గురించి ఆలోచించాలి, ప్రజలూ దాని గురించి ఆలోచించాలి. ఎన్నికైన ప్రతినిధులూ దాని గురించి ఆలోచించాలి’ అని ఆయన చెప్పారు. అన్ని చర్చలూ కొంతఅర్థవంతంగా ఉండాలని, స్పీకర్ పదవి గౌరవ ప్రతిష్ఠల్ని పెంచేలా ఉండాలి అని కూడా అమిత్‌షా వ్యాఖ్యానించారు. ‘ప్రజల సమస్యలను లేవనెత్తడానికి నిష్పాక్షిక వేదికను అందించడానికి మనం కృషి చేయాలి. ట్రెజరీ, ప్రతిపక్షం రెండింటి వాదనలు నిష్పాక్షంగా ఉండాలి. హౌస్ పనితీరు సంబంధిత సభ నియమ నిబంధనల ప్రకారం ఉండేలా చూసుకోవాలి. హస్తినాపురంలో మహాభారతంలోని ద్రౌపది పాత్రకు జరిగిన అన్యాయాన్ని ఆయన ఉదహరించారు. సభ గౌరవం దిగజారినప్పుడల్లా దేశం తీవ్రపరిణామాలను చవి చూసింది అని అమిత్‌షా ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో లేదా శాసనసభలలో చర్చ జరగకపోతే ఇవి నిర్జీవ భవనాలుగానే మిగిలిపోతాయని అమిత్‌షా అన్నారు. ‘ఈ భవనాలలో అభిప్రాయాలను వ్యక్తీకరించే పనిని స్పీకర్ నాయకత్వంలో సభ్యులు చేస్తారు. అప్పుడే అది దేశం, రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేసే ఒక జీవిగా అవుతుంది’ అని ఆయన విశదీకరించారు. ఏ చట్టమైనా ప్రజల సంక్షేమం, దేశ సమగ్రాభివృద్ధి పరిపాలనా సామర్థ్యాన్ని నిర్ధారించడం, దేశ అంతర్గత భద్రత, బాహ్య భద్రత లక్ష్యంగా ఉండాలని అమిత్‌షా అన్నారు. సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి తొలిసారి ఎన్నికైన విఠల్‌భాయ్ పటేల్‌కు హోం మంత్రి ఈ సందర్భంగా నివాళులు అర్పించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సోదరుడైన విఠల్‌భాయ్ పటేల్ అందించిన సేవలు సంవత్సరాలుగా మసకబారాయని హోంమంత్రి అమిత్‌షా ఆవేదన వ్యక్తం చేశారు.

### అదనపు కట్నం కోసం

## భార్యను తగులపెట్టిన కిరాతక భర్త

### పారిపోతుండగా కాలిపై పోలీసులు కాల్పులు

### గ్రేటర్ నోయిడాలో సంఘటన

### కొడుకు ముందే కట్నం జ్వాలల్లో సమిధైన నిక్కీ

**నోయిడా :** తన భార్యను తల్లిదండ్రులతో కలిసి అదనపు కట్నం కోసం తీవ్రంగా వేధిస్తూ నిప్పంటించి తగులబెట్టి చంపిన ఓ కిరాతక భర్త పోలీసులపై ఎదురుతిరిగి తీవ్రంగా గాయపడ్డ ఉదంతం సంచలనం సృష్టించింది. విపిన్ భాటి అనే నిందితుడు పోలీస్ కస్టడీ నుంచి పారిపోతూ పోలీసుల కాల్పుల్లో గాయపడ్డ సంఘటన ఆదివారం గ్రేటర్ నోయిడాలో చోటుచేసుకుంది. నిందితుడు విపిన్ భార్యను కట్నం కోసం వేధిస్తున్నాడని, రూ.36లక్షల అదనపు కట్నాన్ని డిమాండ్ చేస్తూ భార్యకు నిప్పంటించిన కేసులో నిందితుడుగా ఇతడు పోలీస్ కస్టడీలో ఉన్నాడని ఒక అధికారి చెప్పారు. నిందితుడైన విపిన్ భాటిని రోజువారీ వైద్య పరీక్షల నిమిత్తం ఎస్కార్ట్ వాహనంలో తీసుకెళ్తుండగా దాదాపు మధ్యాహ్నం 130గంటల సమయంలో అతడు పారిపోయేందుకు ప్రయత్నించాడని గౌతమ్ బుద్ధ నగర్ పోలీస్ పిఆర్ఓ చెప్పారు. అతడిని వెంబడించి పట్టుకునే క్రమంలో పోలీసులు అతడి కాలిపై కాల్చగా నిందితుడు గాయపడ్డాడు. భాటి స్వగ్రామమైన సిర్సా కస్నా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంది. అయితే విపిన్ భాటి ఆయన భార్య నిక్కీని జుట్టుపట్టుకుని లాక్కెళుతున్న ఒక కలతపెట్టే వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోన్న నేపథ్యంలో శనివారం పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. మరో వీడియో క్లిప్పింగ్‌లో నిక్కీ తగులబడుతున్న సమయంలో పరుగెత్తుకుంటూ వచ్చి మెట్లమీదే కుప్పకూలిపోవడం కూడా ప్రసారం అయ్యింది. గురువారం రాత్రి నిక్కీని హాస్పిటల్‌కు తరలిస్తున్న సమయంలో కన్నుమూశారు. అదే కుటుంబంలోని వ్యక్తిని వివాహం చేసుకున్న నిక్కీ అక్క కాంచన్ తన చెల్లిపై విపిన్ భాటి, ఆయన కుటుంబ సభ్యులు కట్నం కోసం దాడి చేస్తూ ఆమెను చంపుతున్న వీడియో రికార్డు చేసింది. ‘మమ్ములను రోజుల తరబడి కొడుతున్నారు. వారు రూ.36లక్షలు కట్నం డిమాండ్ చేస్తున్నారు. నిక్కీ మెడ, తలపై గట్టిగా కొట్టారు. ఆమెపై యాసిడ్ విసిరి ఆమె కుమారుడి ముందే ఆమెకు నిప్పంటించారు’ అని కాంచన్ విలేకరుల ముందు కంటతడి పెట్టింది. అడ్డుకోవడానికి ప్రయత్నించినప్పుడు తనపై కూడా దాడి జరిగిందని కాంచన్ చెప్పారు.

అదనపు డిసిపి సుధీర్‌కుమార్ శుక్రవారం ఈ ఘటనపై మాట్లాడుతూ ఒక మహిళ కాలినగాయాలతో తమ హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యిందని ఫోర్టిస్ హాస్పిటల్ నుంచి పోలీసులకు సమాచారం అందిందన్నారు. తాము ఆమెను చికిత్స కోసం సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌కు సిఫారసు చేశామని తెలియజేశారన్నారు. కానీ పోలీసుల బృందం సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌కు చేరుకునేలోపే ఆ మహిళ గాయాలతో మరణించిందని అదనపు డిసిపి సుధీర్‌కుమార్ వివరించారు. ‘విపిన్ భాటి మళ్లీ పెళ్లి చేసుకునేందుకు తన చెల్లి వెళ్లిపోవాలని వారి అత్త మామలు కోరుకుంటున్నారు. వారు నన్ను చెంపదెబ్బ కొట్టారు. నేను గాయపడి రోజంతా స్పృహ కోల్పోయాను ’అని కాంచన్ చెప్పింది. కాగా నిక్కీని ఆమె కుటుంబ సభ్యులు దహనం చేశారు. కాంచన్ ఫిర్యాదుపై పోలీసులు నిక్కీ భర్త విపిన్ భాటి, కుటుంబసభ్యులపై కాస్నా పోలీస్ స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదు అయ్యింది. నిక్కీ, విపిన్ భాటిల వివాహం 2016లో జరిగింది. దంపతులకు ఒక కుమారుడు ఉన్నారు.

## శత్రువు దాడి చేస్తే మన గగనతలం అభేద్యం




**న్యూఢిల్లీ:** భారత గగనతలం అభేద్యమైనదని, శత్రువుల ఆయుధాలు, మానవ రహిత డ్రోన్లు వంటివి ప్రవేశిస్తే క్షణాల్లో వాటిని తుత్తునియలు చేయగలమని ఒడిశా తీరం నుండి చేసిన పరీక్షల ద్వారా డిఆర్‌డిఓ (రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ) నిర్ధారించింది. దీంతో భారత గగనతలానికి బహుముఖ వలయ రక్షణ సామర్థ్యం చేకూరినట్లవుతుంది. సరికొత్త వార్‌ఫేర్‌లో దేశంలో కీలకమైన మౌలిక సదుపాయాలున్న ప్రాంతాలను శత్రు ఆయుధాల నుండి రక్షించడంలో దీనిదే ముఖ్యపాత్ర అవుతుంది. మొదటిసారి ఈ పరీక్షలు జరిగాయి. డిఆర్‌డిఓ సీనియర్ అధికారులు ఈ పరీక్షలను పర్యవేక్షించారు. ఆపరేషన్ సిందూర్ సైనిక చర్య జరిగిన మూడున్నర నెలల తర్వాత డిఆర్‌డిఓ దేశీయంగా తయారు చేసిన ఐఎడిడబ్ల్యుఎస్ అత్యాధునిక వ్యవస్థతో ఈ పరీక్షలు నిర్వహించింది. మన గగనతల వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దుకుని, భారత వాయుక్షేత్రాన్ని అభేద్యంగా తీర్చిదిద్దడంలో భాగంగా ఒక కమాండ్ కంట్రోల్ వేదిక తయారు చేశారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించిన ఈ పరీక్షలు విజయవంతం కావడంతో ఈ వేదిక ద్వారా మన వ్యవస్థ చక్కగా పని చేస్తున్నాయని స్పష్టమైంది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ సందర్భంగా డిఆర్‌డిఓకు అభినందనలు తెలియజేశారు. భారత గగనతలంలోకి వివిధ ఎత్తుల్లో అనేక రకాల వేగంతో శత్రువుల విధ్వంసకర ఆయుధాలు ప్రవేశిస్తే క్షణాల్లో వాటిని ధ్వంసం చేసేందుకు వీలుగా డిఆర్‌డిఓ నిర్మించిన బహుముఖ వలయ గగనతల రక్షణ ఆయుధ ప్రయోగ వ్యవస్థ (ఐఎడిడబ్ల్యుఎస్) పనితీరును పరీక్షించారు. ఆధునిక యుద్ధరీతులవల్ల ప్రాంతీయ భద్రతకు సవాళ్ళు ఎదురవుతున్న తరుణంలో భారత సైనిక సామర్థ్యాన్ని మరింత పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత వచ్చింది. ఈ పరిస్థితులలో శత్రువు ఆయుధాలు మన గగనతలంలోకి ప్రవేశిస్తే సత్వరం స్పందించి భూతలం నుండి గగనతలంలోకి వాటిని ధ్వంసం చేయగల క్షిపణులు ప్రయోగించాలి. లేదా డ్రోన్లు వంటివాటిని పనిచేయకుండా తటస్థీకరించాలి. చాలా తక్కువదూరంలో ఉన్న ఆయుధాలను ధ్వంసం చేసేందుకు గగతలంలోకి దూసువెళ్ళే వ్యవస్థ (విఎస్‌హెచ్‌ఓఆర్‌ఎడిఎస్) క్షిపణులు, ఇతర హైపవర్ లేజర్ ఆధారిత ప్రత్యక్ష క్షిపణి ఆయుధా(డిఇడబ్ల్యు)లు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని ఈ పరీక్షల్లో నిర్ధారించారు. ఐఎడిడబ్ల్యుఎస్ అనేది గతనతలంలో బహుముఖ వలయాల రక్షణ వ్యవస్థ. వివిధ ఎత్తులలో శత్రువు ఆయుధాలు మన గగనతలంలోకి ప్రవేశిస్తే వాటిని క్షణాల్లో ధ్వంసం చేసేందుకు ఈ ఐఎడిడబ్ల్యుఎస్ క్షిపణి వ్యవస్థను ఏర్పాటు చేశారు. అదేవిధంగా డిఆర్‌డిఓ ఒక సమగ్ర కమాండ్ కంట్రోల్ అభివృద్ధి చేసింది. ఈ కమాండ్ కంట్రోల్ ద్వారా అన్నిరకాల ఆయుధాలను నియంత్రించేందుకు, ధ్వంసం చేసేందుకు, మన క్షిపణులు సహా వివిధ ఆయుధాలను ప్రయోగించి శత్రు ఆయుధాలను తుత్తునియలు చేసేందుకు ఒక ఏకీకృత నియంత్రణ వ్యవస్థగా ఈ కమాండ్ కంట్రోల్ కీలక విధులు నిర్వహిస్తుంది.


‘డిఆర్‌డిఓకు నా అభినందనలు, భారత సాయుధబలగాలు, ఆయుధ పరిశ్రమ ఎంతో విజయవంతంగా ఐఎడిడబ్ల్యుఎస్‌ను అభివృద్ధి చేసింది, ఈ సరికొత్త వ్యవస్థ భారత గగనతలానికి బహుముఖ వలయ రక్షణ సామర్థ్యాన్ని చేకూరుస్తుంది, ముఖ్యమైన మౌలిక సదుపాయాలున్న ప్రాంతాలకు ఇది రక్షణగా ఉంటుంది, శత్రువుల బెదిరింపులకు రక్షణగా ఉంటుంది’ అని సోషల్ మీడియా వేదికగా రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఒక ప్రకటన అప్‌లోడ్ చేశారు. దీనికి కమాండ్ కంట్రోల్‌ను డిఆర్‌డిఓ అభివృద్ధి చేసింది. గగనతల రక్షణ కార్యక్రమానికి ఇదొక నోడల్ లేబొరేటరీ. విఎస్‌హెచ్‌ఓఆర్‌ఎడిఎస్, డిఇడబ్ల్యు రెండింటినీ ఇమ్రాత్ రీసెర్చ్ సెంటర్, సెంటర్ ఫర్ హై ఎనర్జీ సిస్టమ్స్, సైన్సెస్ అభివృద్ధి చేశాయి.

### దేశ స్వయం సమృద్ధి అన్వేషణలో...

## ‘గగనయాన్’ సరికొత్త అధ్యాయం

### భవిష్యత్‌లో స్పేస్ మైనింగ్,విశ్వాంతరాళ శోధన

### వ్యోమగాముల అభినందన సభలో రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ:** భారతదేశం స్వయం సమృద్ధి (ఆత్మనిర్భర్ భారత్) సాధించేందుకు చేస్తున్న కృషిలో గగనయాన్ ఒక సరికొత్త అధ్యాయానికి చిహ్నంగా నిలుస్తుందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. రాబోయేకాలంలో అంతరిక్ష గ్రహాల్లో తవ్వకాలు, విశ్వాంతరాళ అన్వేషణ, అంతరిక్ష వనరుల సేకరణ వంటివన్నీ మానవ నాగరికతకు పునర్నిర్వచనం ఇస్తాయన్నారు. భారతదేశం ఎప్పుడూ ప్రపంచానికి ‘వసుధైక కుటుంబం’ అనే గొప్ప సందేశాన్ని ఇస్తోందన్నారు. భారత్ 2027లో చేపట్టే గగనయాన్ కోసం ఎంపికైన నలుగురు వ్యోమగాములను రాజ్‌నాథ్‌సింగ్ వజ్రాలుగా అభివర్ణించారు. భారత్ నుండి మొదటిసారి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి విజయవంతంగా వెళ్ళి వచ్చిన వ్యోమగామి శుభాంశు శుక్లాతోపాటు గగన్‌యాన్‌కు ఎంపికైన నలుగురు వ్యోమగాములను ఆదివారంనాడు న్యూఢిల్లీలోని సుబ్రొతో పార్కువద్ద ఎయిర్ ఫోర్స్ ఆడిటోరియంలో రాజ్‌నాథ్‌సింగ్ ఘనంగా సన్మానించారు. భారత వైమానిక దళం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆక్సియం మిషన్ విజయవంతమైన తర్వాత అందులో భాగస్తుడై భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన శుక్లా దేశానికి తిరిగి వచ్చిన తర్వాత మొదటిసారి ఈ అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, గ్రూప్ కెప్టెన్ అజిత్ క్రిష్ణన్, గ్రూప్ కెప్టెన్ అంగద్ ప్రతాప్, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా నలుగురినీ గగనయాన్ కోసం ఎంపిక చేశారు. 2024 ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్రమోదీ తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించినప్పుడు మొదటిసారి అధికారికంగా ఈ నలుగురి పేర్లనూ ప్రపంచానికి తెలియజేశారు. ‘రోదసీని కేవలం ఒక పరిశోధనా కేంద్రంగా మాత్రమే మనం చూడటం లేదు, ఆర్థిక, భద్రత, ఇంధన, మానవతా విభాగాల భవిష్యత్తుగా చూస్తున్నాం, మనదేశం క్రమంగా భూమిని దాటి అంతరిక్ష శోధనలో కొత్త సరిహద్దులకు విస్తరిస్తోంది, ఇప్పటికే చంద్రుడి నుండి అంగారక గ్రహం వరకూ మన ముద్రవేసుకున్నాం, ఈనాడు భారతదేశ గగనయాన్ వంటి సాహసకృత్యాలకు సిద్ధం అవుతోంది, ఈ విజయాలను కేవలం సాంకేతికపరమైన మైలురాళ్లుగా మాత్రమే చూడకూడదు, ప్రపంచంలో రోదసీ అన్వేషణలో అగ్రదేశాల సరసన భారత్ కూడా సమానంగా నిలబడుతోందని మనం గర్వంగా భావిస్తున్న సమయంలో స్వయంసమృద్ధి సాధన దిశగా భారతదేశం చేస్తున్న ప్రయాణంలో గగనయాన్‌ను ఒక నూతన అధ్యాయంగా చూడాలి. భారత రోదసీ కార్యక్రమం కేవలం ప్రయోగశాలలకు మాత్రమే పరిమితం కాదు, వాహకనౌకలకు మాత్రమే పరిమితం కాదు, మన ప్రపంచదృక్పథానికి ఒక ప్రతిబింబం’ అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. చంద్ర యాన్ దగ్గర నుండి మంగళయాన్ వరకూ పరిమితమైన వనరులతో భారతదేశం తన సత్తాను చాటుకుంది, అపరిమితమైన ఆత్మస్థైర్యాన్ని చాటి చెప్పింది, అత్యంత సవాళ్ళతో కూడిన లక్ష్యాను సాధించేందుకు మన సంకల్పశక్తిని అసాధారణమైన విజయాలుగా మార్చగలుగుతామన్నారు. కార్యక్రమంలో సిడిఎస్ (రక్షణ సిబ్బంది ప్రధానాధిపతి) జనరల్ అనిల్ చౌహాన్, ఐఎఎఫ్ ప్రధాన ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ తదితరులు పాల్గొన్నారు. శుభాంశు శుక్లా సతీమణి, ఆయన కుమారుడు, కుటుంబ సభ్యులు ఇతర గగనయాన్ వ్యోమగాముల కుటుంబీకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రాంతీయ పార్టీల్లో తిరుగుబాటు సృష్టించేందుకే..


### ఆ బిల్లులపై అఖిలేశ్ ధ్వజం

**లక్నో :** ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులను అనర్హులుగా ప్రకటించే చట్టాన్ని కేంద్రం తీసుకొచ్చిందని, ప్రతిపక్ష నాయకులను వేధించడం, ప్రాంతీయ పార్టీలపై ఒత్తిడి తీసుకురావడం, వారిలో తిరుగుబాట్లను ప్రేరేపించడమే లక్ష్యంగా పెట్టుకుందని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. తీవ్రమైన ఆరోపణలపై వరుసగా 30 రోజుల పాటు అరెస్టయిన ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులు లేదా మంత్రులను అనర్హులుగా ప్రకటించడానికి లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లులను ప్రస్తావిస్తూ... ఈ చర్య రాజకీయ ప్రేరేపితమని తెలిపారు. ఆదివారం ఇక్కడ పార్టీ ప్రధాన కార్యాలయంలో అఖిలేశ్ విలేకరులతో మాట్లాడుతూ ‘ఈ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టాలని, ప్రాంతీయ పార్టీలపై ఒత్తిడిని సష్టించాలని, వారిలో తిరుగుబాట్లను సిద్ధం చేయాలని కోరుకుంటోంది. ఎన్నికల సమయంలో వారు ఎలా దోపిడీకి పాల్పడి ఓట్లను దొంగిలించారనే దానిపై నిజమైన చర్చ నుంచి దష్టిని మళ్లించడానికి వారు ఉద్దేశపూర్వకంగా ఈ బిల్లును తీసుకువచ్చారు’అని విమర్శించారు.




# మానవ హక్కుల యుద్ధనౌక తస్లిమా

మత మౌఢ్యాన్ని నరనరాన జీర్ణించుకున్నవారికి, పురుషాధిక్యాన్ని ప్రదర్శించేవారికి తస్లిమా నస్రీన్ అంటే పడదు. మానవ హక్కులపై ఆమె గళమెత్తడం నచ్చదు. మహిళల అణచివేతకు వ్యతిరేకంగా నినదించడాన్ని, పురుషాధిక్యాన్ని ప్రశ్నించడాన్ని వారు సహించలేరు. అందుకే, ఆమె గళాన్ని నొక్కివేయడానికి ప్రయత్నిస్తునే ఉన్నారు. ఆమె కలానికి సంకెళ్లు వేయడానికి కుట్రలు పన్నుతునే ఉన్నారు. ఎన్ని బెదిరింపులు వచ్చినా... ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఆమె తన మాట మార్చలేదు. బాట వీడలేదు. తస్లిమా అంటేనే మత మూఢత్వపు కట్టడాలను కూల్చిన విప్లవ స్వరం. దక్షిణాసియా ఖండం మతపు గోడలతో, లింగ అసమానతలతో, పితృస్వామ్యపు పోకడలతో కునారిల్లిపోతున్నప్పుడు, ఆ గోడల్ని ఛిద్రం చేసేందుకు గళం విప్పిన ఏకైక మహిళా రచయిత తస్లిమా. ఆమె పదాలు వసంత గీతాలు కావు.. అవి సమాజపు గుండెలో దూసుకుపోయే వజ్రాయుధాలు. ఆమె భాష వర్ణాల సౌందర్యం కాదు.. అది తిరుగుబాటు గర్జన. ఆమె వ్యక్తిత్వం ఒక రచయిత్రి సరిహద్దులు దాటింది. ఆమె మానవ హక్కుల యుద్ధనౌకగా మారింది. 1962 ఆగస్టు 25న బంగ్లాదేశ్‌లోని మైమెన్సింగ్ జిల్లాలో జన్మించిన తస్లిమా చిన్ననాటి నుంచే మతపరమైన ఆచారాలు, స్త్రీలపై వేసే ఆంక్షలు, కులవివక్షలను నిరసించింది. ఆమె తండ్రి వైద్యుడు. అయినప్పటికీ, సంప్రదాయ విశ్వాసాలకు బద్ధుడు. తల్లి మతపరమైన ఆచారాల్లో మునిగితేలే గృహిణి. ఈ వాతావరణంలో పెరిగిన తస్లిమా, చుట్టూ ఉన్న అసమానతల గోడలను దగ్గర నుంచి గమనించింది. ఆమె కళ్ల ముందు చిన్న వయసులోనే జరిగిన హిందూ–ముస్లిం ఉద్రిక్తతలు, స్త్రీలపై మతాధిపత్యం, పేదరికపు గాయాలు వంటి ఘటనలు సజీవ చిత్రాల్లా నిలిచిపోయాయి. ఈ అనుభవాలే తస్లిమాలో తర్కశక్తికి బీజం వేశాయి. తండ్రి మాదిరిగానే తస్లిమా వైద్య విద్య పూర్తి చేసి డాక్టర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించింది. అయితే, తండ్రి మాదిరి మత విశ్వాసపు అడ్డుగోలను నిర్మించుకోలేదు. ఆమె ఆసుపత్రుల గదుల్లో కేవలం రోగాలను మాత్రమే కాదు, సమాజపు గాయాలను కూడా చూసింది. ప్రసూతి వార్డుల్లో బాల్య వివాహాల కారణంగా ప్రాణాలు కోల్పోతున్న చిన్నారి వధువులు... గర్భస్రావం కోసం బలవంతంగా ఆసుపత్రులకు వస్తున్న స్త్రీలు.. మతం పేరుతో వైద్య సహాయం నిరాకరించే కుటుంబాలు... ఇలా, ఆసుపత్రిలోనే ఆమె సమాజ స్వరూపాన్ని, మహిళల పట్ల జరుగుతున్న అన్యాయాలను చూసింది. అర్థం చేసుకుంది. వారిలో నెలకొన్న అమాయకత్వం.. అంతులేని భయం తస్లిమా మస్తిష్కంలో ఆలోచనల విస్ఫోటనానికి కారణమయ్యాయి. అక్కడి దృశ్యాలు ఆమె కలంలో విప్లవాగ్ని రగిలించాయి. అందుకే ఆమె డాక్టర్ గౌను తీయగానే, కలాన్ని ఒక సామాజిక శస్త్రచికిత్సకు పరికరంగా మార్చుకుంది. తస్లిమా పేరు వినగానే ముం దుగా గుర్తుకొచ్చే నవల 'లజ్జ'. అది మత మూఢత్వంపై ఆమె చేసిన మెరుపుదాడి. 1993లో వెలువడిన ఈ నవల ఆమె జీవితాన్ని శాశ్వతంగా మార్చింది. ఈ పుస్తకం ఒక హిందూ కుటుంబం కథ. కానీ, లోతుగా పరిశీలిస్తే, అది మత హింసకి వ్యతిరేకంగా రాసిన అగ్నిగీతంగా దర్శనమిస్తుంది. 'మనుషుల మధ్య గోడలు మతం నిర్మిస్తుంది.. మతం తొలగిపోతే, మనుషులు మాత్రమే మిగిలిపోతారు' అంటూ, బంగ్లాదేశ్‌లోని పరిస్థితులను లోకానికి తెలియచెప్పింది. ఈ కారణంతోనే అక్కడి మత ఛాందసవాదులు 'లజ్జ' నవలపై నిప్పులు చెరిగారు. ఆ పుస్తకాన్ని నిషేధించారు. తస్లిమాపై ఫత్వాలు జారీ అయ్యాయి. ఆమెను హతమారిస్తే భారీ నజరానాలు ప్రకటించారు. ఇంతలా ప్రాణాలకు ప్రమాదం పొంచివున్నా, తస్లిమా వెరవలేదు. వెనుకడుగు వేయలేదు. 'నా కలం మూగబోతే, మానవత్వం చచ్చిపోతుంది' అంటూ తన వైఖరిని తేల్చిచెప్పింది. ఫలితంగా ఆమె జీవితం ఒక డాక్టర్ వృత్తికో లేదా రచయిత్రిగా ప్రవృత్తితో పరిమితం కాకుండా, ప్రతిఘటనలకు వేదికగా మారింది. కలాన్ని వీడని ఆమె, సామాజిక రుగ్మతలపై, ప్రత్యేకించి మహిళల అణచివేతపై రణన్నినాదాన్ని పూరించింది. తన స్వీయ అనుభవాలతో రాసుకున్న ఆత్మకథల్లో ఎన్ని రక్తపు చారలో.. ఎన్ని కన్నీటి మరకలో.. ఎన్ని ఆవేశపు గర్జనలో! ఆమె అంధవిశ్వాసాలను వ్యతిరేకించింది. లింగ వివక్షను ఖండించింది. ఆమె రాసిన మరో పుస్తకం 'ద్విఖండిత' విడుదలైన మరుక్షణం నుంచే, పుస్తక ప్రదర్శన కేంద్రాల వద్ద ఆందోళలు మొదలయ్యాయి. 'నేను ఇస్లాం వ్యతిరేకిని కాను.. మతం పేరుతో జరుగుతున్న మనుషుల హత్యలకు వ్యతిరేకిని' అని తస్లిమా స్పష్టం చేసినా, అంధవిశ్వాసాల ఊబిలో కూరుకుపోయిన వారి చెవికి చేరలేదు. పురుషాధిక్యతను ప్రదర్శించేవారి తీరు మారలేదు. ప్రాణాలు తీయాలన్న ఫత్వా విడుదలైన తర్వాత, గత్యంతరం లేని పరిస్థితుల్లో దేశాన్ని విడిచిపెట్టాల్సి వచ్చిన తస్లిమా, బహిష్కరణలో గడిపిన రోజులను గుర్తుచేసుకుంటూ, హృదయావేదనతో రాసిన పుస్తకం 'నిర్వాసన'. ఈ పుస్తకం చదివితే, స్వేచ్ఛ కోసం పోరాడే ప్రతి హృదయం కన్నీరు పెట్టుకుంటుందని ప్రముఖ సాహితీ విమర్శకుడు సునీల్ గంగోపాధ్యాయ వ్యాఖ్యానించారు. స్త్రీ స్వేచ్ఛ అనేది తస్లిమాకు కేవలం సాహిత్య అంశం కాదు.. అది ఆమె జీవన ధర్మం. మహిళల శరీరం, మనసులపై మతం, కుటుంబం, సమాజం వేసిన అధికార తాళాలను ఆమె విరిచేసింది. కలంతో ప్రకంపనలు సృష్టించింది. సామాజిక అకృత్యాలకు వ్యతిరేకంగా సునామీ సృష్టించింది. పురుషాధిక్యానికి ఆమె సవాళ్లు విసిరింది. సాహిత్యం మాధ్యమంగా తిరుగుబాటు బావుటా ఎగురవేసింది. ఆమె వాక్యాలు స్త్రీ స్వేచ్ఛను కోరే శంఖనాదాలుగా వినిపిస్తాయి. 'స్త్రీ శరీరం దేవాలయం కాదు.. అది ఆమెకు మాత్రమే చెందిన విశ్వం' అనే సిద్ధాంతాన్ని తస్లిమా నమ్మింది. అణచివేతకు గురవుతున్న ప్రతి మహిళకూ ఇదే సూత్రాన్ని ఉద్బోధించింది. ఒక మహిళ ఈ రకంగా తిరుగుబాటు చేయడం మత పెద్దలకు నచ్చలేదు. పాలకులకు మింగుడుపడలేదు. ఫలితంగా, 1994లో బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆమెపై కేసులు నమోదు చేసింది. ఆమెను స్వదేశం విడిచి వెళ్ళమని నోటీసులు జారీ అయ్యాయి. ఫలితంగా ఆమె బంగ్లాదేశ్‌ను విడిచిపెట్టింది. భారత్‌కు వచ్చి కోల్‌కతా, ఢిల్లీ, హైదరాబాద్ నగరాల్లో కొద్దికాలం ఉంది. స్వీడన్, అమెరికా, ఫ్రాన్స్ తదితర దేశాలకు వెళ్లింది. మళ్లీ భారత్ వచ్చింది. ఇక్కడ నివసించేందుకు ఆమె అనుమతి పొందింది. తస్లిమా ఎక్కడ ఉన్నా.. ఆమె నోరు నొక్కేయడానికి ప్రయత్నాలు జరిగాయి. ఇప్పటికీ జరుగుతునే ఉన్నాయి. కానీ, ఆమె కలం ఆగలేదు. 'నాకు నేల లేకపోవచ్చు.. కానీ నాకు స్వరం ఉంది' అంటూ, అంతులేని ఆత్మవిశ్వాసంతో ఎలుగెత్తి చాటుతున్నది. 'తస్లిమా పదాలు సాహిత్యం మాత్రమే కాదు.. అవి మానవ హక్కుల తుపాకీ గుళ్లు' అంటాడు ప్రముఖ విమర్శకుడు, ఆర్థిక శాస్త్ర నిపుణుడు, నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్. ఆయన మాటలు అక్షర సత్యాలు. 'మనిషి స్వేచ్ఛకు మతం అడ్డుగా వస్తే, ఆ మతాన్ని ప్రశ్నించడం పాపం కాదు.. ధర్మం' అని నినదిస్తున్న తస్లిమాను మత వాదులు వ్యతిరేకిస్తే, సమానత్వం కోసం పోరాడుతున్న యోధురాలిగా కొందరు అభివర్ణిస్తున్నారు. ఆమె భాష విప్లవాత్మకంగా ఉందని, సమాజాన్ని మరింత ఉద్రిక్తతలకు గురి చేయడమే ఉద్దేశంగా కనిపిస్తున్నదని మరికొందరి అభిప్రాయం. ఎవరు ఏమనుకున్నా తస్లిమా తన పోరాటాన్ని కొనసాగిస్తునే ఉంది. 'మౌనమే అజ్ఞానానికి మూలం' అంటూ, అణచివేతలకు వ్యతిరేకంగా గళం వినిపిస్తునే ఉంది. ఆమె ప్రతి అక్షరం సుడిగాలిలా శరవేగంగా






కదులుతునే ఉంది. ప్రతి పదం, మతం పేరుతో దోపిడీ చేస్తున్న వారి పాలిట ఆయుధంగా మారుతున్నది. ఆమె రాసే ప్రతి పుస్తకం ఓ అగ్నికణం. 'ఆమె వాక్యాలు నదుల్లా ప్రవహించవు.. అగ్నిపర్వాతాల్లా విస్ఫోటనం చెందుతాయి. ఆమె సాహిత్య విప్లవకారిణి' అంటాడు సాహిత్యకారుడు హుమాయున్ అహ్మద్. ఇది ముమ్మాటికీ నిజం. ఆమే ఒక మానవ హక్కుల ఉద్యమం, స్త్రీ స్వేచ్ఛా శంఖానాదం. మతదురాచారాలపై పేలిన అగ్నిపర్వతం. 'పుస్తకాల కంటే స్వేచ్ఛ పవిత్రం' అంటున్న తస్లిమా, 'మతాలకంటే మానవత్వం శాశ్వతం' అనే వాదనను బలంగా వినిపిస్తున్నది. మన సమాజంలో, మతపు గోడలు, కులపు బంధనాలు, స్త్రీ శరీరంపై పితృస్వామ్యపు తాళాలు అనే మూడు ప్రధాన రుగ్మతలు శతాబ్దాలుగా మానవత్వాన్ని శ్వాస తీసుకోనివ్వని సంకెళ్లు. వాటిని సమూలంగా తుడిచివేయడానికి కలం పట్టిన ఉద్యమకారిణి తస్లిమా. లోతుగా పాతుకుపోయిన మూఢ నమ్మకాలపై ఆమె రచనలు పిడుగుల్లా విరుచుకుపడతాయి. చీకట్లను ముంచే ప్రళయకాల ఝుంఝూమారుతంలా పెకళించివేస్తాయి. ప్రజా గర్జన ఆమె. ప్రతిఘటనకు ప్రతీక ఆమె. స్వేచ్ఛకు సంకేతం ఆమె. అరాచక విశ్వాసాల పంజరంలో తాళం వేసి కూర్చోని పిట్ట కాదు తస్లిమా... స్వేచ్ఛపై పరితపిస్తూ, వినువీధుల్లో విహరించే విహంగం. మతపరమైన హింసను నిర్మొహమాటంగా ఖండించే చండిక. అన్యాయాలపై కత్తిపట్టే వీరవనిత. అందుకే, 'నన్ను భయపెట్టలేరు. భయమే నా శత్రువు కాదు. అజ్ఞానమే, అసహనమే, మూఢత్వమే నా అసలు శత్రువులు' అని గొంతెత్తి చాటుతున్నది. కలాన్ని ఆయుధంలా మార్చి సవాళ్లు విసురుతున్నది. తస్లిమా సాహిత్యం కేవలం మతపరమైన అంధత్వంపైనే కాదు, స్త్రీలపై జరిగే అణచివేతపైన కూడా నిలదీస్తుంది. స్త్రీ శరీరంని సాంప్రదాయం పేరుతో బంధించడాన్ని తస్లిమా తిరస్కరించింది. స్త్రీ హక్కుల కోసం పోరాడటం కేవలం వ్యక్తిగత విషయం కాదు, మానవ హక్కుల యుద్ధమని ప్రకటించింది. స్త్రీ శరీరం మీద ఎవరికీ హక్కు భుక్తం కాదని, స్త్రీ స్వేచ్ఛ అనేది ఆమెలోని దైవత్వమని తన ప్రతి రచనలోనూ ప్రకటిస్తునే ఉంది. ఆమె రచనలు 40కి పైగా భాషల్లోకి అనువాదమయ్యాయంటే, వాటి స్థాయి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా స్త్రీ విముక్తి ఉద్యమాలలో, మతస్వేచ్ఛ పోరాటాలలో ఆమె పేరు ఒక ప్రతీకగా మారింది. అణచివేతలలో జీవించే వారికి ధైర్యమిచ్చే వెలుగైంది. ఆమె కలం ఒక అగ్ని పుంజం. ఆమె స్వరం ఒక జ్వాలా తోరణం. మహిళల స్వేచ్ఛ కోసం.. తరతరాల బానిసత్వం నుంచి వారి విముక్తి కోసం.. పురుషాధిక్యత నుంచి వారిని కాపాడడం కోసం తస్లిమా చేస్తున్న కృషి ప్రశంసనీయం. మతానికి వ్యతిరేకిని కానని, అయితే, మతం పేరుతో జరిగే దోపిడీని, అణచివేతను, అక్రమాలను క్షమించలేనని స్పష్టం చేస్తున్న తస్లిమా కలం నుంచి మరెన్నో కాలాతీత రచనలు వెలువడతాయని ఆశిద్దాం.


> 'నేను ముందుకు వెళ్ళబోతున్నాను
> నా వెనుక నా కుటుంబం మొత్తం
> పిలుస్తుంది
> నా బిడ్డ నా చీర కొంగు లాగుతోంది
> నా భర్త తలుపుకి అడ్డంగా నిలబడి
> వున్నాడు
> అయినా నేను వెళ్తాను
> ఎదురుగా నది తప్ప మరేం లేదు'
> (బార్డర్స్/ 'సరిహద్దులు' కవిత
> నుంచి)

> 'చాట కింద ఐదు వేళ్ళతో తడుతూ
> రెండు వేళ్ళతో బియ్యం నుండి
> రాళ్ళు తీస్తూ
> వాళ్ళు తమ సగం జీవితాలు
> గడిపేస్తారు
> వాళ్ళ జీవితాంతం
> ఆ రాళ్ళు వాళ్ళ హృదయాల్లో
> చేరుకుంటుంటాయి.
> ఎవరూ కూడా
> రెండు వేళ్ళతో కూడా
> ఆ రాళ్ళను తాకరు'
> (అనదర్ లైఫ్/ 'మరో జీవితం'
> కవిత నుంచి)

– సత్యశ్రీ

## చదవాల్సిన పుస్తకం

# సురవరం సుధాకర రెడ్డి వ్యాసాలు.. లేఖలు






భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శ్రేణులకు మార్గదర్శకుడిగా, ప్రజా ఉద్యమాల నిర్మాణ వ్యూహకర్తగా, పార్లమెంటేరియన్‌గా అందరికీ తెలిసిన కామ్రేడ్ సురవరం సుధాకర రెడ్డి ఓ గొప్ప విశ్లేషకుడు, రచయిత కూడా. ఎన్నో పత్రికల్లో ఆయన వ్యాసాలు, బహిరంగ లేఖలు ప్రచురితమయ్యాయి. వాటిలో కొన్నింటిని సేకరించి, ప్రచురించిన పుస్తకమే 'సురవరం సుధాకర రెడ్డి వ్యాసాలు.. లేఖలు'. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ ప్రచురించిన ఈ పుస్తకంలో పలు అంశాలపై సురవరం వ్యక్తం చేసిన అభిప్రాయాలతోపాటు, పార్టీ విధానాలు కూడా విస్పష్టంగా ఉన్నాయి. పాఠకులను ఆలోచింప చేస్తాయి. ప్రధానికి వంట గ్యాస్ ధరల పెంపు, భారత తపాలా కార్యాలయాల ద్వారా బంగారు నాణాల అమ్మకం, కన్హయ్య కుమార్ అరెస్టు, బస్తర్ సమస్యల, నోట్ల రద్దు, సేలం ఉక్కు ఫ్యాక్టరీ అమ్మకం, ఎస్‌సిల వర్గీకరణ వంటి అంశాలపై రాసిన లేఖలు ఈ పుస్తకంలో ఉన్నాయి. సమకాలీన సమస్యలపై స్పందించే ఆయన నైజాన్ని, లోతైన అధ్యయనాన్ని, ప్రజలతో ఉన్న సంబంధాన్ని వ్యక్తపరుస్తాయి. నిత్యం ప్రజల్లో ఉండే మనిషి కాబట్టి, ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యా ఆయనకు తెలుసు. వాటిపై అనర్గళ ఉపన్యాసాలతో ఉద్యమ స్ఫూర్తిని రగిలించడంతోపాటు, వ్యాసాలు, లేఖల రూపంలో లక్షలాది మందిని చైతన్యవంతులను చేశారు. ఈ విషయం ఆయన వ్యాసాల సంకలనాన్ని చదివితే స్పష్టమవుతుంది. పలువురు కమ్యూనిస్టు నాయకులను ఆయన పాఠకులకు పరిచయం చేశారు. ఆహార భద్రత నుంచి బాల నేరస్థుల గృహాల్లో లైంగిక వేధింపుల వరకు, కేంద్రం తీసుకొచ్చిన వివాదాస్పద వ్యవసాయ బిల్లుల నుంచి కుట్రపూరిత హత్యల వరకు ఎన్నో అంశాలను ప్రస్తావిస్తూ, లోతైన విశ్లేషణలతో సమగ్ర స్వరూపాన్ని ఆవిష్కృతం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్'లో అసత్యాలు, అర్ధసత్యాలు మాత్రమే ఉన్నాయని పేర్కొంటూ, 'నోటి మాటేనా' అని ఒక వ్యాసంలో నిలదీశారు. మనుస్మృతి భారత రాజ్యాంగానికి ఏ విధంగా వ్యతిరేకంగా ఉందో మరో వ్యాసంలో వివరించారు. మైనారిటీలపై పెరుగుతున్న అసహనాన్ని మరో చోట ప్రస్తావించారు. వ్యవసాయ సంక్షోభం గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిన వైనాన్ని వివరించారు. పైపై పూతలాంటి మార్పుల వల్ల ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ అసాధ్యమని తేల్చిచెప్పారు. వియత్నాం, చైనా వంటి దేశాల్లో తన పర్యటన అనుభవాలను పంచుకున్నారు. అక్కడ కమ్యూనిస్టు పార్టీ తెచ్చిన అభివృద్ధిని కళ్లకు కట్టారు. రాజ్యాంగాన్ని పరిరక్షించడం తక్షణావసరమని హితవు పలికారు. నిత్యం సామాన్యుల వాణిని వినిపించారు. వామపక్ష బాణిని సమకూర్చారు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ పుస్తకంలోని ప్రతి వ్యాసం లేదా లేఖ 'ప్రజాపక్షం'గా దర్శనమిస్తుంది. ప్రజా సమస్యలపై బాధితుల గళమై పాలక వర్గాన్ని ప్రశ్నిస్తుంది... నిలదీస్తుంది.. ప్రతిఘటన పోరాటాల నిర్మాణానికి బాటలు వేస్తున్నది. సురవరం సుధాకర రెడ్డి భౌతికంగా మన మధ్యలేకపోయినా, ఆయన ఆశలు... ఆశయాలు ఈ వ్యాసాల మాధ్యమంగా పలకరిస్తునే ఉంటాయి. మార్గదర్శకం చేస్తునే ఉంటాయి.

**ప్రతులకు**

**నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).**

# సమాజానికి దిక్సూచి రాజకీయ సాహిత్యం

క్రమంగా విస్తరిస్తున్న రాజకీయ సాహిత్యం సమాజానికి దిక్సూచిలా మారుతున్నది. వివిధ రాజకీయ సంఘటనలు, భావాలు, సంఘరాలపై సాహిత్య రూపంలో వ్యక్తమయ్యే రచనల ఒక శ్రేణిని రాజకీయ సాహిత్యంగా పేర్కోవచ్చు. ఇది ప్రజలను రాజకీయ చైతన్యం కలిగించడంతోపాటు సమాజంలో మార్పులకు దారితీస్తుంది. రాజనీతిలో జరిగే సంఘటనలు, ఉదాహరణకు పోరాటాలు, రాజకీయ పదవులు, ప్రభుత్వ విధానాలు సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి. వీటిని రచయితలు వివిధ రచనల్లో విమర్శనా, స్ఫూర్తిదాయక రూపాల్లో ప్రదర్శిస్తారు. రాజకీయ భావాలు, ఆశలను, నిరసనలు సాహిత్య రూపంలో వ్యక్తం చేస్తారు. కవితలు, కథలు, నాటకాలు వాడి రాజకీయ వర్గాల దృష్టిని ప్రజలముందుకు తెస్తారు. సాహిత్యం ద్వారా ప్రజాస్వామ్య చైతన్యం మరో ప్రధాన లక్షణం. రాజకీయ సాహిత్యం ప్రజలకు రాజనీతిని అర్థం చేసుకునేందుకు, వాటిపై చింతన చేయడానికి, సమాజ సేవార్థంగా వ్యవహరించకు సహకరిస్తుంది. ఇది ప్రజలలో రాజకీయ అవగాహన పెంచుతుంది. రాజకీయ సాహిత్యం సామాజిక వ్యవస్థలో పేదరికం, అసమానతకు వ్యతిరేకంగా పోరాటానికి ప్రేరణ ఇస్తుంది, హక్కుల పట్ల ప్రజలకూ, పాలకులకు కూడా జాగ్రత్త తీసుకొస్తుంది. రాజకీయ సాహిత్యానికి, సాహిత్య రాజకీయానికి మధ్య భేదం గుర్తించి, ప్రసిద్ధి కోసం లేదా హాట్ పుట్టే వ్యాజ్యం కోసం చేసే ప్రవర్తనలను విమర్శనే ఈ సాహిత్యానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. వివిధ సమయాలలో రాజకీయ సాహిత్యం చరిత్రలో జరిగిన సంఘర్షణలు, విధానాల్ని, సామాజిక ఆలోచనలను ప్రతిబింబిస్తుంది, కేవలం ఆకర్షణ, వినోదం కాదని, అది ప్రజల హక్కుల కోసం ఒక బలమైన యుద్ధంగా నిలబడుతుంది. ఆధునిక రాజకీయ సాహిత్యం: సమకాలీన రాజకీయ పరిణామాలపై వ్యాసాలు, కథలు, కవిత్వం ప్రజల దృష్టిని మార్చడానికి, రాజకీయ మార్పును సూచిస్తుంది. సమాజంలో నిరసనలు, ఉద్యమాల కంటే ఈ సాహిత్యం సాధారణ ప్రజలకి చేరే వేదికగా నిలుస్తుంది. మొత్తం మీద, రాజకీయ సాహిత్యం రాజకీయ సంఘటనలను, భావాలను, సంఘరాలను సాహిత్య రూపంలో ప్రబలంగా ప్రతిబింబించి సమాజంలో ప్రజాస్వామ్య, న్యాయం, సమానత్వం వంటి విలువలకు మార్పులు తీసుకువస్తుంది. దీని ద్వారా సాహిత్యం ఒక సామాజిక, రాజకీయ మార్పు సాధనంగా పని చేస్తుంది.

## స్మృతిగీతం

మృదువైన స్వభావమున్న కమ్యూనిస్టు యోధుడా!
ఆత్మీయత ప్రతిరూపం ఓ అమృత హృదయుడా!
నిండు జీవితం గడిపిన
ఎర్రసేన నాయకుడా!
ఎర్రెర్రని వందనాలు
అందుకో లాల్ సలాం ! ॥మృదు॥

చెదిరిపోని చిరునవ్వు మీ మోమున కాభరణం
ప్రేమపూర్వ పలకరింత మిత్రత్వపు పులకరింత
పాతతరం కమ్యూనిస్టు వారసత్వ సారథి
నేటితరం నాయకులకు నికార్సయిన వారధి ॥మృదు॥

విద్యార్థుల ఉద్యమాల మీ సమగ్ర నేతృత్వం
విజయాలను సాధించిన అసామాన్య సామర్థ్యం
ఎన్నెన్నో సమరాలను నడిపిన మీ అనుభవం
తెలుగునాట రాజసంగ ఎగిరిన జయకేతనం ॥మృదు॥

నిరంతర అధ్యయనం నిర్విరామ సాధనం
సిద్ధాంతం ఆచరణల తిరుగులేని సమన్వయం
లక్షలాది ప్రజలను ఉర్రూతలూపిన వక్తృత్వం
లక్ష్యం సాధించే దిశగా నిబద్ధకార్యకర్తృత్వం ॥మృదు॥

జాతీయస్థాయిలోన వెలిగిన తెలుగుతేజం
వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమ ప్రవాహం
పార్లమెంట్లో మార్మోగిన ప్రజాగ్రహగళం
జనచేతన విరబూసిన ఉద్యమాలదళం

మీ ఆశయ సాధనకై
శ్రమిస్తాము మేము !
మీ ప్రేరణ కాగడాగ
గ్రహిస్తాము మేము !
ఎర్రెర్రని వందనాలు
అందుకో సురవరం !
మీ ఉద్యమ ప్రస్థానం
మాకు స్ఫూర్తిదాయకం !



ఎస్‌వి సత్యనారాయణ
పూర్వ ఉపకులపతి, పొ.శ్రీ. తెలుగు విశ్వవిద్యాలయం

## సామ్యవాద భావజాల స్వరం- సురవరం

ప్రశాంత వదనం ..
అజాత శత్రువుగా పేరుగాంచిన మంచితనం ..
అతనితో మాట్లాడితే... అదొక చారిత్రక అనుభవం
అతని ఉపన్యాసం వింటే ఎన్నో గ్రంథాలు చదివినంత ఆనందం
అతని రాజకీయ శిక్షణ తరగతి
స్వాతంత్ర్య భారత సంగ్రామం చూస్తున్న అనుభూతి
అతడు లోక్‌సభలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే తట్టుకోవడం ఎవరితరం ?
అతడే సామ్యవాద భావజాల స్వరం
యువతరానికి నవతరానికి వరం సురవరం
తరతరాలకు ఆదర్శం అతని సంకల్పం
రెడ్ సెల్యూట్ రెస్పెక్టెడ్ కామ్రేడ్ సుధాకర రెడ్డి
సెలవంటూ ఈ లోకం వదిలి మీరు వెళ్ళినందుకు అభిమానులు శోకంతో
'రెస్ట్ ఇన్ పీస్' అంటున్నారు గాని
అజరామరం అనితర సాధ్యం.

– డాక్టర్ ఎస్.సూర్యప్రకాష్
9849488498

## ఈ వారం కవితలు

### పిల్లలను ప్రేమించలేని..!

ఈ ప్రపంచం మనది కాదురా అయ్యా....!
సమాజ నిర్మాతల్ని బిచ్చగాళ్లను చేసిన
ప్రపంచం ఇది గదరా అయ్యా...!

కుల వృత్తులను కుళ్ళపొడిచి...
ఏ ఆసరాలు లేకుండా చేసిన
ఆధిపత్య అహంకార వ్యవస్థపై
కోపం కట్టలు తెగుతుంది...

దొంగ లంజాకొడుకు లెసలే మసలే ధూర్త
రాజ్యంలో అన్నోడు మహాకవీ అయ్యిండు...
ఆధిపత్య ఆంబోతుల అగ్రకుల దురహంకారం..
ఇంకెన్నాళ్లు అంటే నన్ను కులం వెంటాడింది
ఆగ్రహ ప్రకటనకూ అగ్రవర్ణమే కావాలా?

మాకు పాలించే లక్షణాలు లేవా?..
కావ్యాలు రాసే సత్తువ లేదా?.

వాల్మీకి వ్యాసుడు ఎవరు రా?..
ద్రౌపది ఒలువలుస్తుంటే మాట్లాడిన విదురుడు
ఎవరురా?..
బడుగులను గేలి చేసే సామెతలు చేసి...
బతుకులకు గోసాకు రంగులు పులిమి..
కాలమెంత దుర్మార్గంగా దూసుకుపోతూ ఉంటే
వీపులు కాయలు కాస్తుంటే..

రక్తం శరీర గట్టు తెగి ప్రవహిస్తుంది
గాయం నిప్పులా జ్వలిస్తుంది

నడిగడ్డ ఆంజనేయ..
కుళ్ళ పొడిచిన నీ దేహం
సాక్షిగా.. నువ్వే చెప్పు..
నీ గాయాల సాక్షిగా గొంతు
విప్పు..



బడుగు బిడ్డల గురుకులాన్ని..
ఆత్మహత్యల కేంద్రాన్ని చేసింద్రు..

బిడ్డల సావుల్ని చూసి..
చదువుల తల్లి ఎక్కెక్కి ఏడుస్తుంటే
ఐపీఎస్ చదువులు ఏం చేయాలి...
ఐఏఎస్‌లు ఏం చేయాలి..
కవుల కళాలు ఏం చేయాలి..
సృజన లోకం సోక్కుబడ్డదా..

కన్నీటి కథల్ని రాయలేని
మూగజీవాల గోసనూ చెప్పలేని
కావ్యాలేం కావ్యాలు.

ఇవి చెప్పలేని రవీంద్రభారతులు...
మృత సృజన సమ్మేళనాలే...

బడుగుల బిడ్డలు ఉరితాళ్ళకు వేలాడుతుంటే..
సృజనకారులు శాలువాలు కప్పుకుంటారా?..

కలుషిత ఆహారం... కల్తిత నీళ్లను ఇచ్చే
వాళ్లను.. నిలదీయలేని కలాలు కలాలేనా..

భావితరాల కలలను చెరిపేస్తుంటే పాలకుల్ని
నిగ్గదీయలేని రచనలు ఎందుకు...
జ్ఞానం గడ్డ కట్టిన సమాజానికి మనుగడ
లేదు...


చదువుల బిడ్డలు శవాలైతుంటే
పాలకుడు ఎవరైనా? ఎంతటి వారైనా
కవులు వెంటాడే కరవాలాలు కావాలి...
మా బిడ్డల్ని చంపే అధికారం నీకు ఎవరు
ఇచ్చారని అడిగే ప్రశ్నల కొడవళ్లు కావాలి

పువ్వులను, పిల్లలను పిల్లల నవ్వులను
ప్రేమించలేని ఈ రాజ్యాన్ని, రాజ్యాధికారాన్ని
ఉరికంబం ఎక్కించమని అడగండి.

– జూలూరు గౌరీ శంకర్

### ఎలా తప్పిపోతుంది..!!

నేలలో తెగి
మిగిలిపోయిన వేళ్ళు
ఏ ఒరిగిన అమరవీరుల్ని
గుర్తు చేసుకుంటున్నాయో !
ఎన్నెన్ని అంకురాలకు
ఆ నెత్తుటి వారసత్వాన్ని
జీవధాతువుగా
అందిస్తున్నాయో !
ప్రసవవేదనా పిడికిళ్ళు
మరో ఎర్రని పిడికిళ్ళను
పుట్టుకనిచ్చాయనే కదా
పేగు బంధాన్ని కొరివితో
తెగ్గోస్తున్నారు !
ముక్కలుముక్కలుగా
నరికి గాయాల్ని
విడగొడుతున్న
విద్రోహంతో పోరాటానికి
ఆ గాయాలన్నీ
ఒకే గుండెగా స్పందించక
తప్పదు !
ఎన్ని తెగిపోతున్న రక్తనాళాల్ని
అతికించేందుకు
ఎంత కన్నీటి లేపనం కావాలో !
చచ్చుబడిపోతున్న
ఎన్నీ జీవనాడుల్లో
ఎన్నెన్ని నెత్తురోడే కలాలతో




బతికించుకోవాలో !
వాతలు దేరిన కళ్ళు నోళ్ళు
తెరుస్తున్నాయందుకే !
నా చూపులు సూర్య ప్రవాహాల్ని
సారిస్తున్నాయి !
ఆకలికి, అన్నానికి మధ్య
ఉక్కు రెక్కల బంగారు గెద్దలు
పహారా కాస్తుంటే
భూగోళమంత చెమటచుక్క
నిప్పుకొండై పేలక తప్పదు !
మట్టి పొరల్ని చీల్చుకొచ్చే
పచ్చని మొలక
విత్తుకిచ్చిన మాట
ఎలా తప్పిపోతుంది ...?

– శోభా రమేష్
కాకతీయ విశ్వవిద్యాలయం
8978656327

## రోడ్డుపై గుంతలు ..వెళ్లేదేలా?

ప్రజాపక్షం/సారంగాపూర్ : బోథ్ నుంచి సారంగాపూర్ మండలంలోని అడెల్లి పోచమ్మ దేవాలయానికి వెళ్లే మొరం రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైంది.దీంతో రోడ్డుపై మోకాళ్ల లోతు వరకు గుంతలు ఏర్పడ్డాయని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు.ద్విచక్ర వాహనాలు వెళ్లాలంటేనే ఇబ్బందికరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.



## ఆకట్టుకున్న '5కె రన్'

ప్రజాపక్షం/ సంగారెడ్డి : జిల్లా యువజన క్రీడా శాఖ సంగారెడ్డి ఆధ్వర్యంలో నేషనల్ స్పోర్ట్స్ డే మేజర్ ధ్యాన్ చంద్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం 5కె రన్ నిర్వహించారు. ఈ యొక్క రన్‌లో 300 పైగా విద్యార్థులు, క్రీడాకారులు, స్పోర్ట్స్ అసోసియేషన్స్, టీఎన్‌జిఓ సెక్రటరీ, వ్యాయామ ఉపాధ్యాయులు ,కార్యాలయ సిబ్బంది పాల్గొని ఈ రన్‌ని విజయవంతం చేసినట్లు జిల్లా యువజన క్రీడా అధికారి ఎం,ఖాసీం బేగ్ తదితరులు తెలిపారు.



## మెక్‌గఫీ పాఠశాలకు రాష్ట్ర స్థాయి గౌరవం



ప్రజాపక్షం/కాగజ్‌నగర్ : రాష్ట్ర రాజధానిలో నిర్వహించిన ఎడ్యుటెక్స్‌ప్రో కార్యక్రమం నీయో సంభాషణ మందిరంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల నిర్వహణ సంఘం (టిఆర్ఎస్ఎంఎ)ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు మధుసూధన్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి అనేక ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. విద్యారంగలో విశిష్ట సేవలు అందించిన పాఠశాలలకు డా. సర్వేపల్లి రాధాకృష్ణ అవార్డులు ప్రధానం చేశారు. ఈ అవార్డుకు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన మెక్‌గఫీ పాఠశాల ఎంపిక కావడం విశేషంగా నిలిచింది. పాఠశాల ప్రతినిధిగా మహ్మద్ తాజుద్దీన్ అవార్డును స్వీకరించారు. పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో అభ్యాసాన్ని అభివృద్ధి చేయడంలో మెక్‌గఫీ పాఠశాల చూపుతున్న నిబద్ధతకు గుర్తింపుగా ఈ అవార్డు లభించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

## మహోన్నత వ్యక్తి సురవరం



ప్రజాపక్షం/నస్పూర్: సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి పలువురు నేతలు నివాళులర్పించారు. ఆదివారం హైదరాబాద్ మగ్దూం భవన్‌లో ఆయన పార్థివదేహాన్ని సందర్శించిన నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సుధాకర్ రెడ్డి తదితరులు ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. సుధాకర్ రెడ్డి మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## సురవరం అంత్యక్రియల్లో ఎమ్మెల్యే



ప్రజాపక్షం/నిజాంసాగర్: జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఆదివారం సీపీఐ అగ్ర నాయకులు, నల్గొండ మాజీ ఎంపీ కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. హైదరాబాద్ మగ్దూమ్‌భవన్‌లో ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేశారు. సురవరం విద్యార్థి దశ నుండే పేదల కష్టాల పట్ల శ్రామిక వర్గాల పట్ల తన అంకిత భావాన్ని చూపుతూ ప్రజా ఉద్యమాల్లో క్రియాశీలంగా పాల్గొన్నారని కొనియాడారు. ఆయన ఆలోచనలు, విలువలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## సంఘ భవన నిర్మాణానికి నిధులివ్వండి



ప్రజాపక్షం/ముథోల్ (బాసర) : అన్నాభావు సాటె సంఘ భవన నిర్మాణానికి నిధులమంజూరుకు కృషి చేయాలని టాక్లి గ్రామస్తులు ఆదివారం ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ప్రభుత్వం అన్ని సంఘాల ప్రాధాన్యతనిస్తున్న తరుణంలో తమకు సైతం చేయూతనందించాలని తెలిపారు.దీనికి గాను సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే జిల్లా ఇంచార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా నిధులు మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేష్,సంఘం అధ్యక్షుడు గంగాధర్,ఉపాధ్యక్షుడు శేషారావు,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పరామర్శ



ప్రజాపక్షం/శివ్వంపేట : అధికారుల పర్యవేక్షణ లేక రత్నాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం భోజనం అనంతరం ఎలుక పడిన నీటిని తాగడంతో పిల్లలు అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆదివారం నర్సాపూర్ పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించి వారి తల్లిదండ్రులతో, వైద్యులతో మాట్లాడారు.మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, నాయకులు శివకుమార్, వేమారెడ్డి, మోహన్‌రెడ్డి, బొగ్గుల యాదగిరి తదితరులు ఉన్నారు.

## ర్యాగింగ్‌కు పాల్పడొద్దు

ప్రజాపక్షం/నిజామాబాద్ : మెడికల్ విద్యార్థిపై ర్యాగింగ్ ఘటనను సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజా పంథా) నగర కార్యదర్శి ఎం.సుధాకర్ ఖండించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్‌నాల్గవ సంవత్సరం చదువుతున్న రాహుల్ అనే మెడికోపై పీజీ మెడిసిన్ చేస్తున్న సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేసి భౌతికదాడికి పాల్పడటాన్ని ఖండిస్తున్నామన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన సీనియర్లపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం శిక్షించాలని వైద్య, పోలీసు అధికారులను డిమాండ్ చేశారు. గౌరవప్రదమైన వైద్య వృత్తిలో సీనియర్ రెసిడెంట్లుగా ఉండి ఇలాంటి అమానుష చర్యలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. వీళ్లు డాక్టర్లుగా సమాజానికి ఏ విధంగా ఉపయోగపడుతారని ప్రశ్నించారు. ఇలాంటి విద్యార్థులతో వైద్య వృత్తికే కళంకమన్నారు. ప్రభుత్వ మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలల్లో ర్యాగింగ్ ఇంకా కొనసాగుతుందని ఆరోపించారు. అన్ని ప్రైవేట్ ప్రభుత్వ విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిరోధక కమిటీలను పునరుద్ధరించాలని, ర్యాగింగ్‌కు పాల్పడ్డ వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను డిమాండ్ చేశారు.

# కెజిబివిల్లో నాణ్యమైన విద్యాబోధన

### మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజాపక్షం/మెదక్ : కెజిబివిల ద్వారా నాణ్యమైన విద్య అందించడానికి చర్యలు తీసుకుంటునట్లు, సీజనల్ వ్యాధులపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం మెదక్ జిల్లా శంకరంపేట మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాఫ్ హాజరు రిజిస్టర్, ఎయన్ సి రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ డి డి వివరాలు, ఇప్పటి వరకు ఈ నెలలో ఎన్ని ప్రసవాలు జరిగాయని డాక్టర్ ను అడిగారు. ఈడిడి క్యాలెండర్ ను పీహెచ్‌సీలో అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలని, ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవాలు అయ్యే విధంగా చూడాలని అన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రజలకు సోకకుండా వ్యక్తిగత శారీరక పరిసరాల పరిశుభ్రత పై ప్రజల దృష్టి సారించేలా చూడాలన్నారు.మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ స్టోర్‌రూమ్, వంటగది, డైనింగ్‌హాల్‌ను పరిశీలించిన విద్యార్థినులకు అందుతున్న మెనూ వంటలను రుచి చూసి రుచి సుచితో కలిగిన పరిశుభ్రమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు.కలెక్టర్ తరగతి గదులలో విద్యార్థినిల విద్యా సామర్థ్యాలను ప్రశ్నలు జవాబులు రూపంలో అడిగి తెలుసుకునే సంస్కృతి బాగుందని హర్షం వ్యక్తం చేశారు. కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యుత్, తాగునీరు, బాత్రూం వంటి సదుపాయాలు సక్రమంగా వినియోగంలో ఉన్నాయా అనే అంశాన్ని స్వయంగా పరిశీలించారు. విద్యార్థినిలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ప్రతి రోజు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు గల ఆహారం, శుద్ధమైన త్రాగు నీటిని అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ కేజీబీవీల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలని సూచించారు.

## సమాజాభివృద్ధి గురువులతోనే సాధ్యం

### ప్రొఫెసర్ కోదండరాం



ప్రజాపక్షం/గజ్వేల్: సమాజాభివృద్ధి ఉపాధ్యాయులతోనే సాధ్యపడుతుందని ప్రొఫసర్ కోదండరాం పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞగార్డెన్లో ఉపాధ్యాయుడు పంబాల ఎల్లయ్య పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రొఫసర్ కాసిం, విమలక్క, డాక్టర్ అనితతో కలిసి ఆయన మాట్లాడారు. సమాజంలో గురువు స్థానం ఉన్నతమైనది కాగా, బాధ్యతతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కోరారు. అదే విధంగా ప్రభుత్వాలు కూడా బాధ్యతగా పాఠశాల విద్య బలోపేతానికి నిధులను సమకూర్చాలని స్పష్టం చేశారు. టిపిటిఎఫ్ కార్యకర్తలు ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని కోరారు. ప్రొఫసర్ ఖాసిం మాట్లాడుతూ సమాజం విలువలతో కూడిన విద్యను అందించే ప్రతి గురువుకు సముచిత స్థానం దక్కుతుందని, సమాజంలోని అన్ని వర్గాలను చైతన్యం చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలను సర్కార్ నిర్లక్ష్యం చేయకుండా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాఠ్యాంశాలను తయారు చేసే సంస్థలు నాణ్యమైన విద్యను అందించే విధంగా పాఠ్యాంశాలను రూపొందించాలని, సీబీఎస్సీ, ఐసిఎస్సి పాఠ్యాంశాల మాదిరిగా తెలంగాణ పాఠ్యాంశాలు కూడా పకడ్బందీగా ఉండాలని ఆకాంక్షించారు.టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నబోయిన తిరుపతి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి దామెర రాజయ్య, ఫడరేషన్ పూర్వాధ్యక్షులు రాంచంద్రం, జిల్లా ఉపాధ్యక్షులు పాపిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, మహిళా కార్యదర్శి మంజుల పాల్గొన్నారు.

## పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి

ప్రజాపక్షం/జన్నారం : బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం కోసం కృషిచేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధన కోసం కృషిచేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కోరారు. ఆదివారం జన్నారం మండలంలోని కవ్వాల్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిలో పాల్గొని ప్రసంగించారు. ఏజెన్సీ గ్రామమైన కవ్వాల్‌లో గౌడ కుస్తులు ఎదుర్కొంపటున్న సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కవ్వాల్‌లో వాగు నుండి వచ్చే మత్తడి కాలువకు రానున్న వేసవిలో శాశ్వత మరమ్మతులు చేపడతామని తెలిపారు. కవ్వాల్ గౌడ్ సంఘం అధ్యక్షులు కాసారపు పోచాగౌడ్; ఉపాధ్యక్షులుమేరుగు బాలగౌడ్,మండల గౌడ సంఘం అధ్యక్షులు మూల భాస్కర్‌గౌడ్ ఉన్నారు.

## 'మత్స్య' సహకార సంఘానికే శఠగోపం.. సంఘం నేతలు స్వాహా?

### కొమ్ము కాస్తున్న అధికార గణం


### సర్వత్రా ఆరోపణల వెల్లువ

ప్రజాపక్షం/చెన్నూరు : సొసైటి పేరున అరవై రెండు మంది మత్స్య సహకార సంఘ సభ్యులకు శఠగోపం పెట్టి, సొసైటి భూములను అనుభవిస్తూ చెన్నూరులో నేడు సంఘ కీలక నేతలు కోట్లకు పడగలెత్తారు. గంగాపుత్రుల అభివృద్ధి కోసం గోదావరి పరివాహక ప్రాంతంలో గత ప్రభుత్వాలు కేటాయించిన 38 ఎకరాల భూములను పట్టణానికి చెందిన ఇరువురు కీలక నేతలు చేజిక్కించుకొని, సంఘంలోని 62 మందికి మొండిచేయి చూపి రైతుబంధుతో పాటు బాయంకు రుణాలు పొంది కోట్లాది రూపాయలు దోచుకుంటుండగా, లక్షలాది రూపాయల వాటాలు రావాల్సి ఉన్నప్పటికి ఇవేవీ తెలియని సంఘంలోని సభ్యులు పొట్టకూటి కోసం వలస బాట పడుతున్నారు. తప్పని చెప్పాల్సిన సంబంధిత అధికారులు సైతం సంఘ నేతలకు వత్తాసు పలుకుతూ మామూలుగానే తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నాడు సాధారణ జీవితాలతో మొదలైన మత్స్యసహకార సంఘ నేతలు సబ్సీడి ద్వారా వస్తున్న చేపల పెంపకంతో మొదలుకొని సొసైటి భూములను ఇసుక క్వారీలకు లీజుకు ఇస్తూ అధికారులను, రాజీయ నేతలను శాసించే స్థాయికి ఎదిగారనడంలో అతిశయోక్తి లేదు. ఇటీవల గోదావరి పరివాహక ప్రాంతంలోని భూములను ఓ ఇసుక క్వారీ నిర్వాహకుడికి లీజుకు ఇవ్వడంతో వ్యవహారం బట్టబయలైంది. గతంలోనూ పలు మార్లు ఇసుక క్వారీల లీజు ద్వారా వచ్చిన కోట్లాది రూపాయలు నేరుగా వీరి ఖాతాలకు మళ్లించి సంఘ సభ్యులకు ఎగనామాలు పెట్టారనే ఆరోపణలున్నాయి.

ఇప్పటికైనా మత్స్యసహకార సంఘంలో జరుగుతున్న దోపిడిని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టరు గుర్తించి, సంఘ ఆస్తుల ద్వారా వస్తున్న కోట్లాది రూపాయల ఆదాయాన్ని సంఘ సభ్యులకు చేరేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### సంఘం ద్వారా వచ్చే సొమ్ము సభ్యులకు ఇవ్వాలి


### సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు బడికెల మధునయ్య



మత్స్య సహకార సంఘం ఆస్తుల ద్వారా వస్తున్న కోట్లాది రూపాయలను సంఘ నేతలు దోచుకోవడం దారుణం. ఇలాంటి అక్రమార్కులు సంగ ఆస్తులను తేరగా అనుభవిస్తుంటే సంఘంలోని సభ్యులు వలబాట పడుతున్నారు. వాటాల ద్వారా ఏటా వారికి లక్షలాది రూపాయలు రావాల్సి ఉందనే విషయం కూడా తెలియనీయకుండా సంఘ కీలక నేతలే అనుభవిస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు పూర్తి విచారణ జరిపి సొసైటి భూములు, చాపల పెంపకం ద్వారా వస్తున్న ఆదాయాన్ని సంఘ సభ్యులకు చేరవేసేలా చర్యలు చేపట్టాలి.

# యూరియా సప్లైలో ప్రభుత్వం పూర్తి వైఫల్యం

### నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



ప్రజాపక్షం/శివ్వంపేట : యూరియా సరఫరాలో ప్రభుత్వం అట్టర్‌ఫ్లాప్ అయిందని పోలీసుల పహారాలో యూరియా పంపిణీ చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు రమణాగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం శివ్వంపేట పీఏసీఎస్ ముందు రైతులతో కలసి నర్సాపూర్‌తూప్రాన్ ప్రధాన రహదారిపై ఎమ్మెల్యే బైఠాయించి రాస్తారోకో చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం యూరియా సరఫరా చేయకపోవడం వల్లే రైతులకు కష్టాలొచ్చి పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పొద్దున లేచినప్పుడు యూరియా కోసం వస్తే తిండితిప్పలు లేకున్నా తాగడానికిక కనీసం మంచినీళ్లు కూడా అందించే నాధుడేలేడని,ఇవన్నికష్టాలు పడ్డాగాని యూరి యా దొరుకుతుందో లేదో కూడా తెలువని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వైఫల్యంతోనే రైతులకు యూరియా కష్టాలు వచ్చాయని, మహిళలు చంటి పిల్లలతో వచ్చి క్యూ లైన్‌లో నిలబడితే ఆధార్ కార్డుకు ఒ బస్తా యూరియా అందించడమేంటని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ పాత రోజులు తెస్తామని ఎన్నికల ప్రచారంలో చెపితే ఏదో గొప్పగా చేస్తారనుకున్నామని కానీ నిజంగానే పాత రోజులు తెచ్చి చెప్పులు లైన్‌లో పెట్టే దుస్థితిని తీసుకువచ్చారని ఆమె మండిపడ్డారు. యూరియా కోసం రైతులు రొడ్డెక్కుతుంటే ప్రభుత్వ పెద్దలు, అధికారులు ఏం చేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల కష్టాలు తీరుస్తామని అన్నదాతల ఓట్లు దండుకొని గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ రైతులకు యూరియా కష్టాలు తెచ్చిపెట్టిందని ఎద్దేవ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిప్రభుత్వ వైఫల్యాలతోనే యూ రియా సరఫరా నిలిచిపోయిందని, గతం లో కేసీఆర్ ప్రభుత్వహాయంలో ప్రతీ గ్రామానికి ఎరువులు అందించి రైతులను కడుపులో పెట్టుకొని చూసుకున్నారని వివరించారు. ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియా అందించకుంటే బీఆర్ఎస్ తరుపున పోరాడుతామని హెచ్చరించారు.మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ చంద్రాగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్ రెడ్డి, జడ్పీ కోఆప్షన్ మాజీ సబ్యులు మన్సూర్, పార్టీ అధ్యక్షులు రమణాగౌడ్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ గౌడ్, గూడురు యాదాగౌడ్, రామాగౌడ్, కల్లూరి వెంకటేశ్, పత్రాల శ్రీనివాస్‌గౌడ్, పద్మ వెంకటేశ్, వంజరి కొండల్, లక్ష్మి నర్సయ్య, నాయకులు, తదితరులు ఉన్నారు.

## ప్రమాదవశాత్తు ప్రాజెక్టులో పడి ఒకరు మృతి



ప్రజాపక్షం/నిజాంసాగర్: పిట్లం మండలంలోని అల్లాపూర్ గ్రామానికి చెందిన గైని పండరి(28) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు శనివారం నిజాంసాగర్ ప్రాజెక్టులో పడి మృతిచెందినట్లు నిజాంసాగర్ సబ్ ఇన్స్‌పెక్టర్ శివకుమార్ ఆదివారం సాయంత్రం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పండరి జర్నలిస్టుగా పనిచేస్తున్నాడని, శనివారం ఉదయం నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు బాసర దేవాలయాన్ని దర్శించుకుంటానని ఇంట్లో చెప్పి బయలుదేరగా సాయంత్రం 6 గం.లకు ప్రమాదవశాత్తు కాలు జారి ప్రాజెక్టులో పడిపోగా కుటుంబీకులు, రెస్క్యూ బృందం పండరికోసం గాలించగా ఆదివారం ఉదయం 10 గం.ల ప్రాంతంలో మృతదేహం లభ్యమైందన్నారు. తన కుమారుడు బాగా మద్యం సేవించేవాడని మృతుని తండ్రి హన్మండ్లు నిజాంసాగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు



ప్రజాపక్షం/సంగారెడ్డి : మహిళా శిశు దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగం గా సంగారెడ్డిలోని తార డిగ్రీ కాలేజీలో విద్యార్థిని ,విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారిలలితాకుమారిమాట్లాడుతూయువతమాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. పట్టణ సిఐ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలన్నారు. ఎక్సైజ్ ప్రొహిబిషన్ సబ్ ఇన్స్పెక్టర్ సతీష్, క్రైమ్ బ్రాంచ్ అధికారి రమేష్, తారా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జగదీశ్వర్ జిల్లా ఆరోగ్య విద్య విస్తరణ అధికారి శ్రీనివాస్‌రావు ,మహిళా శిశు సంక్షేమ శాఖ, సిబ్బంది పాల్గొన్నారు.

## ధ్రువపత్రం లేని 86 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



ప్రజాపక్షం/బైంసా : బైంసా పట్టణంలోని రాజీవ్ నగర్ లో జిల్లా ఎస్పీ జానికి షర్మిల ఆదేశాల మేరకు ఏఎస్పీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సరైన ధ్రువపత్రం లేని 86 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ అవినాష్ కుమార్ మాట్లాడుతూ..రానున్న వినాయక చవితి దుర్గా నవరాత్రులు దృష్టిలో ఉంచుకొని ఈ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.యువత డ్రగ్స్ గంజాయి లకు దూరంగా ఉండాలని భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని తెలిపారు.అనుమానితంగా ఎవరైనా కనబడితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని కోరారు.కొత్తగా ఎవరైనా వచ్చే వారికి పూర్తి వివరాలు తెలుసుకున్నాకే అద్దేకు ఇవ్వాలని అన్నారు.పట్టణాన్ని నేర రహిత పట్టణంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు రక్షణ కల్పించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం పనిచేసుందన్నారు.సీసీ కెమెరాలు ఏర్పాటు ఎంతో ముఖ్యమని ప్రజలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ గోఫీనాథ్,ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అష్టముఖి కోనేరు వద్ద భక్తుల సందడి

### శ్రీలక్ష్మి నరసింహ ఆలయానికి రెండున్నర లక్షల రూపాయల ఆదాయం



ప్రజాపక్షం/ఎడపల్లి:ఎడపల్లి మండలం జాన్కంపేట్ శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయం వద్ద గల ప్రసిద్ధ అష్టముఖి కొనేరులో శనివారం అమావాస్య సందర్భంగా వేలాదిగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ మేరకు సుమారు 20వేల నుంచి 30వేల మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. దీంతో సాయంత్రం 5గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆలయానికి రెండు లక్షల 50వేల 456రూపాయాల ఆదాయం చేకూరిందని దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ కమల, ఈవో వేణు వెల్లడించారు. శనివారం రాత్రి గ్రామస్తులు, ఆలయ సిబ్బంది సమక్షంలో హుండి లెక్కింపు చేపట్టగా హుండిలో భక్తులు వేసిన విరాళాలు 86వేల 382రూపాయాలు వచ్చాయని, దర్శనం ద్వారా 21వేల 350రూపాయాలు, ప్రత్యేక కుంకుమార్చన ద్వారా 44,563రూపాయలు, అన్నదానం, తైబజార్ దుకాణాల ద్వారా 1,701 రూపాయాలు, కొబ్బరికాయలు నవధాన్యాల దుకాణం వేలం ద్వారా 48వేల రూపాయాలు, లడ్డు పులిహోర ప్రసాదం వేలం ద్వారా 43వేల రూపాయాలు, సైకిల్ స్టాండ్ వేలం ద్వారా 5500రూపాయాల ఆదాయం ఆలయానికి వచ్చిందని వారు వివరించారు.

## వామపక్ష ఉద్యమాలకు తీరని లోటు

### సిపిఐ జిల్లా కార్యదర్శి భుక్య రమేష్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, సుప్రసిద్ధ కమ్యూనిస్టు నేత సురవరం సుధాకర్‌రెడ్డి మరణం.. వామపక్ష, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ అన్నా రు.హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందార న్నారు.ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్‌లకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్ష ప్రధాన కార్యదర్శిగా ఢిల్లీలో ఉండి దేశవ్యాప్త విద్యార్థి, యువజన ఉద్యమాలకు విశేష కృషి చేశారు. ఆయన నాయకత్వంలో పనిచేసిన అనేకమంది విద్యార్థి,యువజన నాయకులు తర్వాత కాలంలో వివిధ రాష్ట్రాల్లో ప్రముఖ రాజకీయ నాయకులుగా ఎదిగారు. సురవరం సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సీపీఐ నిర్మల్ జిల్లా తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని భూక్యా రమేష్ తెలిపారు. సిపిఐ సీనియర్ నాయకుడు ఎస్.ఎన్.రెడ్డి, ఏఐటియుసి నిర్మల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నసీర్,అక్బర్,గంగయ్య,తదితరులు పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కెజిబివి ఎస్‌వోను సస్పెండ్ చేయాలి

ప్రజాపక్షం/శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 9 మంది విద్యార్థులను ఎలుకలు కరిచిన సంఘటనను ఎవరికి తెలియకుండా గోప్యంగా ఉంచిన ఉపాధ్యాయులపై వెంటనే అధికారులు స్పందించి వారిని సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కనకం సాగర్ డిమాండ్ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించకుండా, విద్యార్థినులచే పాఠశాలలో వసతి గృహాల్లో చాకిరి చేయిస్తున్నట్లు గతంలో ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి విద్యార్థులు తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే, జిల్లా అధికారులు స్పందించి పాఠశాలలో వంట మనుషులను తొలగించిన ఘటనలున్నాయన్నారు. కేశవపట్నం కస్తూరిబా పాఠశాల ప్రత్యేక అధికారిని మాధవిని సస్పెండ్ చేయాలని , లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తామని సాగర్ హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, ఆకాష్, అనిల్, సాత్విక్ , ఆదిత్యలు పాల్గొన్నారు.

## సుధాకర్ రెడ్డి భౌతిక కాయానికి నివాళి అర్పించిన టిజెఎస్ నాయకులు



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : హైదరాబాద్‌లోని మగ్దుమ్ భవన్‌లో సిపిఐ పార్టీ ప్రముఖ నేత సురవరం సుధాకర్ రెడ్డి భౌతిక కాయానికి ఆదివారం తెలంగాణ రాష్ట్ర జన సమితి పార్టీ అధ్యక్షుడు కోదండరాంతో కలిసి రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, జగిత్యాల జిల్లా పార్టీ అధ్యక్షులు గంగారెడ్డిలు నివాళి అర్పించారు. అనంతరం వారు సుధాకర్ రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి దేశానికి తీరని లోటు

సిద్దిపేట జిల్లా సిపిఐ కార్యదర్శి మంద పవన్



ప్రజాపక్షం/సిద్దిపేట: సిపిఐ అగ్రనేత,మాజీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్‌రెడ్డి మరణం భారతదేశానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. సురవరం స్ఫూర్తితో సమసమాజం కోసం ఉద్యమిస్తామన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి సిపిఐ నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. సురవరం అంచెలంచెలుగా ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శిగా, ఏఐవైఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శిగా విద్య, వైద్య ఉపాధి హక్కులకై ఉద్యమించి భారత విద్యార్థి.యువతనుఏకం చేసారన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ సిపిఐ రథసారధిగా సిపిఐ నిర్మాణాన్ని పటిష్ట పరుస్తూ పాలకుల విధానాలపై సమరశంఖం పూరించారన్నారు. రెండు పర్యాయాల నల్గొండ ఎంపిగా గెలుపొందరన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మ ణ్.నాయకులు శివలింగుకృష్ణ, మిట్టపల్లి సుధాకర్, వేల్పుల ప్రసన్నకుమార్.రామగళ్ల నరేష్. కనకరాజు పాల్గొన్నారు.

## మట్టి గణపతే.. మహా గణపతి: హరీష్‌రావు




ప్రజాపక్షం/సిద్దిపేట: మట్టి గణపతే..మహా గణపతిఅని . పర్యావరణాన్ని.. ప్రకృతిని కాపాడే బాధ్యత అందరిపై ఉందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఎంత పెద్ద విగ్రహాన్ని రంగు,రంగుల వినాయకుని ప్రతిమ పెట్టామన్నది ముఖ్యం కాదని.. ఎంతో భక్తి, శ్రద్ధలతో పెట్టమన్నదే ముఖ్యమని ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించటంలో అమర్‌నాథ్ అన్నదాన సంస్థ సేవలు గొప్పవన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవసేవయే..మాధవ సేవ అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ..ప్రకృతిని ప్రేమిస్తూన్నారని అమర్‌నాథ్ సంస్థ సభ్యులన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ చేసిన విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేస్తే చెరువులో జీవరాశులకు నష్టం వాటిల్లుతుందన్నారు. మట్టితో చేసిన వినాయకున్ని పూజిస్తే ముక్తి,.పర్యావరణానికి శక్తి లభిస్తుందన్నారు. మట్టి వినాయకులను పూజించి పర్యావరణ రక్షకులుగా మారాలన్నారు. గతంలో గ్రామాల్లో కులమతాలకు అతీతంగా ఐక్యంగా ఉండేందుకు ఒకటే వినాయకున్ని పెట్టి పూజించేవారన్నారు. నాయకుడు అంటే మంచి.చెడులను విశ్లేషిస్తూ సమాజాన్ని మార్గదర్శకం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు,మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, అమర్‌నాథ్ అన్నదాన సేవసంస్థ అధ్యక్షుడు కాచం కాశీనాథ్, ప్రధానకార్యదర్శి గంజిరాములు, గౌరవ అధ్యక్షుడు చీకోటి మధుసూదన్. ప్రతినిధులు శరభయ్య. ఉప్పల భూపతి, నందిని శ్రీనివాస్,కొర్తి వాడ లక్ష్మ ణ్. గంప శ్రీనివాస్, మాంకాల నవీన్‌కుమార్, జిల్లా శ్రీనివాస్,పూజల వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**మొద్దు నిద్రలో రేవంత్ రెడ్డి పాలన**

సమస్యలతో రాష్ట్ర ప్రజలు అల్లాడుతుంటే సిఎం రేవంత్‌రెడ్డి నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహిరస్తున్నాడని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు ఎద్దేవ చేశారు. సిఎం మొద్దు నిద్రను వీడి రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారం కోసం పని చేయాలని సూచించారు. రాష్ట్రంలో అసమర్ధన పాలన కొనసాగుతుండటంతో పాలన చేత గాని సిఎం తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ జేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో డెంగ్యూ వ్యాధితో మృతి చెందిన మహేశ్, శ్రావణ్‌కుమార్‌ల కుటుంబ సభ్యులను పరామర్శించారు. విషజ్వరాలతో గ్రామీణ ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిల్లోకి వెల్తే అక్కడ మందులు లేక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రహిస్తూ ఆర్థికంగా ఇబ్బందులకు గురవతున్నారని అన్నారు. కాంగ్రెస్‌పాలనలో ఆసుపత్రుల్లో మందులు లేవు కాని వైన్స్, బార్ శాపుల్లో ఫుల్ మందులు దొరుకుతున్నాయని ఎద్దేవ చేశారు. తిమ్మాపూర్‌లో 60 మంది పేదలు విషజ్వరాలకు గురై ప్రయివేటు దవాఖానల్లో చికిత్సలు పొందుతున్నారని అన్నారు. రేవంత్ సర్కార్‌లో ఇంటలిజెన్స్ వ్యవస్థ ఏమి చేస్తుందని ప్రశ్నించారు. రేవంత్ పాలనపై, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం లేకుండాపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అధోగతి పాలైందని, ఈ ప్రభుత్వానికి రైతుల గోస పట్టదా అని నిద్దించారు. ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాటం తప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ ఇంచార్జీ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జగదేవ్‌పూర్ మాజీ ఎంపిపి బాలేషంగౌడ్, పిఎసిఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఖమ్మంపల్లిలో జోరుగా అక్రమ మట్టి రవాణా



ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామం లో ప్రభుత్వ భూమిలో అక్రమ మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతుంది.గ్రామం లో ని సర్వే నంబర్ 617 లో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడం తో అక్రమార్కులు మట్టి రవాణా చేస్తున్నారు.గ్రామస్తులు తమ ఇంటి అవసరాల కోసం పర్మిషన్ లు ఇవ్వని అధికారులు అక్రమ రవాణా చేస్తున్న పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. *పట్టుకున్నారు, వదిలేశారు.గ్రామం లో మట్టి రవాణా జరిగితుందని కొంతమంది గ్రామస్తులు అధికారులకు సమాచారం ఇవ్వడం తో రెవిన్యూ అధికారులు జేసిబి, ట్రాక్టర్ లను పట్టుకొని వదిలేశారు. దింతో అధికారులు అక్రమ రవాణా చేస్తున్న వాహనాల ను మాములుగా తీసుకోవడం తో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అసువులు బాసిన అరుణతారకు అశ్రునివాళులు



పెద్దపెల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

ప్రజాపక్షం/పెద్దపల్లి: భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మాజీ ప్రధాన కార్యదర్శి ,మాజీ ఎంపీ కమ్యూనిస్టు దిగ్గజం కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి పార్థివ దేహానికి సిపిఐ పెద్దపెల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోషిక మోహన్ , గౌతమ్ గోవర్ధన్ ఏఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు ఆరేపల్లి మానస్ కుమార్,మార్కపురి సూర్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలసాని లెనిన్లు సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దుంభవన్లో ఘన నివాళులు అర్పించడం జరిగింది.అనంతరం నాయకులు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే రాజకీయాల్లో అడుగుపెట్టిన సురవరం సుధాకర్ రెడ్డి ఏఐఎస్ఎఫ్ లో పట్టణ శాఖ కార్యదర్శి స్థాయి నుండి అంచలంచెలుగా ఎదుగుతూ ఏఐఎస్ఎఫ్ జాతీయ కమిటీలకు నాయకత్వం వహించడంతో పాటు సిపిఐ కర్నూలు జిల్లా కార్యదర్శి గా రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రాష్ట్ర కార్యదర్శిగా పనిచేయడంతో పాటు నల్గొండ పార్లమెంట్ సభ్యులుగా రెండు సార్లు ఎన్నిక కావడమే కాకుండా భారత కమ్యూనిస్టు పార్టీ ఉప ప్రధాన కార్యదర్శిగా అలాగే ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి భారత దేశ రాజకీయాలపై తనదైన ముద్రవేసిన గొప్ప నాయకులను సురవరం సుధాకర్ రెడ్డి అని అన్నారు. సుధాకర్ రెడ్డి మరణం భారతదేశ వామపక్ష ఉద్యమానికి తీరని లోటని రాబోయే కాలంలో సుధాకర్ రెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త పోరాడాలని పిలుపునిచ్చారు.

సుధాకర్ రెడ్డి నివాళులర్పించిన జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్



కరీంనగర్‌సిటీ: జీవితమంతా ప్రజల కోసం అంకితం చేసి అసువులు బాసిన అరుణతార, భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అగ్రనాయకుడు, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి అని సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మక్దూం భవన్‌లో సుధాకర్ రెడ్డి మృతదేహానికి పంజాల శ్రీనివాస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశ రాజకీయాలలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా, మేధావిగా, ప్రజాప్రతినిధిగా,వామపక్షాలకే వన్నె తెచ్చిన గొప్ప మహోన్నతమైన వ్యక్తి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. స్వాతంత్ర సమర యోధుల కుటుంబంలో పుట్టిన సురవరం చిన్నప్పటి నుంచే కమ్యూనిస్టు భావాలను అలవర్చుకుని అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్‌లో చేరి విద్యార్థి, యువజన నాయకునిగా పట్టణ స్థాయి నుంచి రాష్ట్ర,జాతీయ అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా విద్యార్థి యువజన సమాఖ్యలకు నాయకత్వం వహించి అంచెలంచెలుగా ఎదిగారన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు న్యాలపట్ల రాజు, బూడిద సదాశివ, రామడుగు మండల మాజీ కార్యదర్శి గొడిసెల తిరుపతి గౌడ్ తదితరులున్నారు.

ఎఐటియుసి బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు కొక్కుల శాంత

మల్యాల: సిపిఐ అగ్ర నేత సుప్రసిద్ధ కమ్యూనిస్టు యోధుడు, ప్రముఖ పార్లమెంటేరియన్, నల్ల గొండ మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి మరణం యావత్ భారత దేశానికి ,భారత కమ్యూనిస్టు పార్టీకి వామపక్ష ఉద్యమాలకు తీరనీ లోటని ఏ ఐటియుసి బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు కొక్కుల శాంత అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో సిపిఐ మాజీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి సంతాప సభ ఏర్పాటు చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నేతలు మాట్లాడుతూ భారతదేశ రాజకీయాలలో విలువలతో కూడిన రాజకీయాలు చేశారని, విద్యార్థి దశ నుంచే ఉద్యమాల వైపు నడిచి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా పనిచేసి ఎన్నో విద్యార్థి యువజన మిలిటెంట్ పోరాటాలు నిర్వహించిన మార్గదర్శకులనీ సుధాకర్ రెడ్డి భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాణంలో కీలకపాత్ర పోషించాడని,నమ్మిన సిద్ధాంతాల కోసం జీవితాంతం పనిచేసిన నాయకుడని, బడుగు బలహీన వర్గాలకు తీరనిలోటని ఆయన సేవలు మరువలేనివని ఆయన పార్థివ దేహాన్ని ఖననం చేయకుండా డాక్టర్ల విద్య కొరకు అప్పగించడం గొప్ప మనసున్న కుటుంబమని అన్నారు . ఈ సమావేశంలో ఏ ఐ టియుసినాయకులు ముక్రమ్, రజాక్,సిపిఐ మల్యాల కార్యదర్శి రమ, బీడీ కార్మికులు,కన్నం లలిత,బాలే జయశ్రీ, వడ్లకొండ భూలక్ష్మి , రాధ, లక్ష్మి ,తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు సమస్య పరిష్కారానికి కృషి

ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: ప్రజా సమస్యల పరిష్కారానికి నేనున్నా మీకోసం అనే సరికొత్త కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు శ్రీకారం చుట్టారు. మార్నింగ్ వాక్ పేరిట నేనున్నా మీకోసం అనే కార్యక్రమాన్ని ప్రారంభించి సరికొత్త అధ్యయానికి నడుం బిగించారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడం.. వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించి పరిష్కరించడం ప్రధాన లక్ష్యంగా నేనున్నా మీకోసం అనే నినాదంతో కరీంనగర్ ప్రజల ముందుకొస్తున్నారు రాజేందర్‌రావు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం తీగలగుట్టపల్లిలో మార్నింగ్ వాక్ పేరిట సమస్యల పరిష్కారానికి సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నగునూర్ శివారులో దుర్గామాత ఆలయానికి వెళ్లే దారిలో రోడ్డు సమస్య గురించి రైతులు, ప్రజలు, స్థానికులు పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు వైపులా రోడ్డు కనెక్టివిటీ లేకపోవడంతో తామంతా ఇబ్బందులు పడుతున్నామని రైతులు, ప్రజలు రాజేందర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ రోడ్డు సమస్యపైశనివారమే ఆర్డీవోతో మాట్లాడానని, ఈ సమస్య పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటానని రాజేందర్‌రావు వారికి హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేలా చొరవ చూపుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, మూల ప్రభాకర్ రెడ్డి, స్థానిక నాయకులు భూమయ్య, చంద్రారెడ్డి, మూల రాజిరెడ్డి, కాంతాల రమణారెడ్డి, గోపాలరావు, కొలగాని అనిల్, రమేష్ తదితరులున్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రతతో డెంగీ నిర్మూలన

ల్యాబ్ టెస్టింగ్‌లు నిర్వహించే ఆర్‌ఎంపిలపై చర్యలకు ఆదేశం

కలెక్టర్ హైమావతి



ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తి గత పరిశుభ్రతతో డెంగ్యూ వ్యాధిని సములంగా నిర్మూలించవచ్చని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి పేర్కొన్నారు. ఆదివారం జగదేవ్‌పూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో పర్యాటించిన అనంతరం డెంగ్యూ వ్యాధితో మృతి చెందిన బాధిత కుంటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న వైద్య శిబిరం పరిశీలించి స్థానిక వైద్యులకు పలు సూచనలు చేశారు. ఇంటింటికి ఫీవర్ సర్వే నిర్వహించి నివేదికలు అందజేయాలన్నారు. విషజ్వరాలు సోకిన కుటుంబాల వివరాలు సేకరించి బాధితులను వైద్య పరీక్షల నిమిత్తం టి హాబ్‌కు తరలించి వైద్య సేవలందించాలని అధికారులను ఆదేశించారు. పంచాయతి అధికారులు ప్రతి ఇంటికి తిరిగి వర్షం నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకునేలా గ్రామస్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అంతర్గత రొడ్లపై మురికి నీరు,చెత్త చేదారం, కాలి టైర్లు నిల్వ ఉండకుండా పంచాయతి అధికారులు చోరవ చుపాలన్నారు. గ్రామానికి తాగు నీరు సరఫరా ఆయ్యేనీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లీన్ చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని డిపిఒకు సూచించారు. పారిశుధ్యం పట్ల గ్రామాలలో నిర్లక్ష్యం వహించే గ్రామ కార్యదర్శుల పట్ల కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మండలంలో కొన్ని గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు తమ విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ప్రజల నుండి పిర్యాదులువస్తున్నందున అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతి అధికారి దేవకిదేవికి సూచించారు. అలాగే మండలంలో నిబంధనలకు విరుద్ధంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆర్‌ఎంపి వైద్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని జిల్లా మెడికల్ అధికారి ధనరాజ్‌ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వేములవాడ అభివృద్ధికి తొలి అడుగు



ములవాగు బ్రిడ్జి నుండి రాజన్న ఆలయం వరకు రూ.6.5 కోట్లతో 80 ఫీట్ల రోడ్డుకు శంకుస్థాపన

ప్రజా పక్షం/ వేములవాడ: వేములవాడ పట్టణంలోని ములవాగు బ్రిడ్జి నుండి రాజన్న ఆలయం వరకు 6 కోట్ల 50 లక్షల రూపాయల వ్యయంతో 80 ఫీట్ల రోడ్డుకు వెడల్పు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అతనితో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా ఎస్పీ మహేష్ బి గితే, ఆలయ ఈవో రాధ భాయి, మార్కెట్ కమిటీ చైర్మన్లు రొండి రాజు, చెలకల తిరుపతి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ హాజరయ్యారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కోడెను కట్టే ప్రాచీన ఆనవాయితీ ఉన్న రాజన్న ఆలయం అభివృద్ధి తెలంగాణ ప్రభుత్వానికి ప్రాధాన్యత అంశమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రత్యేక ప్రణాళికలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి నెలలోనే వీటిడిఏ సమావేశం నిర్వహించి గతంలో పోయిన 20 కోట్ల నిధులను తిరిగి తెప్పించి బద్ది పోచమ్మ ఆలయం అభివృద్ధికి ప్రారంభించామని తెలిపారు. గతంలో రాష్ట్రాన్ని నడిపించిన కేసీఆర్ వేములవాడ అభివృద్ధిపై వాగ్దానాలు ఇచ్చినప్పటికీ వాటిని అమలు చేయలేకపోయారని విమర్శించారు. రాజన్న భక్తులు ఎన్నిసార్లు కోరినప్పటికీ ఒక్క ఇటుక మార్చని స్థితిలో వదిలేశారని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.150 కోట్లను కేటాయించి రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. గత సంవత్సరం నవంబర్ 20న సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎనిమిది మంది మంత్రుల చేతుల మీదుగా సుమారు రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్టు గుర్తు చేశారు. వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తామని, భక్తులకు శీఘ్ర దర్శన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన పట్టణ ప్రజలకు, భక్తులకు ధన్యవాదాలు తెలిపారు.

## మంత్రికి, కాంగ్రెస్ నేతల ఘన స్వాగతం



ప్రజాపక్షం/బెజ్జంకి: తెలంగాణ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,ఏఐసిసి ఇంచార్జీ మీనాక్షి నటరాజన్,రాష్ట్ర రవాణ బీసి సంక్షేమ శాఖ మంత్రి పొన్న ప్రభాకర్‌లు ఉమ్మిడి కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గంలో జరిగే జనహిత పాదయాత్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుండి కరీంనగర్ వెళ్తున్న సంధర్భంగా ఆదివారం మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్ రాజీవ్ రహదారి వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శాలువాతో సన్మానించి పుష్ప గుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఒగ్గు దామోదర్, రత్నాకర్ రెడ్డి, కృష్ణ, పోతిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్, శ్రీకాంత్, శ్రీనివాస్, నాయకులుపాల్గొన్నారు.

## ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపిఎస్



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: విద్యా సంస్థల్లో ర్యాగింగ్ పాల్పడిన విద్యార్థులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసు కమిషనర్ గౌష్ ఆలం ఐపిఎస్ హెచ్చరించారు. త్వరలో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ఆదివారం ఒక ప్రకటన విడుదల చేవారు. ర్యాగింగ్‌కు పాల్పడడం తీవ్రమైన నేరమని, ఇది విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తుందన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లపై చేసే వేదింపులు, అసభ్యకర కార్యకలాపాలు చట్ట ప్రకారం శిక్షార్హమని ఆయన స్పష్టం చేశారు. అటువంటి చర్యలకు పాల్పడిన విద్యార్థులను విద్యాసంస్థల నుంచి తొలగించడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేసి వారి ఉజ్వల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు.

**విద్యాసంస్థల యాజమాన్యానికి సూచనలు**

ర్యాగింగ్ నియంత్రణ కోసం విద్యాసంస్థల యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిపి సూచించారు. ప్రతి కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలు, స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని, కొత్తగా వచ్చిన విద్యార్థులకు ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. అంతేకాకుండా ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు, సెమినార్లను నిరంతరం నిర్వహించాలన్నారు. విద్యార్థుల ఫిర్యాదుల కోసం 24 గంటల హెల్ప్‌లైన్ నెంబర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ర్యాగింగ్ సమాచారం అందించడానికి డయల్ 100, కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూం నెంబర్లు 8712670744. 8712670745 కు కాల్ చేయవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని కమిషనర్ తెలిపారు. అందరి సహకారంతో ర్యాగింగ్ రహిత సమాజాన్ని నిర్మించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.


## జనహిత పాదయాత్రకు 200 వాహనాలతో తరలివెళ్లిన వెలిచాల

కాంగ్రెస్ ముఖ్యనేతలు, మంత్రులకు ఘన స్వాగతం



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: గంగాధర మండలం ఉప్పర మల్యాలలో చేపట్టిన జనహిత పాదయాత్రకు హాజరవుతున్న కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్‌లకు కొత్తపల్లిలోని వెలిచాల కార్యాలయం వద్ద ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు ఘన స్వాగతం పలికారు. వారందరికీ రాజేందర్‌రావు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఆ తర్వాత 200 వాహనాలతో బారీ ర్యాలీగా వెలిచాల రాజేందర్ రావు ఉప్పరమల్యాలలో జరిగే కాంగ్రెస్ జనహిత పాదయాత్ర కార్యక్రమానికి తరలివెళ్లారు. కాంగ్రెస్ నాయకులు, మాజీ కార్పోరేటర్లు, మాజీ కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పార్టీ శ్రేణులు 500 మందితో రాజేందర్‌రావు తరలివెళ్లారు. జనహిత పాదయాత్ర నేపథ్యంలో ఉదయం నుంచి వెలిచాల ప్రజా కార్యాలయం వద్ద కార్యకర్తల కోలాహలం నెలకొంది. కార్యాలయం సందడిగా మారింది. 500 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సంధర్భంగా వెలిచాల రాజేందర్‌రావు నాయకులు, కార్యకర్తలతో కలిసి డిజె సాంగ్స్ మధ్య నృత్యం చేశారు. జనహిత పాదయాత్ర కార్యక్రమానికి వెళ్లే కాంగ్రెస్ ముఖ్య నేతలకు రాజేందర్ రావు సారధ్యంలో వెలిచాల ప్రజా కార్యాలయం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. కాంగ్రెస్ నాయకులు, మాజీ కార్పోరేటర్లు, మాజీ ప్రజా ప్రతిఇధులు, వివిధ సంఘాల నేతలు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కవ్వంపల్లిని పరామర్శించిన కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి, పిసిసి చీఫ్



ప్రజాపక్షం/కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణను కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు ఆదివారం పరామర్శించారు. ఐదు రోజుల కిందట ఎమ్మెల్యే రెండో సోదరుడు కవ్వంపల్లి రాజేశం అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. కరీంనగర్‌లోని వాల్మీకినగర్‌లో గల కవ్వంపల్లి నివాసానికి విచ్చేసి రాజేశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చొప్పదండి నియోజకవర్గంలో నిర్వహించనున్న జనహిత కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, తెలంగాణ పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, మంత్రి పొన్నం ప్రభాకర్, గనులు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీ భాను ప్రసాద్, మెన్నేని రోహిత్ రావుతో పాటు పలువురు నాయకులు ఎమ్మెల్యే సత్యనారాయణను పరామర్శించిన వారిలో ఉన్నారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, నల్గొండ జిల్లా ఎమ్మెల్సీ శంకర్ నాయక్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పరామర్శించారు.

# క్రీడ



## అంతర్జాతీయ క్రికెట్‌కు పుజారా గుడ్‌బై..

భారత క్రికెట్‌కు 'నయా వాల్'గా పేరు గాంచిన సీనియర్ టెస్ట్ ప్లేయర్ ఛతేశ్వర్ పుజారా అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్‌ను ప్రకటించాడు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. 2023లో ఆస్ట్రేలియా పర్యటనలో జట్టు నుంచి చోటు కోల్పోయిన తర్వాత పుజారా గత కొన్నాళ్లుగా ఫామ్ లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. దీంతో అతను తిరిగి జట్టులోకి రావడం కష్టంగా మారింది. దేశవాళీ క్రికెట్‌లో మంచి ప్రదర్శనలు చేసినప్పటికీ, సెలెక్టర్ల నుంచి పిలుపు రాలేదు. దీంతో ఇకపై తనకు జట్టులో చోటు దక్కడం కష్టమని భావించిన అతడు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక పుజారా నిర్ణయాన్ని పలువురు క్రికెటర్‌లు స్వాగతిస్తున్నారు. కెరీర్ పరంగా చూసుకుంటే.. పుజారా 103 టెస్ట్ మ్యాచ్‌లు ఆడగా.. 43.60 సగటుతో మొత్తం 7,195 పరుగులు చేశారు. ఇందులో 19 సెంచరీలు మరియు 35 అర్ధ సెంచరీలు ఉన్నాయి. 2018–19లో ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో పుజారా అద్భుతమైన ప్రదర్శన కనబరిచి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు గెలుచుకున్నారు. ఆ సిరీస్‌లో మొత్తం 521 పరుగులు చేసి, భారతదేశం తొలిసారిగా ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్‌ను గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించారు. అయితే టెస్ట్‌లలో రాణించిన పుజారా వన్డేలలో రాణించలేకపోయాడు. తన క్రికెట్ కెరీర్‌లో కేవలం 5 వన్డేలు మాత్రమే ఆడారు. క్రీజులో ఎక్కువసేపు నిలబడి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించే పుజారాని చూసి రాహుల్ ద్రవిడ్ తర్వాత, పుజారాను 'నయా వాల్' అని పిలిచేవారు.

## దాదా సరికొత్త ఇన్నింగ్స్!

### తొలిసారిగా హెడ్‌కోచ్ పాత్రలో సౌరవ్ గంగూలీ..!



భారత జట్టు మాజీ కెప్టెన్, బిసిసిఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ తొలిసారిగా సరికొత్త అవతారంలో కనిపించబోతున్నారు. తన కెరియర్‌లోనే కొత్ అధ్యాయాన్ని ప్రారంభించనున్నారు. ఇప్పటి వరకు పరిపాలనపరమైన పాత్రల్లో కొనసాగిన గంగూలీ.. ఓ జట్టుగా హెడ్‌కోచ్‌గా పని చేయనున్నారు. దక్షిణాఫ్రికా టీ20 లీగ్ 2026 సీజన్ కోసం ప్రిటోరియా క్యాపిటల్స్ జట్టు గంగూలీని హెడ్ కోచ్‌గా నియమించింది. ఈ మేరకు పిట్రోరియా క్యాపిటల్స్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. డిసెంబర్ 26 నుంచి ప్రారంభమయ్యే ఎస్ఎ20 నాల్గవ సీజన్ కోసం భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ప్రిటోరియా క్యాపిటల్స్ ప్రధాన కోచ్‌గా నియామకమయ్యారని పేర్కొంది. మాజీ ఇంగ్లాండ క్రికెటర్ జోనాథన్ ట్రాట్ స్థానంలో గంగూలీ ఈ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రొఫెషనల్ క్రికెట్ జట్టుకు హెడ్‌కోచ్‌గా గంగూలీ పూర్తి స్థాయి పాత్ర పోషించడం ఇదే మొదటిసారి. 53 ఏళ్ల గంగూలీ గత సంవత్సరం నుంచి ప్రిటోరియా క్యాపిటల్స్ మాతృ సంస్థ అయిన జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్‌కు క్రికెట్ డైరెక్టర్ పని చేసిన విషయం తెలిసిందే. భారత మాజీ కెప్టెన్ ఇండియన్ ప్రీమియర్ లీగ్, ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు క్రికెట్ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. ఈ సందర్భంగా ప్రిటోరియా క్యాపిటల్స్ తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 'యువరాజు మా క్యాంప్‌కు రాజసం తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారు! సౌరవ్ గంగూలీని మా కొత్త హెడ్ కోచ్‌గా ప్రకటిస్తున్నందుకు చాలా సంతోషిస్తున్నాం' పేర్కొంది. వాస్తవానికి గంగూలీ 2008లో అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పారు. ఆ తర్వాత క్రికెట్ పరిపాలన రంగంలోనే ఎక్కువగా పని చేసేందుకు ఆసక్తి చూపించారు. బీసీసీఐ అధ్యక్షుడిగా, బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతల్లో కొనసాగారు. ప్రస్తుతం ఐసీసీ పురుషుల క్రికెట్ కమిటీకి చైర్మన్‌గానూ కొనసాగుతున్నారు.

ఐపిఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా, అలాగే ఒక దశలో మెంటార్‌గా వ్యవహరించారు. గత సీజన్ వరకు జొనాథన్ ట్రాట్ ప్రిటోరియా క్యాపిటల్స్ హెడ్‌కోచ్‌గా ఉన్నారు. గత సీజన్‌లో ఆ జట్టు పది గ్రూప్ మ్యాచ్‌లలో కేవలం రెండింట్లోనే విజయం సాధించింది. నాకౌట్ దశకు చేరుకోకపోవడంతో ట్రాట్ హెడ్‌కోచ్ పదవి నుంచి తప్పుకున్నారు. ఈ క్రమంలోనే గంగూలీ హెడ్‌కోచ్‌గా తీసుకోవడం విశేషం. సెప్టెంబర్ 9న జరిగే ఆటగాళ్ల వేలం జరుగనున్నది. జట్టును అన్నిరంగాల్లో తీర్చిదిద్దేందుకు ఉత్తమమైన ఆటగాళ్లను ఎంపిక చేయాల్సిన బాధ్యత గంగూలీపైనే ఉండనున్నది. 2026 పురుషుల టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని దక్షిణాఫ్రికా టీ20 లీగ్ షెడ్యూల్‌ను ముందస్తుగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ లీగ్ డిసెంబర్ 26న మొదలై వచ్చే ఏడాది జనవరి 25 వరకు కొనసాగుతుంది. గంగూలీ నియామకం తమ అదృష్టంలో మార్పు తెస్తుందని ప్రిటోరియా క్యాపిటల్స్ ఆశిస్తోంది.

## 2027 వరల్డ్ కప్

### 54 మ్యాచ్‌లు, 12 స్టేడియాలు ఈసారి మరింత కొత్తగా..

2027 వన్డే వరల్డ్‌కప్ టోర్నమెంట్‌కు సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు సన్నాహాలు ప్రారంభించింది. రాబోయే ఈ టోర్నీలో సతాఫ్రికాతోపాటు జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ టోర్నమెంట్‌లో లీగ్ మ్యాచ్‌లు, సెమీఫైనల్, ఫైనల్ సహా 54 మ్యాచ్‌లు ఉండనున్నాయి. ఈ నేపథ్యంలో మెగా ఈవెంట్‌ను దృష్టిలో ఉంచుకుని సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు తమ దేశంలో మ్యాచ్‌లు జరిగే స్టేడియాలను ఫైనలైజ్ చేసింది.

**అత్యధికంగా సౌతాఫ్రికాలోనే..**

టోర్నీలో మొత్తం 54 మ్యాచ్‌లు ఉండగా, అందులో అత్యధికంగా 44 మ్యాచ్‌లకు సౌతాఫ్రికానే ఆతిథ్యం ఇవ్వనుంది. మిగిలిన 10 మ్యాచ్‌లు జింబాబ్వే, నమీబియాలో జరుగుతాయి. 44 మ్యాచ్‌లను నిర్వహించడానికి సౌతాఫ్రికా దేశంలో 8 స్టేడియాలను ఎంపిక చేసినట్లు సౌతాఫ్రికా స్థానిక టోర్నమెంట్ నిర్వాహక కమిటీ బోర్డు ఛైర్మన్, మాజీ కేబినెట్ మంత్రి ట్రెవర్ మాన్యుయేల్ ప్రకటన చేశారు.


ఇందులో జొహెన్నస్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియం, కేప్‌టౌన్‌లోని న్యూలాండ్స్ క్రికెట్ గ్రౌండ్స్, దర్బన్ కింగ్స్ మీడ్ క్రికెట్ గ్రౌండ్ ప్రిటోరియా సెంచూరియన్ పార్క్, బ్లూమ్ ఫోంటైన్ మాంగాంగ్ ఓవల్, గ్కెబెరాలోని సెయింట్ జార్జ్ పార్క్, ఈస్ట్ లండన్‌లోని బఫెలో పార్క్, పార్ల్ బోలాండ్ పార్క్ ఉన్నాయి. ఈ ఎనిమిది నగరాల్లోని స్టేడియాల్లో మొత్తం 44 మ్యాచ్‌లు జరగనున్నాయి.

# ఆరోగ్యం

## ఫోకస్

ముఖ్యమైన విటమిన్లలో విటమిన్ 'డి' కూడా ఒకటి. విటమిన్ 'డి'కి ఒక ప్రత్యేకత ఉన్నది. ఉదయం వేళల్లో మన శరీరంపై పడే సూర్యరశ్మి వల్ల మన దేహంలో విటమిన్ 'డి' తయారు చేయబడుతుంది. అందువల్లనే విటమిన్ 'డి'ని సూర్యరశ్మి విటమిన్ లేదా సన్‌షైన్ విటమిన్ అని కూడా పిలుస్తారు.

## విటమిన్ 'డి' లోపంతో ఎన్నో సమస్యలు




మనం తీసుకునే కొన్ని ఆహార పదార్థాల్లో కూడా విటమిన్ 'డి' ఉంటుంది. విటమిన్ 'డి' మినహా ఇతర విటమిన్లు మాత్రం ఆహారం రూపంలోన శరీరానికి అందుతాయి. వివిధ శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం 50 శాతానికి పైగా వ్యక్తుల్లో విటమిన్ 'డి' లోపం ఉన్నట్లు గమనించారు. వానాకాలంలో ఎండలు అధికంగా పడకపోవడంతో పాటు పేదరికం వల్ల విటమిన్ 'డి' కలిగిన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల ఈ సమస్య పెరుగుతున్నట్లు గమనించారు. గ్రామీణ, చిన్న పట్టణాల్లో సహితం విటమిన్ 'డి' లోపం కనిపిస్తున్నట్లు తేల్చారు. ఎండలో పని చేయకపోవడం లేదా బయటకు వెళ్లకపోవడంతో పాటు శరీరాన్ని పూర్తిగా బట్టలతో కప్పివేయడం వల్ల కూడా సూర్యరశ్మి చర్మం మీద పడని కారణంగా సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఎముకలు, కండరాలు, నాడీమండలం, కండరఅస్థిపంజరాలు, రోగ నిరోధకశక్తి లాంటి వ్యవస్థల ఆరోగ్యానికి విటమిన్ 'డి' దోహదపడుతుంది. వర్షాకాలంలో వానలు, ముసుర్లు, ఆకాశం మబ్బుపట్టడంతో సూర్యరశ్మి భూతలంపై పడని కారణంగా మన శరీరంలో అవసర విటమిన్ 'డి' అందని కారణంగా పలు అనారోగ్యాలు కలుగుతాయి. సాధారణ ప్రజల్లో అవగాహనలోపం వల్ల కూడా అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. విటమిన్‌డి లోపం వల్ల అలసట, కండరాల బలహీనత, ఎముకల నొప్పి, ఆందోళన, ఇన్‌ఫెక్షన్స్ పెరగడం, వెన్ను నొప్పి, వ్యాధి నిరోధకశక్తి తగ్గడం, కీళ్లు బిగుసుకుపోవడం, కాల్షియం శోషణం తగ్గడంతో ఎముకలు బలహీన పడడం, మానసిక చికాకు పెరగడం (మూడ్ స్వింగ్) లాంటి పలు అనారోగ్యాలు కలుగుతాయి. విటమిన్ 'డి' లోపం తీవ్రం అయినపుడు స్థూలకాయం, ఫైబ్రోసిస్, కిడ్నీ సమస్యలు, కాలేయ సమస్యలు కూడా కలుగుతాయి. విటమిన్ 'డి' లోపం దీర్ఘకాలం పాటు కొనసాగితే సులభంగా ఎముకలు విరిగిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. విటమిన్ 'డి' లోపం కలిగిన పిల్లల్లో సహితం రికెట్స్ (ఎముకలు మెత్తబడడం, వంకర కాళ్లు) వ్యాధి కనిపిస్తుంది. ఈ సమస్యల నివారణకు విటమిన్ 'డి' ఉన్న కలిగిన గుడ్లు, చేపలు, పాలు, పాల ఉత్పత్తులు, తృణ ధాన్యాలు, పుట్ట గొడుగులు, పాలకూర, సంత్రాలు, మాంసం, టోఫూ, అరటి పండ్లు, సోయా పాలు లాంటి పోషకాహార పదార్థాలను రోజు తీసుకోవడం తప్పనిసరి అని గమనించాలి. 40 ఏండ్లు దాటిన పౌరులు, ముఖ్యంగా మహిళలు విధిగా విటమిన్‌డి నిర్ధారణ పరీక్షలను ప్రతి ఏట ఒకసారి అయినా చేయించుకోవాలి. ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య కనీసం 15 నుంచి 30 నిమిషాలు ఎండ శరీరంపై పడే విధంగా జీవన శైలినా మార్చుకోవాలి. విటమిన్ 'డి' లోపం పట్ల అవగాహన, ఆహార పదార్థాల పోషక విలువల కనీస పరిజ్ఞానం, 50 ఏండ్లు దాటిన వయోజనులు ఏడాదికి ఒకసారి పరీక్ష చేయించుకోవడం, ఉదయం వేళ శరీరంపై ఎండ పడే విధంగా చూసుకోవడం లాంటి జాగ్రత్తలతో విటమిన్‌డి లోప సమస్యలు తొలగి పోతాయి. వానాకాలంలో ఎండ పడుతున్న వేళల్లో తప్పనిసరిగా ఎండలో గడపడాన్ని మరచిపోరాదు.

## జీవనశైలి మార్చుకోవాలి..



నేటి అత్యాధునిక ప్రపంచంలో పెరుగుతున్న సౌకర్యాలు మనిషిని సోమరిని చేస్తున్నాయి. అనేకానేక ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. సౌకర్యాలు మంచివేగానీ, అతిగా వాటిపైనే ఆధారపడి, కనీస వ్యాయామం కూడా లేకుండా రోజులు దొర్లించడం వల్ల ఎన్నో రకాల రోగాలు చుట్టుముట్టడం ఖాయం. ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలంటే, వ్యక్తిగత జీవన శైలి మార్పులు తప్పనిసరుగా చేయాలి. ఆరోగ్యకరమైన ఆహారం, నిత్యం వ్యాయామం అవసరం. పొగాకు, మద్యం వంటి దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలి. ఒత్తిడి నిర్వహణ, సరియైన నిద్ర, మానసిక శాంతి కోసం తగిన చర్యలు తీసుకోవాలి. శరీర బరువు నియంత్రణపైన కూడా దృష్టి పెట్టాలి. తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. ప్రత్యేకించి బ్లడ్ ప్రెషర్, షుగర్, కొలెస్ట్రాల్, క్యాన్సర్ స్క్రీనింగ్స్ టెస్టులు తప్పనిసరి. వ్యాధి ప్రారంభ దశలో గుర్తించి చికిత్స చేపట్టడం ద్వారా పరిణామాలు తగ్గించడం సాధ్యమవుతుంది. వాతావరణ సంబంధిత రక్షణ చర్యలను మరచిపోకూడదు. అధిక వేడి, కాలపరిమితిలో ప్రమాదాలను గమనించడం, తగిన మిద్దతలు తీసుకోవడం అవసరం. గాలిలో మలినాలు, ఆక్సిజన్‌లో తక్కువ స్థాయి ఉన్న సమయాల్లో జాగ్రత్తలు పాటించాలి. మాస్క్ ధరించడాన్ని అలవాటు చేసుకోవాలి. వాతావరణ మార్పులకు అనుగుణంగా పని సమయాలు, జీవనశైలి సర్దుబాటు చేసుకోవాలి. ఈ మిశ్రమ చర్యలు సమగ్ర ఆరోగ్య పరిరక్షణకు మార్గం చూపుతాయి. వ్యాధుల నివారణకు సహాయపడతాయి. ఆరోగ్య భద్రతా విధానాలని పాటించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) కూడా సూచిస్తున్నది. జీవనశైలిని మార్చుకొని, ఆరోగ్యంగా జీవించాలని హితవు పలుకుతున్నది.

## ఆశాజనకంగా కొత్త ప్రయోగాలు



మల్టిపుల్ స్క్లెరోసిస్ (ఎంఎస్) చికిత్సలో కొత్త ప్రయోగాలు ఆశాజనకంగా ఉన్నాయి. బ్రూటన్స్ టైరోసిన్ కినాస్ ఇన్‌హిబిటర్స్ అందుబాటులోకి వస్తున్నాయి. టోల్బ్రిటినిబ్ (Tolebrutinib) అనే కొత్త మందు మెదడు రక్త అవరోధాన్ని దాటుకొని, సెల్లలోని ఇమ్యూన్ కణాలను లక్ష్యంగా చేస్తుంది. ఇది క్రమంగా నర్వ్ నష్టాన్ని తగ్గించి, రోగ నిరోధక శ్రేణి మెరుగుపరుస్తుంది. ఈ మందును ఆరు నెలలు వాడితే, మెదడులో రక్తం గడ్డకట్టుకోవడం కారణంగా సంభవించే పలు రకాల అంగవైకల్యాల నుంచి బయటపడే అవకాశాలు 31శాతం పెరిగాయని నూతన అధ్యయనాలు పేర్కొంటున్నాయి. స్టెమ్ సెల్ థెరపీ (ఎస్‌సిటి)తో ఎన్నో రకాల వ్యాధులకు చికిత్స చేస్తున్నారు. రోగులకు దీర్ఘకాల ఉపశమనం, మెరుగైన జీవనాన్ని అందించడం ఇప్పుడు సాధ్యమవుతున్నది. కృత్రిమ మేధస్సు (ఎఐ) సాయంతో రోగుల డేటా విశ్లేషణ ద్వారా వ్యాధి క్రమాన్ని అంచనా వేసి, వ్యక్తిగత చికిత్స పథకాలు సృష్టించడం లో సహాయపడుతుంది. పేరుతో తగ్గింపు ప్రమాదాలతో ఫలితాల మెరుగుదల సాధించడం జరుగుతున్నది. మొత్తం మీద వైద్య రంగంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు, సరికొత్త ప్రయోగాలు, ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయి.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

# రీల్

## అలాంటి చిత్రాలు అరుదుగా వస్తాయి

### కుశేందర్ రమేష్ రెడ్డి



పొలిమేర, రజాకార్ వంటి చిత్రాలతో జాతీయ స్థాయిలో కెమెరామెన్‌గా కుశేందర్ రమేష్ రెడ్డికి గుర్తింపు వచ్చింది. ఆయన సినిమాటోగ్రఫర్‌గా పని చేసిన 'త్రిబాణధారి బార్బరిక్' చిత్రం ఆగస్ట్ 29న రాబోతోంది. ఈ క్రమంలో కుశేందర్ రమేష్ రెడ్డి ఈ మూవీకి సంబంధించిన విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

'రజాకార్' చివరి షెడ్యూల్‌లో ఉన్నప్పుడు దర్శకుడు మోహన్ ఈ కథ గురించి చెప్పారు. కథ కథ విన్న తరువాత నా సలహాలు, సూచనలు చెప్పాను. ఎలాంటి కలర్ గ్రేడింగ్, ప్యాటర్న్ వాడితే బాగుంటుందనే రిఫరెన్సులు కూడా ఇచ్చాను. అవన్నీ కూడా మారుతికి చాలా నచ్చాయి. దీంతో దర్శకుడు మోహన్, నిర్మాత విజయ్, నేను కలిసి ఈ ప్రాజెక్ట్‌ని మొదలు పెట్టాం.

'త్రిబాణధారి బార్బరిక్' మూవీ ఎక్కువగా రాత్రి పూట, రెయిన్ ఎఫెక్ట్స్‌లోనే షూటింగ్ చేశాం. వేసవి కాలంలో రెయిన్ సీజన్ ఎఫెక్ట్‌ను చూపించడం అంత సులభం కాదు. అదే మాకు పెద్ద ఛాలెంజింగ్. ఎండాకాలంలో వానాకాలాన్ని సృష్టించేందుకు చాలా కష్టపడాల్సి వచ్చింది. ఈ విషయంలో మాత్రం నిర్మాత విజయ్ డేరింగ్ స్టెప్ తీసుకున్నారు. కథ కోసం ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. మొదటి సినిమా అయినా కూడా కథ మీద నమ్మకంతో ఆయన భారీ బడ్జెట్‌ను పెట్టారు.

'త్రిబాణధారి బార్బరిక్' సినిమాలో ప్రతీ పాత్రకు ఓ ప్రత్యేకత ఉంటుంది. ఒక్కో పాత్రకు సపరేట్ కలర్ గ్రేడింగ్ వాడాము. ఒక్కో పాత్ర రూపాంతరం చెందుతున్న తీరుకి తగ్గట్టుగా కలర్ గ్రేడింగ్ మారుతుంది. ఇక రెయిన్ ఎఫెక్ట్ సీన్లను చూస్తే ఎంతో సహజంగా అనిపిస్తాయి. 'తుంబాడ్', '2018' చిత్రాలకు ఏ మాత్రం తగ్గకుండా ఎంతో నేచురల్‌గా కనిపిస్తుంది.

'త్రిబాణధారి బార్బరిక్' మూవీకి ప్రధాన బలం కథ. స్క్రిప్ట్ విన్నప్పుడే ఈ మూవీని చేయాలని ఫిక్స్ అయ్యాను. 'పొలిమేర', 'రజాకార్' కథలు విన్నప్పుడు ఎలాంటి ఫీలింగ్ కలిగిందో.. ఈ మూవీ కథను విన్నప్పుడు కూడా అలాంటి ఫీలింగే కలిగింది. క్లైమాక్స్‌ని ఎవ్వరూ ఊహించలేరు.

ఈ చిత్రంలో ఉదయ భాను పాత్ర చాలా పవర్ ఫుల్‌గా ఉంటుంది. చాలా ఏళ్ల తరువాత మళ్లీ ఉదయ భాను ఓ అద్భుతమైన పాత్రలో రాబోతోన్నారు. మలయాళంలో కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాలు వస్తాయని చెబుతుంటాం. కానీ తెలుగులోనూ కంటెంట్ బేస్డ్ చిత్రాలు వస్తున్నాయని నిరూపించేందుకు 'త్రిబాణధారి బార్బరిక్' అనే మూవీ వస్తోంది.

ప్రస్తుతం అల్లరి నరేష్ తో '12ఏ రైల్వే కాలనీ' మూవీని చేశాను. త్వరలోనే అది రిలీజ్ కాబోతోంది. 'పొలిమేర 3'త్వరలోనే స్టార్ట్ అవుతుంది. పొలిమేర దర్శకుడు అనిల్ తో కంటిన్యూగా ప్రాజెక్ట్‌లు ఉంటాయి. ఇక రీసెంట్‌గానే 'కామాఖ్య' చిత్రీకరణ ప్రారంభించాం.

## 30న దుబాయ్‌లో 'గామా' అవార్డ్స



ప్రతిష్టాత్మమైన గామా (Gulf Academy Movie Awards) అవార్డ్స్‌కు టాలీవుడ్‌లో స్పెషల్ క్రేజ్ ఉంది. దుబాయ్‌లో ఇప్పటికే నాలుగు ఎడిషన్లు అంగరంగ వైభవంగా జరిగాయి. ఇప్పుడు 5వ ఎడిషన్ వేడుకలు ఆగస్ట్ 30న దుబాయ్‌లోని షార్జా ఎక్స్‌పో సెంటర్లో జరగనుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో కర్టెన్ రైజర్ ఈవెంట్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గామా సీఈవో సౌరబ్ కేసరి, వైభవ్ జ్యువెలర్స్ ఎండి రాఘవ్, జ్యూరీ సభ్యులు, ప్రముఖ దర్శకులు ఏ.కోదండరామిరెడ్డి, బి.గోపాల్, హీరోయిన్స్ ఫరియా అబ్దుల్లా, మానస వారణాసి, దక్షా నాగర్కర్, నటుడు వైవా హర్ష పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గామా సీఈవో సౌరబ్ కేసరి మాట్లాడుతూ దుబాయ్‌లో ఉన్న తెలుగు వారితో పాటు ప్రపంచంలోని తెలుగు వారందరినీ అబ్బురపరిచేలా ఈవెంట్ నిర్వహించబోతున్నాం. మా జ్యూరీ సభ్యుల సహకారంతో అవార్డు విజేతలను ఎంపిక చేశాం' అని అన్నారు.

జ్యూరీ సభ్యులు, ప్రముఖ దర్శకులు ఏ కోదండ రామిరెడ్డి మాట్లాడుతూ.. 'ఈ అవార్డ్స్‌లో భాగమైనందుకు చాలా సంతోషంగా ఉంది. నేను, బి గోపాల్, కోటి సహా పలువురు ప్రముఖులు కూడా జ్యూరీ సభ్యులుగా వ్యవహరిస్తున్నాం. ఇలాంటి అవార్డ్స్ నటీనటులకు మల్టీ విటమిన్ టాబ్లెట్స్ లాంటివి. ప్రతి ఒక్కరినీ ఎంకరేజ్ చేసేలా ఉంటాయి. ఆగస్టు 30న దుబాయ్‌లో జరగనున్న ఈ గామా అవార్డ్స్ విజయవంతం అవ్వాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

జ్యూరీ సభ్యులు, ప్రముఖ దర్శకులు బి.గోపాల్ మాట్లాడుతూ.. 'గామా అవార్డ్స్ చైర్మన్ త్రిమూర్తులు ఈ అవార్డ్ ఫంక్షన్ ను ప్రతి ఏడాది చాలా గ్రాండ్‌గా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా అంతకుమించేలా సౌరబ్ కేసరి అన్ని ఏర్పాట్లు చేశారు. అతిరథ మహారథుల సమక్షంలో హీరోయిన్స్ అద్భుతమైన పర్ఫార్మెన్స్ లతో ఈ ఈవెంట్ జరగనుంది' అని చెప్పారు.

ఈ కార్యక్రమానికి టాలీవుడ్ హీరోలు సిద్ధు జొన్నలగడ్డ, తేజ సజ్జ, కిరణ్ అబ్బవరం, శ్రీ విష్ణు, రోషన్.. హీరోయిన్స్ మీనాక్షి చౌదరి, దక్ష నాగర్కర్ పాల్గొంటున్నారు. హీరోయిన్స్ ఊర్వశి రౌతేలా, కేతిక శర్మ, ఫరియా అబ్దుల్లా, ప్రియా హెగ్డే, శ్రీదేవి స్పెషల్ పర్ఫార్మెన్స్ లతో అలరించనున్నారు. ప్రత్యేక అతిథులుగా బ్రహ్మానందం, దర్శకులు సుకుమార్, బుచ్చిబాబు, బాబీ, సాయి రాజేష్, సంగీత దర్శకులు దేవిశ్రీ ప్రసాద్, నిర్మాతలు అశ్విని దత్, డివివి దానయ్య, చంద్ర బోస్, వెన్నెల కిషోర్ తదితర ప్రముఖులు హాజరవనున్నారు.

## నేను రెడీ

### కావ్య థాపర్




నువ్విలా, జీనియస్, రామ్ లీలా, సెవెన్ వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ టాలెంటెడ్ హీరో హవీష్, సినిమా చూపిస్త మావ, నేను లోకల్, ధమాకా, మజాక వంటి సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు నక్కిన త్రినాథరావు కాంబోలో రూపొందుతున్న క్రేజీ మూవీ 'నేను రెడీ'. ఈ చిత్రాన్ని హార్నిక్స్ ఇండియా ఎల్ ఎల్ పి బ్యానర్ పై నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. కావ్య థాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది. బ్రిలియంట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న 'నేను రెడీ' మూవీ నుంచి ఇటీవల రిలీజ్ చేసిన హీరోయిన్ కావ్య థాపర్ పోస్టర్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రంలో ఆమె క్యారెక్టర్ ప్రేక్షకుల్ని ఆకట్టుకోనుంది. 'నేను రెడీ' మూవీ తన కెరీర్‌లో ది బెస్ట్‌గా నిలుస్తుందని ఆశిస్తోంది కావ్య థాపర్. ప్రస్తుతం 'నేను రెడీ' సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఇటీవల రిలీజ్ చేసిన 'నేను రెడీ' టైటిల్ గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన వచ్చింది.

## 27న 'సువ్వి సువ్వి' పాట ఆవిష్కరణ




పవన్ కళ్యాణ్ హీరోగా ప్రియాంకా మోహన్ హీరోయిన్‌గా సుజిత్ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం ఓజీ. ఈ చిత్రంలోని సువ్వి సువ్వి అనే పాటను ఈనెల 27వ తేదీన వ ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. ఇప్పటికీ విడుదల అయిన టైటిల్ సాంగ్ కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ చిత్రానికి సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసి సెప్టెంబర్ 25న సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. డివివి మూవీస్ బ్యానర్ పై దానయ్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.




## 26న ఏం జరుగుతోంది పాట విడుదల

నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. ఈ సినిమాలోని 'ఏం జరుగుతోంది లిరికల్ సాంగ్‌ను 26న విడుదల చేయబోతున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. ఈ పాటకు రాకేందు మౌళి సాహిత్యాన్ని అందించగా, చిన్మయి పాడారు. ఫీల్ గుడ్ లవ్ సాంగ్‌గా 'ఏం జరుగుతోంది' రూపొందించారు.

## 'మకుటం' టీజర్ విడుదల



తమిళ హీరో విశాల్ ప్రస్తుతం 35వ సినిమా చేస్తున్నారు. సూపర్ గుడ్ ఫిలమ్స్ బ్యానర్ మీద ఆర్ బి చౌదరి 99వ చిత్రానికి రవి అరసు దర్శకత్వం వహించనున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన టైటిల్ టీజర్‌ను రిలీజ్ చేశారు. ఇంత వరకు విశాల్ 35 అంటూ ఈ ప్రాజెక్ట్‌కు వర్కింగ్ టైటిల్ పెట్టారు. ఈ ప్రాజెక్ట్ టైటిల్‌ను రివీల్ చేస్తూ టీజర్‌ను విడుదల చేశారు. విశాల్, అంజలి, దుషార విజయన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి 'మకుటం' అనే టైటిల్‌ను పెట్టారు. ఇది సముద్రం నేపథ్యంలో నడిచే ఓ మాఫియా కథ అని అర్థం అవుతోంది. సముద్రం లోపలి జీవరాశుల్ని చూపిస్తూ.. చివరగా విశాల్‌ను బ్యాక్ సైడ్ నుంచి చూపించారు. 'మకుటం' చిత్రంలో విశాల్‌ను సరికొత్తగా చూపించబోతోన్నారని అర్థం అవుతోంది.



## వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో బాలకృష్ణకు చోటు

తెలుగు తెరపై యాభై ఏళ్ళుగా హీరోగా కొనసాగుతున్న నందమూరి బాలకృష్ణ పేరును వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ చేశారు. ఇప్పుడు బాలక్రిష్ణ పేరు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చేరింది. ఈ గౌరవాన్ని నిర్వాహకులు త్వరలోనే బాలక్రిష్ణకు అందజేయనున్నారు. భారతీయ సినిమాలో అత్యంత ఘనమైన ఆయన వారసత్వం ఇప్పుడు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోని గోల్డ్ ఎడిషన్‌లో నమోదు అవుతుంది. ఈ ప్రత్యేక గుర్తింపు బాలకృష్ణ అపూర్వమైన సినిమా జైత్రయాత్రకి అత్యంత గౌరవప్రదమైన ఘనతగా నిలుస్తుంది యాభై సంవత్సరాలు హీరోగా కొనసాగడం అనేది కెరీర్‌లో అద్భుతమైన మైలురాయి. టాలీవుడ్‌లో తన ఆల్ రౌండర్ ప్రతిభతో, శక్తివంతమైన స్క్రీన్ ప్రెజెన్స్ కళపట్ల నిబద్ధతతో తనదైన గుర్తింపును సాధించుకున్నారు. ఆయన ప్రయాణం ఉత్సాహం, క్రమశిక్షణ శాశ్వత కళాత్మకతకు సాక్ష్యం, ఇది అన్నితరాల సినిమా ప్రేమికులను వారికి అభిమాన పాత్రులను చేసింది. బాలకృష్ణ హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో అద్భుతమైన హ్యాట్రిక్ విజయాన్ని సాధించి చరిత్ర సృష్టించారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికారడ్స్ సిఇఓ సంతోష్ శుక్లా జారీ చేసిన అధికారిక ప్రశంసా పత్రంలో బాలకృష్ణ ఐదు దశాబ్దాల సినిమా సేవలను మిలియన్ల మందికి స్ఫూర్తిగా ప్రశంసించారు. బాలకృష్ణ గత 15 సంవత్సరాలుగా, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్‌గా, ఆయన పబ్లిక్ సర్వీస్‌ను ఒక మిషన్‌గా నిరూపించారు. భారతీయ సినిమాలో హీరోగా ఆయన అసాధారణ సేవలకు గుర్తింపుగా.. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, యూకే గోల్డ్ ఎడిషన్‌లో బాలకృష్ణ చేరికను ఘనమైన గుర్తింపుగా ఆగస్టు 30వ తేదీన హైదరాబాదులో స్వయంగా బాలకృష్ణకి అందిస్తున్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## వెలగపూడి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/మధిర రూరల్ :** సీనియర్ నాయకుడు, మాజీ మార్క్ఫెడ్ చైర్మన్ వెలగపూడి శివరాంప్రసాద్ ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. ఆదివారం ఆయన స్వగ్రామమైన సిరిపురంలోని ఆయన కుటుంబాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తన రాజకీయ జీవితంతో తన వెంట ప్రధానంగా నడిచిన వ్యక్తిగా వెలగపూడి శివరాంప్రసాద్ చేసిన సేవలను కొనియాడారు. శివరాంప్రసాద్ మృతి వారి అనుచరులకు తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొండితోక సుధాకర్, చెరుకూరి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన బాలికపై సామూహిక అత్యాచారం
### చర్లలో దారుణానికి ఒడిగట్టిన ఆటో డ్రైవర్లు

**ప్రజాపక్షం/ఖమ్మం :** గిరిజన బాలికపై అత్యంత పాశవికంగా అత్యాచారానికి పాల్పడిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి నిందితుల కోసం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. ఈ ఘటన వివరాల్లోకి వెళితే... ఛత్తీస్‌ఘఢ్‌కు చెందిన గిరిజన బాలిక ములుగు జిల్లా వాజేడు వెళ్లేందుకు భద్రాద్రి కొత్తగూడెంజిల్లా చర్లకు చేరుకుంది. చర్ల నుంచి వాజేడు వెళ్లేందుకు ఆటో ఎక్కింది. గిరిజన బాలికపై కన్నేసిన ఆటో డ్రైవర్లు ఆమెకు కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి ఇచ్చారు. ఆమెపై అత్యాచారం చేసిన అనంతరం పాల్వంచ సమీపంలోని పెద్దమ్మగుడి జగన్నాథపురం గ్రామాల మధ్య రోడ్డు పక్కన వదిలేసి వెళ్లారు. స్థానికులు గాయాలతో ఉన్న ఆమెను చూసి బాలికా సంరక్షణ కేంద్రానికి సమాచారమిచ్చారు. అధికారులు వెంటనే స్పందించి ఆమెను బాలికా సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఆమె శరీరంపై తీవ్రమైన గాయాలు ఉన్నాయి. బాలిక శరీరంపై ఉన్న గాయాలను చూసి స్థానికులు, పోలీసులు చలించిపోయారు. ఈ అమానవీయ ఘటనపై భద్రాద్రి పోలీసులు వెంటనే స్పందించారు. విషయం తెలిసిన వెంటనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్‌పి రోహిత్‌రాజ్ చర్ల, పాల్వంచ, దుమ్ముగూడెం పోలీసులతో కలిసి ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం దర్యాప్తు చేస్తున్నాయి. ఈ అత్యాచార ఘటన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తీవ్ర కలకలాన్ని రేపింది.

## స్వరసుధ మాధవరావుకు కళానిధి పురస్కారం



**ప్రజాపక్షం/ఖమ్మం :** స్వరసుధ మ్యూజిక్ యూనిట్ అధ్యక్షుడు, సంగీత దర్శకుడు కొమర్రాజు మాధవ రావు కళానిధి పురస్కారం దక్కింది. ఆదివారం భీమారం ఆగస్త్య బ్రాహ్మణ భవనంలో వరంగల్ బ్రాహ్మణ ప్రొఫెషనల్స్ అఫీషియల్స్ ఆధ్వర్యంలో కళానిధి బిరుదును మాధవరావుకు ప్రదానం చేసి, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రొ.మాడ భూషణం, రాజగోపాలాచార్య, మనోహర్‌రావు, పాలకుర్తి దినకర్, రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవరావును పలువురు అభినందించారు.

## యూరియా కొరతను తీర్చండి
### నేడు రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** యూరియా కొరతను నివారించి రైతులకు సకాలంలో అందించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల ముందు సోమవారం ఆందోళన నిర్వహించనున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావులు తెలిపారు. సకాలంలో యూరియా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని రానున్న కొద్ది రోజుల్లో కొరత మరింత పెరిగే అవకాశం ఉందని రమేష్, గోవిందరావులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్ష ప్రదర్శిస్తుందని అందులో భాగంగానే యూరియా కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం యూరియా కొరతను నివారించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



## నడక వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నడక ఆరోగ్యానికి అన్ని విధాలా మేలు చేస్తుందని పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ సభ్యులు ఆదివారం తెలిపారు. ఉదయం నడక ఆరోగ్యానికి అన్ని విధాలా మేలు చేస్తుందని గుండె జబ్బులు, అధిక రక్త పోటు, మధుమేహం వంటి అనారోగ్య సమస్యలను నివారించవచ్చునన్నారు. యోగా, నడక ఎంతో ప్రయోజనకరమన్నారు. నడక వల్ల ఎముకలు, కండరాలు బలోపేతం కావడంతో పాటు బరువు తగ్గడానికి కూడా ఉపయోగ పడుతుందన్నారు.నడక అనేది సులభంగా చేయగల వ్యాయామం అన్నారు. ప్రతి ఒక్కరూ ఉదయం, సాయంత్రం నడక సాధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెవిలియన్ గ్రౌండ్ సీనియర్ నడక సాధకులు మందా వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, గంగవరపు వీరభద్రం, పాటి శ్రీనివాస్, రవి, తాళ్లూరి సత్యనారాయణ, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాలు - ఉపాధి మార్గాలపై సెమినార్

**ప్రజాపక్షం/పాల్వంచ :** పారిశ్రామికీకరణ వల్ల ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అసిస్టెంట్ ప్రొఫెసర్ వేముల కామేశ్వరరావు, సింగరేణి మాజీ జీఎం శనగ వెంకటేశ్వర్లు అన్నారు. పాల్వంచ కొమరం భీమ్ హాల్‌లో బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉద్యోగాలు, ఉపాధి మార్గాలపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశ్రామిక విధానం 1948, 1956, 1981వరకు జరిగిన పరిణామాలను వివరించారు. ప్రస్తుతం సరళీకరణ, ప్రవేటీకరణ, గ్లోబలైజేషన్‌లపై సమగ్రంగా వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పరిశ్రమలను నెలకొల్పకపోవటం వలన జరిగే నష్టాలను తెలిపారు. ప్రవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంలో పరిశ్రమలను స్థాపించడం వల్ల జరిగిన గ్లోబలైజేషన్‌లో జరిగే లాభనష్టాలను విపులంగా వివరించారు. ప్రస్తుతం కొత్త పరిశ్రమలను నెలకొల్పకపోవటం వలన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండాపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనితో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. పరిశ్రమల్లో ప్రైవేటు భాగస్వామ్యాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన ఐక్య వేదిక నాయకులు శ్రీపాద సత్యనారాయణ, బరగడి దేవదానం, శనగ రాంచందర్‌రావు, మల్లెల రామనాథం, రేగళ్ళ శ్రీను, మంజూర్, హుస్సేన్, రషీద్, బుడగం నాగేశ్వర రావు, సుగుణాకరరావు, రెంటాల లక్ష్మణ్, నిమ్మల రాంబాబు, దాసరి రమేష్, సత్యనారాయణ, పూనేం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సురవరం ఓ విప్లవోద్యమ జ్ఞాపిక
### సిపిఐ మాజీ ఎమ్మెల్సీ పువ్వాడ నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఓ తరం విప్లవోద్యమ జ్ఞాపిక సురవరం సుధాకర్‌రెడ్డి అని ఆయన మరణంతో మార్క్సిస్టు మేధావిని కోల్పోయామని సిపిఐ సీనియర్ నాయకుడు, మాజీ శాసనసభ, శాసన మండలి సభ్యుడు పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు. సురవరం మృతిపట్ల పువ్వాడ నాగేశ్వర రావు తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విద్యార్థి దశ నుంచే సురవరంతో కలిసి పనిచేశానని ఆ తర్వాత ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర బాధ్యతలను సుధాకర్ రెడ్డి స్వీకరించారని పువ్వాడ తెలిపారు. ఆరు దశాబ్దాల పాటు కలిసి పనిచేశామని, తన జీవితాన్ని పోరాట చరిత్రగా మార్చుకున్న ఘనుడు ఆయన అని పువ్వాడ తెలిపారు. విషయ పరిజ్ఞానం సురవరానికి ఎక్కువని, గొప్ప వక్త, సమకాలిన రాజకీయాలలో తనదైన పంథాతో పనిచేసిన సురవరం నేటి తరానికి మార్గదర్శి అన్నారు. సురవరం ఆశయాలను, ఆకాంక్షలను నేటి తరం ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే సరైన నివాళి అన్నారు.

**పేద ప్రజల యుగస్వరం సురవరం**
**-సంతాప సభలో జితేందర్‌రెడ్డి**

దేశ వ్యాప్తంగా పేద, కార్మిక వర్గాల గొంతుకగా చట్టసభలలో, బయట తన గళాన్ని, వాణిని వినిపించిన సురవరం సుధాకర్‌రెడ్డి ప్రజల యుగస్వరమని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. బాల్యంలోనే తిరుగుబాటు పంథాను అవలంభించిన సుధాకర్‌రెడ్డి కడవరకు అదే పంథాను కొనసాగించారని ఆయన తెలిపారు. శుక్రవారం మరణించిన సిపిఐ జాతీయ నాయకుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు సురవరం సుధాకర్‌రెడ్డి సంతాపసభ సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సురవరం చిత్రపటానికి సిపిఐ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మార్క్సిస్టు మేధావిగా పేరుగడించిన ఆయన తుదిశ్వాస వరకు కమ్యూనిస్టుల ఐక్యత కోసం పరితపించారని జితేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, పుచ్చకాయల కమలాకర్, వై.సాంబశివరెడ్డి, కూచిపూడి రవి, జిల్లా సమితి సభ్యులు నూనె శశిధర్, వరదా నర్సింహారావు, ఎస్‌కె.సైదా తదితరులు పాల్గొన్నారు.






**ప్రజా ఉద్యమాలకు తీరని లోటు**

**ఖమ్మం అర్బన్ :** కమ్యూనిస్టు యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల మల్లేష్ తెలిపారు. శుక్రవారం మృతి చెందిన సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి సంతాప సభ ఆదివారం సిపిఐ వన్‌టౌన్ శాఖ ఆధ్వర్యంలో ముస్తఫానగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పగడాల మల్లేష్‌తో పాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ కార్యదర్శి వరదా నర్సింహారావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు మాల కొండయ్య, మాడుగుల నాగేశ్వరరావు, ఎస్‌కె.యాకూబ్, డివిజన్ల శాఖ కార్యదర్శులు జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, కారం సామెలు, వై.నాగరాజు, కాట్ల నర్సింహారావు, శీలం నాగేశ్వరరావు, రోశయ్య, గూడూరు వెంకటేశ్వర్లు, నారపోగు నాగమణి, సహదేవ్, మద్దెల శ్రీరాం దుర్గ , చిన్న లింగయ్య, పెద్ద లింగయ్య పాల్గొన్నారు.



**పార్థివదేహానికి నివాళులు**

**ఇల్లందు :** సిపిఐ మాజీ కేంద్ర కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డి పార్థివ దేహాన్ని హైదరాబాద్‌లోని మగ్దూం భవన్‌లో ఆదివారం సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు దేవరకొండ శంకర్, జిల్లా నాయకులు మంచాల వెంకటేశ్వర్లు పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సురవరం సుధాకర్ రెడ్డి మృతి సిపిఐ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుగులోతు కృష్ణ, దాసు, అనిల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## క్రీడా ప్రాంగణం గేటు తెరిపించాలి
### తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు

**ప్రజాపక్షం/చింతకాని :** గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. అవి కొన్ని గ్రామానికి దూరంగా ఉండటం, మరికొన్ని గ్రామల్లో స్థలాల్లో పాఠశాల ఆవరణల్లో నిర్మించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా ప్రాంగణాల్లో క్రీడాకారులు ఆదివారం వచ్చిందంటే చాలు ఆటల్లో మునిగి తెలుతుంటారు. చింతకాని మండలం, కొదుమూరు క్రీడా ప్రాంగణం సెలవు దినాల్లో చుట్టుపక్కల ఏడు గ్రామాల యువకులతో కోలాహలంగా మారుతుంది. గత రెండు నెలల క్రితం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బదిలీ కావడం, నూతన ప్రధానోపాధ్యాయుడు రావడం క్రీడాకారులకు శాపంగా మారింది. సెలవు దినాల్లో పాఠశాల గేటు తాళం తీయవద్దని వాచ్‌మెన్‌కు హుకుంజారీ చేశారు. దీంతో క్రీడా ప్రాంగణానికి వచ్చిన క్రీడాకారులకు నిరాశ ఎదురవుతుంది. కొంత మంది గేటు దూరి ఆటలాడుకుంటున్నప్పటికీ గేటు ఎక్కే క్రమంలో గాయాలపాలవుతున్నారు. దీంతో క్రీడాకారులు పంచాయతీ కార్యదర్శికి సమస్యను వివరించినప్పటికీ సమస్య పరిష్కారం కావడంలేదని క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం క్రీడాకారులు ఉమర్‌పాషా, రాంబాబు, సింగారపు కోటి, పయ్యావుల అశోక్, మురళీ, హరీష్, నాగరాజు, సేలం రమేష్, అమర్లపుడి అశోక్, కొత్త శేషుబాబు క్రీడా ప్రాంగణం గేటు తెరవాలని ఆందోళన నిర్వహించారు.

**క్రీడా ప్రాంగణం తెరిచి ఉంచాలి**
**- అబ్బూరి మహేష్ (సిపిఐ మండల సహాయ కార్యదర్శి)**

పల్లెల్లో ప్రభుత్వ స్థలాలు లేక పాఠశాల ఆవరణలో క్రీడాకారులు కోసం ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుచేసింది. ప్రధానోపాధ్యాయుడు పాఠశాల గేటువేయటం సరికాదు. సెలవు దినాల్లో పాఠశాల గేటు తెరిచి ఉంచాలి లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.



## మట్టి గణపతే మేలు
### ఎమ్మెల్యే డా.తెల్లం

**ప్రజాపక్షం/భద్రాచలం :** మట్టి గణపతే మేలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలతో పర్యావరణానికి పెను ప్రమాదం పొంచి ఉందని ఎంఎల్‌ఎ డా.తెల్లం వెంకట్రావు అన్నారు. ఆదివారం భద్రాచలం కుమ్మరి సంఘం, శ్రీ మొల్ల స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులతో కలిసి ఆయన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ భావితరాల వారికి మేలు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమలో గంగాధర వీరయ్య, విజ్జగిరి రాజా కిరణ్, గంగాధర సతీష్, సద్దనపు సత్యనారాయణ, వినరేష్, జల్లారపు సునీల్, సగ్గెం లక్ష్మణరావు, రెల్లి తాతారావు, కొలిచలం నవీన్, విజ్జగిరి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు
### చేసిన అభివృద్ధి పది కాలాల పాటు నిలవాలి
### సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన
### ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. చేసిన అభివృద్ధి పది కాలాల పాటు నిలవాలని మంత్రి తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ఖమ్మం నగరంలోని 57వ డివిజన్ రమణగుట్ట ప్రాంతంలో రూ.2.36కోట్లతో నిర్మించనున్న సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ 57వ డివిజన్ ప్రాంతంలో పేదలు ఎక్కువగా ఉన్నారని స్థానిక నాయకులు కోరిన మీదట ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను అధికంగా ఇక్కడ కేటాయించడం జరిగిందన్నారు. ఖమ్మం నగరంలో రెండువేల ఇండ్లు మంజూరు చేస్తే ఒక్క 57వ డివిజన్ పరిధిలోనే 200 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామన్నారు. అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. పేదలకు ఇండ్ల పట్టాల పంపిణీకి సాధ్యమైనంత మేర కృషి చేస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించడమే తన లక్ష్యమన్నారు. ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నగరంగా తీర్చిదిద్దనున్నట్లు ఆయన తెలిపారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను త్వరగా నిర్మించుకునేలా చూడాలన్నారు. డివిజన్లలో చేపట్టిన సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తి చేయాలని, పాఠశాల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు, ముఖ్యమంత్రి సహాయ నిధి, కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, రేషన్ కార్డులు వంటి సంక్షేమ పథకాలను పేదల ఇంటి వద్దకు వెళ్లి అందించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకు గ్యాస్ సిలెండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న బియ్యం సరఫరా, రేషన్ కార్డులను ప్రభుత్వం జారీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఆర్డీవో నర్సింహారావు, మున్సిపల్ ఇఇ రంజిత్, అర్బన్ తహసీల్దార్ సైదులు, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ రఫీదా బేగం, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.





# రైస్‌మిల్ ఓనర్ రాయబా(బే)రాలు
### ఓ నిర్వాసితుడిని పిలిపించి తనకు సపోర్టుగా ఉండాలని బుజ్జగింపు
### ప్రెస్‌మీట్ పెడతా రైస్‌మిల్ సమస్య అవాస్తవమని చెప్పండని ప్రలోభాలు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల ఓ రైస్‌మిల్‌పై ప్రజాపక్షం వరుస కథనాలు ప్రచురిస్తున్న విషయం పాఠకులకు విధితమే..ఆ రైస్ మిల్‌తో పరిసర ప్రాంతాల నిర్వాసితులు పడుతున్న సమస్యలపై వారి గొంతుకగా అక్షరమే ఆయుధంగా అండగా నిలబడింది. ఈ నేపథ్యంలో రైస్‌మిల్ సాక్షిగా సాగుతున్న అవకతవకలను వెలుగులోకి తీసుకువచ్చింది. ఇవి ప్రజలలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దీంతో సదరు రైస్‌మిల్ నిర్వాహకుడు కట్టు కథలుగా చిత్రీకరించేందుకు పావులు కదిపాడు. ఇందు కోసం కొందరు రాజకీయ బ్రోకర్లతో నిర్వాసితుల సమస్యను పక్కదారిపట్టించేలా? ఆరోపణలకు తెరలేపాడు. ఇవి ప్రజాక్షేత్రంలో ఆధారాలతో సహా నిరూపితమవ్వడంతో కుట్ర బెడిసికొట్టింది. నానాటికి ఇటు ప్రజలలో అటు అధికారులలో పలుచనవుతుండటంతో కొత్త పథకాన్ని రచించాడు. ఈసారి ఏకంగా నిర్వాసితుడిని తన రైస్ మిల్లులోకి పిలిపించుకొని తనకు సపోర్టుగా ఉండాలని బుజ్జగించాడు. రైస్‌మిల్‌తోటి సమస్య అవాస్తవమని, ప్రెస్‌మీట్ పెడతాను మీరంతా నాకు అండగా నిలవాలని కోరాడు. అనారోగ్య సమస్యలు ఉంటే వైద్యానికి డబ్బులు సైతం ఇస్తానని డబ్బు ఆశ చూపే ప్రయత్నం చేశాడు. అంతే కాకుండా ఇక రైస్‌మిల్ సమస్య ఉండదని ఫంక్షన్‌హాల్ కట్టుకుంటున్నానని, మీకు అండగా ఉంటానని తీయ్యని మాటలు వల్లే వేయసాగాడు.




దీనిపై సదరు నిర్వాసితుడు సమస్య ఉందని పత్రిక దృష్టికి తామే చెప్పామని బదులిచ్చాడు. ఇప్పుడు సమస్య లేదని తామేలా? చెబుతామంటూ.. ఎదురు ప్రశ్నించడంతో ఆలోచించుకోమని చెప్పినట్టు తెలిసింది.

**కొసమెరుపు...** సదరు రైస్‌మిల్ ద్వారా నిర్వాసితులకు ఎటువంటి సమస్య లేదు. వాణిజ్య పన్నుకు బదులు నివాస పన్ను కడుతుండటం తప్పుడు ఆరోపణ. అసలు తన రైస్‌మిల్ మూడు నెలల నుండి నడవడం లేదు. 30సంవత్సరాలుగా లేని సమస్య ఇప్పుడే ఎందుకు?. ఇవన్నీ సదరు రైస్‌మిల్ నిర్వాహకుడు చేసుకుంటున్న ప్రచారం..మరి అలాంటప్పుడు వార్తలు అవాస్తవమని చెప్పాలని నిర్వాసితుడిని పిలిచి రాయబేరాలు చేయాల్సిన అవసరమైతే లేదు. ఈ తీరును బట్టి రైస్‌మిల్ నిర్వాహకుడి వ్యవహారం ఏమిటనేది ప్రజలకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని స్పష్టం అవుతుంది.

# కోయతూర్ సంస్కృతి, సాంప్రదాయ పండుగ

**ప్రజాపక్షం/కరకగూడెం :** కరకగూడెం మండలం రఘునాథపాలెం గ్రామంలో ఆదిమూలవాసులైన పూర్వ పెద్దల ఆనవాయితీ ప్రకారం, కోయ ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయ ప్రతిబింబంగా ఆదివారం మగ మొదటి పాదం సందర్భంగా ప్రత్యేక పండుగ సామే కొత్తల (పొట్ట పండుగ)ను పోలెబోయిన, పులి వంశం వారు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సమ్మక్క (ముసలమ్మ) ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించగా, సంప్రదాయ నృత్యాలు, గట్టు గోత్రాల ఆచారాలు, తాళమేళ మద్దెలతో కూడిన కోయతూర్ సంప్రదాయ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ప్రకృతి సిద్ధమైన వరి, సామ కంకులతో జిబిలి నార తోరణాల అలంకరణ చేయగా, ఆలయం పండుగ వాతావరణంతో నిండిపోయింది. కోయ ఆదివాసీల జీవన విధానానికి మూలమైన ప్రకృతి పూజ, పంటల పట్ల కృతజ్ఞతా భావం, తల్లిదండ్రుల ఆశీర్వాదం, పెద్దల మార్గదర్శనం ఈ పండుగలో ప్రతిబింబించాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పోలెబోయిన బాబు, పోలెబోయిన వెంకటయ్య, పోలెబోయిన సత్యం, పోలెబోయిన లక్ష్మయ్య, పులి నారాయణ, పులి రామూర్తి, పోలెబోయిన సారయ్య, లక్ష్మయ్య, పులి రామకృష్ణ, సమ్మయ్య, గొంది బాలకృష్ణ, రవి, సోలం కృష్ణ పాల్గొన్నారు. యువత తరపున పోలెబోయిన రాంగోపాల్, పోలెబోయిన కార్తీక్, పోలెబోయిన రాజు, సిద్ధు, పేరంటాం పోలెబోయిన మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.







## భార్యపై మారణాయుధంతో దాడిచేసిన భర్త
### తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితిలోకి బాధితురాలు
### హుటాహుటిన ఆసుపత్రికి తరలించిన స్థానికులు
### సంఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ ఎస్సై

**ప్రజాపక్షం/మధిర :** కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యపై ఆగ్రహానికి గురైన భర్త మారణాయుధంతో ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మండల పరిధిలోని మాటూరు గ్రామం బిసి కాలనీలో జరిగింది. శనివారం అర్ధరాత్రి జరిగిన సంఘటన సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిల్ల సూర్యనారాయణ ప్రైవేట్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవన సాగిస్తున్నాడు. అరకొర ఆర్థిక సమస్యలు కుటుంబ భారంతో భార్యా భర్తల మధ్య నెలకొన్న మనస్పర్థల నేపథ్యంలో శనివారం డ్రైవర్ విధులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన భర్త సూర్యనాయణ(32) భార్య సాయినాగలక్ష్మి (26)తో చిన్న సమస్యపై ఘర్షణపడ్డారు. ఈ క్రమంలో తీవ్ర ఆగ్రహానికి గురైన సూర్యనారాయణ అందుబాటులో ఉన్న మారణాయుధంగా ఉన్నట్లు గుర్తించిన వస్తువుతో భార్యపై దాడికి దిగినట్లు, ఈ దాడిలో నాగలక్ష్మి మెడపై బలమైన గాట్లు పడి రక్తస్రావం కావడంతో బాధితురాలు కేకలు వేసుకుంటూ ఇంట్లో నుండి రోడ్డుపైకి వచ్చి కింద పడిపోవడంతో బయటికి వచ్చిన స్థానికులు 108 అంబులెన్స్ సహాయంతో ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. నాగలక్ష్మి మెడపై బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సంఘటన జరిగిన సమాచారాన్ని తెలుసుకున్న రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ నిర్వహించారు. స్థానికులతో ఆదివారం ఉదయం మరోసారి పరిశీలన సందర్భంగా విచారణ నిర్వహించి నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సూర్యనారాయణ దంపతులకు ఇద్దరు మగ పిల్లలు ఉండగా, ప్రస్తుతం నాగలక్ష్మి గర్భవతిగా ఉన్నట్లు సమాచారం. బాధితురాలు అమాయకురాలుగా అణుకువగా ఉంటుందని, సూర్యనారాయణ ఆమెపై గతంలో కూడా దాడి చేసి కొట్టినట్లు సమాచారం. అనంతరం గ్రామంలో ఈ సంఘటనపై పలు విధాలుగా చర్చించుకోవడం గమనార్హం.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## అక్రమంగా నిల్వ చేసిన యూరియా బస్తాలు సీజ్



**ప్రజాపక్షం/రాయపర్తి:** మండలంలోని తిర్మలాయపల్లి గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 26 యూరియా బస్తాలను ఏవో గుమ్మడి వీరభద్రం ఆదివారం సీజ్‌చేశారు. డైరెక్టర్ యాదగిరిపై భారత న్యాయ సంహిత సెక్షన్ 6ఏ ప్రకారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా అక్రమంగా యూరియాను నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కావ్య తదితరులు పాల్గొన్నారు.

## అజాతశత్రువు సురవరం

సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో నివాళులు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యుడు సురవరం సుధాకర్ రెడ్డి అకాల మరణం సిపిఐ, వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ కొనియాడారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని ఎఐటియుసి కొమురయ్య భవన్ లో సురవరం మృతికి సంతాపంగా సిపిఐ నాయకులు సురవరం చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా విప్లవ జోహార్లు నివాళులు అర్పించారు. అనంతరం రాజ్ కుమార్ మాట్లాడుతూ, పార్టీలో అంచలంచలుగా ఎదిగి అజాతశత్రువుగా పేరుగాంచిన గొప్ప నాయకుడని కొనియాడారు. 1942లో మహబూబ్ నగర్ జిల్లా కొండ్రావుపల్లిలో జన్మించిన సుధాకర్ రెడ్డి 1960 వచ్చేసరికి ఎఐఎస్ఎఫ్ విద్యార్థినేతగా ఎదిగి 1966 లో ప్రతి సంఘ జాతీయ కార్యదర్శిగా పని చేశారని 1972లో అఖిల భారత యువజన సంఘం జాతీయ కార్యదర్శిగా పనిచేశారని వారు గుర్తు చేశారు. రాజకీయాలలో అజాతశత్రువుగా పేరు తెచ్చుకున్న నిబద్ధత నిజాయితీ క్రమశిక్షణకు మారుపేరుగా పార్టీలో అంచలంచలుగా ఎదిగినారని తెలిపారు. తొలినాళ్ల నుండి చివరి వరకు కమ్యూనిస్టు పార్టీతోనే ఉంటూ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పని చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గురిజేపల్లి సుధాకర్ రెడ్డి, పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, జిల్లా నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

## సుధాకర్‌రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న తొర్రూరు సిపిఐ మండల నాయకులు



**ప్రజాపక్షం/ తొర్రూరు :** సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి అంతిమ యాత్రలో తొర్రూరు మండల నాయకులు,సిపిఐ సీనియర్ నాయకులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ముగ్దుంభవన్‌లో సురవరం సుధాకర్‌రెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తొర్రూరు సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో సురవరం సుధాకర్‌రెడ్డి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి సమాజంలో పేదలు, కార్మికులు, రైతులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించడంతో పాటు చట్టసభల్లో పోరాడారని అన్నారు. మాజీ మండల కార్యదర్శి గట్టు శ్రీమన్నారాయణ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి గణపురం లక్ష్మ ణ్, అమ్మాపురం గ్రామ శాఖ కార్యదర్శి బూరుగు యాదగిరి, రైతు సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సురవరం అంతిమయాత్రలో మానుకోట సిపిఐ నేతలు



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి దిగ్గజనేత మాజీ ఎంపిసురవరం సుధాకర్ రెడ్డి అంతిమయాత్ర కార్యక్రమంలో మహబూబాబాద్ సిపిఐ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూరవరం సుధాకర్ రెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సిపిఐ కార్యాలయం ముఖ్దూం భవన్ నుండి గాంధీ హాస్పిటల్ వరకు జరిగిన భారీ ర్యాలీలో పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి మాట్లాడుతూ దేశం గొప్ప నేతనుకోల్పోయిందని ఉన్నారు. ఈ అంతిమయాత్రలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

## గ్రామాల్లో ఏరులై పారుతున్న గుడుంబా



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీ దేవిపేట గ్రామంలో కొత్త రకమైన కెమికల్‌తో గుడుంబా తయారు చేస్తూ కుటుంబాలతో చెలగాటమాడుతున్నారు. గ్రామంలో ఏరులై పారుతున్న కొత్త రకమైన గుడుంబా రోజుల తరబడి భయంకరమైన కెమికల్‌తో గుడుంబా తయారు చేస్తున్న సంబంధిత ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని లక్ష్మీ దేవిపేట గ్రామస్తులు వాపోతున్నారు. ఆ గ్రామానికి చెందిన కొంతమంది కొన్ని రోజులుగా కెమికల్‌తో తయారవుతున్న గుడుంబాను తాగుతున్నారు. తాగిన వారు ప్రాణాలో కోల్పోయే అవకాశాలు ఉంటాయని కొంతమంది యువకులు గుడుంబా తయారు చేస్తున్న కేంద్రాలపై దాడి చేసి డ్రమ్ముల్లో ఉన్న గుడుంబాను పారబోసారు. అసలు ఎక్సైజ్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## నానో యూరియాతో రైతులకు మేలు

**ప్రజాపక్షం/గూడూరు;** నానో మూరియాతో రైతులకు మేలు జరుగుతుందని కావాలనే ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వం పై బుర ద జల్లుతున్నాయని కాంగ్రెస్ మానుకోట ఆదివాసి వైస్ చైర్మన్ భూక్య పద్మ బుద్రు నాయక్ అన్నారు.ఆదివారం గూడూరు మండల కేంద్రంలో ఆమెవిలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొంత మంది బిఆర్ఎస్ నాయకులు బిజెపి పార్టీల నాయకులు కావాలనే రాత్రి పగలు రైతుల వీడియోలు తీస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని, ఎప్పటికప్పుడు యూరియా గురించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.బిజెపి టిఆర్ఎస్ పార్టీలు రైతులను రెచ్చగొట్టి కాంగ్రెస్ పార్టీని అభాసుపాలు చేయాలని ఉద్దేశంతో ముందుకువెళ్లుతుందని, అయితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి టిఆర్ఎస్ కీ తమ రైతులు గుణఠం చెప్తారని అన్నారు.అయితే రైతులు నానో యూరియా తో కూడా మంచి ఫలితాలను రాబట్టవచ్చని తక్కువ పెట్టుబడి పెట్టే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకున్న నానో యూరియాను రైతులు వాడితే పంట దిగుబడి వస్తుందని ఆమె తెలిపారు.ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రూ.3 కోట్ల 69 లక్షల పనులకు శంకుస్థాపన
స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేకడియం శ్రీహరి
నియోజకవర్గం అభివృద్ధే వ్యాపకం



**ప్రజాపక్షం / వేలేరు :** తెలంగాణ రాష్ట్రంలోని ప్రతిపేద కుటుంబానికి సంక్షేమఫలాలు అందించాలనే ఏకైక లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేకడియం శ్రీహరి అన్నారు.ఆదివారం వేలేరు మండలంలోని పలుగ్రామాలలో రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పనుల జాతర2025 కార్యక్రమంలో భాగంగా రూ,3 కోట్ల 69లక్షలతో అభివృద్ధి పనులకు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేకడియం శ్రీహరి శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలుచేసి పనుల జాతర కార్యక్రమాన్ని ప్రారంభించారు.వేలేరు మండలంలోని మల్లికుదుర్లలో ఎస్‌సి కాలనీలో 25 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన,సోడశపల్లిలో ఎస్‌సీ కాలనీలో రూ,25లక్షలతో సిసిరోడ్ల నిర్మాణం,పీచర ఎస్‌సి కాలనీలో రూ,33 లక్షల 20వేలు శాలపల్లిలో రూ,12లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన,ఎస్‌సి కాలనీలో రూ,16 లక్షల 60 వేలతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన లోక్యతండలో రూ,2 కోట్లతో నిర్మించిన బీటి రోడ్డు ప్రాంభోత్సవం,రూ,12 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన వేలేరులో ఎస్‌సి కాలనీలో రూ,45 లక్షల 55 వేలతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన మొత్తం 3 కోట్ల 69 లక్షల 35వేల విలువగల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం వేలేరు మండలకేంద్రంలోని ఎస్‌సి కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పేదప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు సాగుతున్నాయని వేలేరు మండలానికి సంబందించి ఎంపిడిఓ కార్యాలయం నిర్మాణానికి రూ,1 కోటి 50 లక్షల మంజూరు అయ్యాయికానీ అవిసరిపోవని రూ,4 కోట్ల కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించనున్నట్లు పేర్కొన్నారు. వేలేరు మండలానికి గండిరామారం రిజర్వాయర్ నుండి వచ్చే యాసంగి వరకు సాగునీరు అందిస్తానని హామీఇచ్చారు,అలాగే వేలేరు మండలానికి అదనంగా 50 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు ఇవ్వడమేకాకుండా వేలేరు నుండి శాలపల్లి,పీచర,మద్దెగూడెం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం వచ్చేవేసవి వరకు పూర్తి చేస్తానని తెలిపారు.స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో గతపాలకులు 15 ఏళ్లు ఎంజాయ్ చేశారే తప్పా గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలి పదవులు,పనులు అమ్ముకుని వసూల్లకు పాల్పడి తినడం,తాగడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు.కడియం అంటేనే అభివృద్ధి,నీతి,నిజాయితీ,అనిస్పష్టం చేశారు.నాకుఏవ్యాపకాలు లేవని,వ్యవసాయంలేదు,వ్యాపారంలేదు,నాకున్నదిఒక్కటే వ్యాపకం అది నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం మాత్రమేనని తెలిపారు.నాకున్న ఆలోచనంతా ఏగ్రామానికి ఏంచేయాలి ,పేదప్రజలకు ఏవిధంగా సంక్షేమ పథకాలు అందించాలనే ఉంటుందని పేర్కొన్నారు.ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేయాలనీ మిగతా సమయంలో అందరం కలిసి నియోజకవర్గంలోని ప్రతిగ్రామాన్ని,ప్రతీ తండాను అభివృద్ధి చేసుకోవాలని,అందుకు ప్రతిఒక్కరూ కలిసిరావాలని కోరారు.కార్యక్రమంలో డిఆర్‌డిఓ మేన శ్రీనివాస్,పంచాయితీ రాజ్ శాఖ అధికారులు ఆత్మారామ్,జిల్లా వ్యవసాయశాఖఅధికారి ఆదిరెడ్డి,జిల్లా మహిళాసంక్షేమ శాఖఅధికారి జయంతి,తహసీల్దార్ హెచ్ కోమి,ఎంపిడిఓ లక్ష్మి ప్రసన్న,ఎఇ రూపాదేవి,ఎంపిఓ భాస్కర్,మాజి ప్రజాప్రథినిధులు,కాంగ్రెస్‌నాయకులు కత్తి సంపత్ బొజ్జ సమ్మయ్యయాదవ్,కూరపాటి అశోక్ పాల్గొన్నారు.

## ప్రజా జనహిత పాదయాత్రలో భాగస్వాములు కండి

ఎమ్మెల్యే నాగరాజు పిలుపు



**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** వర్ధన్నపేట నియోజకవర్గంలో ఇంచార్జి మీనాక్షి నటరాజన్, మహేష్ గౌడ్ చేపట్టే పాదయాత్ర లో స్వచ్ఛందంగా కార్యకర్తలు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కోరారు. ఏఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, తెలంగాణ ప్రదేశ్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జనహిత పాదయాత్ర ఆగస్టు 25న సాయంత్రం వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం వర్ధన్నపేట మండల పరిధిలోని ఇల్లంద మార్కెట్ చేపట్టే జనహిత పాదయాత్ర, కార్నర్ మీటింగ్ సంబంధించి పార్టీ కార్యకర్తలతో సమావేశంను విజయవంతం చేయటానికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధ్యక్షతన వర్ధన్నపేట టౌన్ లోని ఎమ్మెల్యే అధికార క్యాంప్ కార్యాలయం లో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిలుగా వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ పిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబు పాల్గొనగా టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ తో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. తొలుత ఇల్లంద గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించే స్థలాన్ని నేడు క్షేత్రస్థాయిలో నాయకుల, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఉన్న అన్ని విభాగాల శ్రేణులు స్వచ్ఛందంగా వేలాదిగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ ముఖ్య నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రజా ప్రభు త్వం అమలు చేస్తున్న అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు..గడిచిన 20 నెలల్లో భారతదేశంలోనే ఏ ప్రభుత్వం చేపట్టలేని అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా అమలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు సవివరంగా ఈ యాత్ర ద్వారా ప్రజలకు వివరిస్తామని చెప్పా రు.రాహుల్ గాంధీ చేపడుతున్న కార్యక్రమాలు, ఆలోచన విధానాలను ప్రజల వివరించే దిశగా సాగాలని ప్రజలకు మరి ంత చేరువ అయ్యేందుకు పాదయాత్ర దోహదపడుతుందని వివరించారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చాక అభివృద్ధి పథ ంలో ముందుకు వెళుతుందని ఇకపై అభివృద్ధి తో పాటు పార్టీ బలోపేతం,కార్యకర్తలు అభివృద్ధి,పదవులు విషయంలో మరి ంత చురుకుగా పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు .రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరుశాతం విజయం సా ధించి తీరుతామని ఆశాభావం వ్యక్తంచేశారు.ఈ సమన్వయ సమావేశంలో వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని రాష్ట్ర, జి ల్లా, బ్లాక్, మండల, డివిజన్, గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారుపాల్గొన్నారు

## బాధ్యులపై కఠిన చర్యలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ
పింగిలి శ్రీపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. రెండు రోజుల క్రితం విష తుల్యమైన మంచినీళ్లను తాగి అస్వస్థకు గురైన 11 మంది విద్యార్థులను ఆదివారం జిల్లా కేంద్రం లోని 100 పడకల ఆస్పత్రిలో పరామర్శించడం జరిగింది. అనంతరం, హాస్పిటల్ సూపరింటెంట్ తో ఫోన్ లో మాట్లాడుతూ, ఆసుపత్రి ఆవరణం శుభ్రంగా లేదని డ్యూటీ డాక్టర్లు, సూపర్నెంట్ అందుబాటులో లేరని, విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించేందుకు డ్యూటీ డాక్టర్లను అందుబాటులో ఉంచుతూ, అస్వస్థకు గరిగైన విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఆసుపత్రి పాలైన విద్యార్థులకు మెరుగైన పరీక్షల కొరకు ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేవని ప్రైవేటు ల్యాబ్లకు వెళ్లి టెస్టులు చేపించుకోవాలని విద్యార్థులకు పంపడం మంచిది కాదని, తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని రకాల ల్యాబ్ సౌకర్యాలను మెరుగుపరచాలని సూపరిండెంట్‌ను ఆదేశించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్ తో మాట్లాడి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ఆరోగ్యం మెరుగు పడేంత వరకు వారిని పర్యవేక్షిస్తూ అన్ని అవసరాలను దగ్గరుండి చూసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో రెండు రోజుల క్రితం విద్యార్థులు తాగే మంచినీళ్లలో విష ద్రావణాన్ని కలిపినట్టు విద్యార్థుల ద్వారా ప్రాథమిక విచారణలో తేలిందని, ఇలాంటి చెడు సంఘటనలు జరగడం చాలా బాధాకరమన్నారు. హెడ్మాస్టర్లు ఉపాధ్యాయులు పాఠశాలల్లో బాధ్యతగా ఉంటూ, వాతావరణ పరిస్థితులలో మార్పులకు అనుగుణంగా జాగ్రత్తలు పాటిస్తూ, విద్యార్థుల శ్రేయస్సు కొరకు పాటుపడాలి అని ఎమ్మెల్సీ సూచించారు. యుఆర్ఎస్ లో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడిన బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వెంట పిఆర్‌టియు టిఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రేగూరి సుబా కర్ రెడ్డి, కుసునపు కిరణ్ కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మందల రవీందర్ రెడ్డి ,కుసుమ కృష్ణమోహన్,భూపాలపల్లి మండల అధ్యక్ష ప్రధా న కార్యదర్శులు ,తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామానికీ నాణ్యమైన వైద్య సేవలు లక్ష్యం

పరకాల ఎమ్మెల్యే




**ప్రజాపక్షం/పరకాల :** పుట్టిన గడ్డకు సేవ చేయాలనే సంకల్పంతో వైద్య శిబిరం నిర్వహించిన దొమ్మాటి కుటుంబ సభ్యులను పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి అభినందించారు. ఆదివారం పరకాల మండలం మల్లక్క పేట గ్రామంలోటిపిసిసి ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో పరకాల శాసనసభుడురేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు .అంతకముందు మల్లక్కపేట ఆర్చ్ నుండి ప్రభుత్వ పాఠశాల వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. వైద్య సిబ్బందిని శాలువాతో ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని,ఆరోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండే విధంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం సమాజానికి మేలు చేస్తుందని అన్నారు.ఉచిత వైద్య శిబిరాలు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో దొమ్మాటి సాంబయ్యతో పాటు దొమ్మాటి ప్రసన్న కుమార్ రాజేశ్వరి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొజ్జం రమేష్, పరకాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడుకట్కూరి దేవేందర్ రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ రాజిరెడ్డి, డైరెక్టర్ దాసరి బిక్షపతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు ఎంపి కావ్య శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఆత్మకూరు:** ఆత్మకూరు మం డలం పెద్దపురం గ్రామంలో ఎంపీ లాడ్స్ నిధుల నుండి 20 లక్షల రూపాయల అం చనా వ్యయంతో నిర్మించనున్న మహిళా క మ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శాసన సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడి యం కావ్య శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ... దేశ ప్రగతి మహిళా అభ్యున్నతిపై ఆధారపడి ఉంటుందని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటు ంబం, సమాజం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని అన్నారు. సీ ఎం రేవ ంత్ రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తామన్న దిశగా, మొదటి సంవత్సరం 21,600 కోట్ల వడ్డీ లేని రు ణాలు మహిళా సంఘాలకు అందించామన్నారు. పెద్దపురం అభివృద్ధి కోసం ఎంపీ నిధుల ద్వారా 20 లక్షలు కేటాయించడం ఆనందం గా ఉందన్నారు. ఈ కమ్యూనిటీ హాల్ గ్రా మ మహిళలకు దోహదపడుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు.మహిళా అధ్యక్షురాలు రజిత, కవిత, జ్యోతి, స్పెషల్ ఆఫీసర్ నిర్మల, ఎమ్మార్వో జగన్మోహన్ రెడ్డి, ఎంపీఓ విమల, సీసీలు రజిని, భాగ్యలక్ష్మి , మా ర్కెట్ కమిటీ చైర్మన్ సునంద సుధాకర్ రెడ్డి, మరియు మ ండల పార్టీ, గ్రామ పార్టీ అధ్యక్షులు, సమన్వయ కమిటీ సభ్యులు మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రజా ప్రభుత్వం కృషి
విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే మధ్యాహ్న భోజనం



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల బంగారు భవిష్యత్తు కొరకు సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండల కేంద్రం లోని ప్రభుత్వ మోడల్ స్కూల్, కళాశాల, బిసిబాలికల వసతి గృహాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ప్రభుత్వ మోడల్ స్కూల్, కళాశాలకు ఎమ్మెల్యే చేరుకున్నారు. అక్కడ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో మంచినీటి కొరకు ఒక ఆర్వో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ కావాలని విద్యార్థులు అడగ్గా, వెంటనే సదరు గుత్తేదారుతో ఫోన్ లో మాట్లాడి వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా, వర్షానికి గ్రౌండ్లో నీరు నిలుస్తుందని, హాస్టల్లో ఫ్లోరింగ్ దెబ్బతిన్నదని విద్యార్థులు ఎమ్మెల్యేకు తెలిపారు. దీంతో, ఎమ్మెల్యే ఈడబ్ల్యూఐడిసి ఏఈ కి ఫోన్ చేసి అవసరమైన ఎస్టిమేషన్లను రేపటికల్లా తయారుచేసి వెంటనే పనులను ప్రారంభించాలని సూచించారు. కస్తూర్బా గాంధీ ఇంటర్మీడియట్ బిల్డింగ్ శిథిలావస్థలో ఉందని, కొత్త భవనం కావాలని ఉపాధ్యాయులు ఎమ్మెల్యేలను కోరారు. అనంతరం చికెన్ ఇతర సరుకులను ఆలస్యంగా సప్లై చేసిన సదరు కాంట్రాక్టర్ పై చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి హాస్టల్లో సౌకర్యాలు, అల్పాహారం, భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బిసి బాలికల వసతి గృహం వరకు ఎమ్మెల్యే నడుచుకుంటూ వెళ్లారు. అక్కడ వంటశాలలో వండుతున్న ఆహార పదార్థాలను ఎమ్మెల్యే పరిశీలించి, వంటలను రుచి చూశారు. అనంతరం అక్కడ ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈరోజు విద్యార్థులకు వడ్డించే బగారా రైస్ లో కొన్ని పదార్థాలు కలపకపోవడంతో ఎమ్మెల్యే వార్డెన్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు టెక్ట్స్ బుక్స్, ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలు కావాలని ఎమ్మెల్యేను అడిగారు. వెంటనే సంబంధిత అధికారులకు ఆ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని వసతి గృహాల్లో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు భోజనాన్ని అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. అందులో భాగంగానే విద్యార్థులకు మెస్ చార్జీలతో పాటు కాస్మోటిక్ ఛార్జీలను కూడా పెంచినట్లు ఎమ్మెల్యే గుర్తుచేశారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని సూచించారు.

**గణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే**

గణపురం మండల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) ను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మెల్యేకు వైద్యాధికారిణి డాక్టర్ అనూష స్వాగతం పలికారు. ఎమ్మెల్యే హాస్పిటల్ లోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మరింత చేరువగా నాణ్యమైన సేవలు అందించడానికి ప్రభుత్వం అందించే ఆరోగ్య సేవలను, మాత, శిశు సంరక్షణ సేవలు, కుటుంబ నియంత్రణ, సాధారణ ప్రసవాల పట్ల అవగాహన పెంచుతూ, ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను పెంచాలని వైద్యాధికారిణిని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆసుపత్రికి ప్రతిరోజు రోగులు ఎంత మంది వస్తున్నారని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పెండింగ్ లో ఉన్న పనులను వైద్యాధికారిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా, పెండింగ్ పనులకు సంబంధించి ఎస్టిమేట్స్ ను తయారు చేసుకుని రావాలని సంబంధిత శాఖ డీఈ ని ఎమ్మెల్యే ఫోన్లో కోరారు.



కర్ణాటక సిపిఐ నేతలు

కేరళ సిపిఐ నేతలు

పుదుచ్చేరి సిపిఐ నేతలు

తమిళనాడు సిపిఐ నేతలు





# ఎర్రసూర్యుడికి విప్లవ జోహార్లు







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com